చించినాడలో పోలీసుల దాష్టీకం

- మట్టి తవ్వకాలను అడ్డుకున్న పేదలపై లాఠీఛార్జి
- ఎమ్మెల్యే నిమ్మల, సిపిఎం, టిడిపి నాయకులను రోడ్డుపై ఈడ్చేసిన పోలీసులు
- 50 మంది అరెస్ట్

2

PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 42 సంచిక : 306 | విజయవాడ, బుధవారం 7 జూన్ 2023 | 8 + 8 పేజీలు వెల : 5. 50

Vol No | Vijayawada, Wednesday 7 June 2023 | Rs



రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు సురినాం అత్యున్నత పౌర పురస్కారం

• లోపలి పేజీలో.. •



మణిపూర్‌లో ఆరని హింసాగ్ని

- కాల్పుల్లో బిఎస్‌ఎఫ్ జవాన్ మృతి
- మరో ఇద్దరు సైనికులకు గాయాలు

ఇంఫాల్ : బిజెపి ప్రభుత్వ అసమర్ధ నిర్వాకంతో మణిపూర్‌లో తలెత్తిన హింసకు తాజాగా బిఎస్‌ఎఫ్ జవాన్ ఒకరు మరణించారు. మరో ఇద్దరు ఆర్మీ జవాన్లు గాయపడ్డారు. ప్రభుత్వం రగిలించిన రిజర్వేషన్ల చిచ్చు, అటవీ ప్రాంతం నుంచి మైనార్టీ గిరిజనులను గెంటివేసేందుకు చేసిన యత్నాలతో తలెత్తిన జాతి ఘర్షణలు దావానలంలా విస్తరిస్తున్నాయి. మైనార్టీ కుకీ, ఇతర గిరిజన తిరుగుబాటుదారులను అణచివేసేందుకు ప్రభుత్వం సైన్యాన్ని రంగంలోకి దింపింది. భద్రతా దళాలు ఏజెన్సీ ప్రాంతంలో విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టాయి. ఈ సందర్భంగా భద్రతా దళాలకు, తిరుగుబాటు దారులకు మధ్య అడపా దడపా కాల్పులు జరిగాయి. మంగళవారం తెల్లవారుజామున 4.15 గంటల ప్రాంతంలో జరిగిన ఓ కాల్పుల సంఘటనలో సరిహద్దు భద్రతా దళానికి (బిఎస్‌ఎఫ్‌కు) చెందిన ఒక జవాన్ చనిపోయాడు. ఆర్మీలో భాగమైన అస్సాం రైఫిల్స్‌కు చెందిన మరో ఇద్దరు జవాన్లు గాయపడ్డారు. కాక్‌చింగ్ జిల్లాలోని సెరౌ గ్రామం వద్ద నీ ఘటన చోటుచేసుకుంది. మరణించిన బిఎస్‌ఎఫ్ కానిస్టేబుల్‌ను రంజిత్ యాదవ్‌గా గుర్తించారు. గాయపడిన సిబ్బందిని వాయుమార్గం ద్వారా మాన్‌త్రిపుఖ్రిలోని ఆసుపత్రికి తరలించారు. కాల్పుల జరిపిన ప్రాంతంలో దుండగుల కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని సైన్యం తెలిపింది. దుండగులు భారీ స్థాయిలో కాల్పులు జరుపుతున్న సమయంలో రంజిత్ యాదవ్ ధైర్యాన్ని, అంకితభావాన్ని, కర్తవ్య నిర్వహణ పట్ల చిత్తశుద్ధిని ప్రదర్శించాడని బిఎస్‌ఎఫ్ ఒక ప్రకటనలో తెలిపింది.

ఇంటర్నెట్‌పై నిషేధం పొడిగింపు

మణిపూర్‌లో హింసాగ్ని రగులుతూనే ఉండడంతో ఇంటర్నెట్‌పై నిషేధాన్ని మరికొన్ని రోజులు పొడిగించారు. ఈ నెల 10 తేదీ సాయంత్రం 3 గంటల వరకూ రాష్ట్రంలో ఇంటర్నెట్‌పై నిషేధాన్ని పొడిగించినట్లు కమిషనర్ (హోం) హెచ్ జ్ఞాన ప్రకాశ్ ఉత్తర్వులు జారీ చేశారు. బ్రాడ్‌బ్యాండ్‌తో సహా మొబైల్ డేటా సర్వీసులపై ఇంటర్నెట్ నిషేధం కొనసాగుతుందని తెలిపారు. మణిపూర్‌లో మే 3 నుంచి ఇంటర్నెట్‌పై నిషేధం కొనసాగుతున్న సంగతి తెలిసిందే. అలాగే, ప్రస్తుతం మణిపూర్‌లో 10 వేలకు పైగా ఆర్మీ, అస్సాం రైఫిల్స్ సిబ్బంది మోహరించి ఉన్నారు.

ఒడిషా రైలు ప్రమాదంపై సిబిఐ దర్యాప్తు షురూ

బాలాసోర్ : ఒడిషా రైలు ప్రమాద దుర్ఘటనపై సిబిఐ మంగళవారం దర్యాప్తును చేపట్టింది. రైల్వే మంత్రిత్వ శాఖ నుండి వచ్చిన ప్రస్తావనపై రాష్ట్రప్రభుత్వ అనుమతితో సిబిఐ తిరిగి కేసును నమోదు చేసింది. ఆధారాలు సేకరించేందుకు సిబిఐ బృందం బాలాసోర్‌కు చేరుకుందని సిబిఐ అధికారులు తెలిపారు. అంతకుముందు, అసిస్టెంట్ సబ్ ఇనస్పెక్టర్ పాపు కుమార్ నాయక్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా, నిర్లక్ష్యమే ఈ ఘటనకు దారి తీసిందని పేర్కొంటూ బాలాసోర్ ప్రభుత్వ రైల్వే పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. "కోరమాండల్ ఎక్స్‌ప్రెస్, యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్‌లు ఢీకొనడంతో రెండు రైళ్ల బోగీలు బోల్తా పడ్డాయి. ఈ దుర్ఘటనలో 278మంది మరణించగా, వందలాదిమంది గాయపడ్డారు. మృతదేహాలను, గాయపడిన వారిని బాలాసోర్ జిల్లా ప్రధాన ఆస్పత్రికి, సోరో కమ్యూనిటీ హెల్త్ సెంటర్, భద్రక్ జిల్లా ఆస్పత్రులకు తరలించారు. సహాకక చర్యలు కొనసాగుతున్నాయి." అని ఎఫ్ఐఆర్ పేర్కొంది. "ప్రస్తుత తరుణంలో రైల్వే ఉద్యోగుల నేరమనేది నిర్ధారించబడలేదు. దర్యాప్తు సమయంలో ఈ విషయం తేలనుంది." అని ఎఫ్ఐఆర్ పేర్కొంది. రైల్వే భద్రతా చీఫ్ కమిషనర్ (సిసిఆర్ఎస్) శైలేష్ కుమార్ పాథక్ సోమవారం సంఘటనా స్థలాన్ని సందర్శించి, తమ దర్యాప్తులో భాగంగా అక్కడ ప్రజలతో మాట్లాడారు. సిబిఐ, సిసిఆర్ఎస్‌ల దర్యాప్తు పూర్తయిన తర్వాతనే ఈ ప్రమాదానికి గల కారణమేంటనేది తెలుస్తుందని అధికారులు తెలిపారు. బాలాసోర్‌లోని ప్రభుత్వ రైల్వే పోలీసు స్టేషన్ ఎఫ్ఐఆర్ నమోదు చేసిందని, దర్యాప్తు చేస్తోందని చెప్పారు. ఈ నెల 2వ తేది రాత్రి 7గంటల సమయంలో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఇప్పటివరకు 177 మృతదేహాలను గుర్తించి, వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

నిర్వాసితుల తరలింపు
షెడ్యూల్ ప్రకారమే

- చిన్న గైడ్‌వాల్ సమస్యను విపత్తుగా చూపడం దారుణం
- పోలవరం ప్రాజెక్టు సమీక్షలో సిఎం జగన్



పోలవరం ప్రాజెక్టు వద్ద అధికారులను వివరాలు అడిగి తెలుసుకుంటున్న సిఎం జగన్మోహన్‌రెడ్డి

ప్రజాశక్తి- ఏలూరు ప్రతినిధి

నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం పోలవరం నిర్వాసిత కుటుంబాలను తరలించేలా చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం పోలవరం ప్రాజెక్టు ప్రాంతంలో ఆయన పర్యటించారు. పోలవరం ప్రాజెక్టు ప్రాంతంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్దకు ఉదయం 10.05 గంటలకు చేరుకున్న ముఖ్యమంత్రికి మంత్రులు, ఎంఎల్‌ఎలు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు స్వాగతం పలికారు. అనంతరం వ్యూ పాయింట్ నుంచి పోలవరం ప్రాజెక్టును సిఎం పరిశీలించారు. గత సీజన్‌లో ఎత్తు పెంచిన ఎగువ కాపర్ డ్యాం, ఇటీవల పూర్తయిన దిగువ కాపర్‌డ్యాం, డయాఫ్రం వాల్ ప్రాంతంలో కొట్టుకుపోయిన ఇసుకను నింపే వైబ్రో కాంపాక్షన్ పనులను, అక్కడ ఏర్పాటు చేసిన మ్యాప్ పాయింటింగ్‌ను పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం అక్కడే ప్రాజెక్టు పనులపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై దిశానిర్దేశం చేస్తూ మాట్లాడారు. పునరావాస కాలనీల్లో అన్ని మౌలిక సౌకర్యాలూ ఏర్పాటు చేయాలన్నారు. కాలనీలు పూర్తవుతున్న తరుణంలోనే సమాంతరంగా వసతులు కూడా కల్పించాలని ఆదేశించారు. ఇప్పటివరకూ 12,658 నిర్వాసిత కుటుంబాలను తరలించినట్లు సిఎం తెలిపారు. డయాఫ్రం వాల్ ప్రాంతంలో పునర్నిర్మాణ పనులు, ఆ తర్వాత ఇసిఆర్‌ఎఫ్ డ్యాం నిర్మాణాలపై అధికారులతో చర్చించారు. దెబ్బతిన్న డయాఫ్రం వాల్‌ను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఇది పూర్తయితే మెయిన్ డ్యాం పనులు చురుగ్గా కొనసాగడానికి అవకాశం ఉంటుందన్నారు. డిసెంబర్ నాటికి పనులు పూర్తి చేయడానికి కార్యాచరణతో ముందుకు వెళ్తున్నట్లు అధికారులు తెలిపారు. పోలవరం ప్రాజెక్టు ప్రాంతాన్ని టూరిస్ట్ స్పాట్‌గా తీర్చిదిద్దాలని అధికారులకు సిఎం సూచించారు. పోలవరం వద్ద మంచి బ్రిడ్జి నిర్మించాలని, పర్యాటకులు ఉండేందుకు మంచి సదుపాయాలతో ఇక్కడ హోటళ్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.


ప్రాజెక్టు స్ట్రక్చర్‌తో గైడ్‌వాల్‌కు సంబంధం లేదు

ప్రాజెక్టు స్ట్రక్చర్‌తో ఏ మాత్రమూ సంబంధం లేనిది గైడ్‌వాల్ అని, విమర్శలను పాజిటివ్‌గా తీసుకుని ముందుకుసాగాలని ముఖ్యమంత్రి అన్నారు. ఇటువంటి భారీ ప్రాజెక్టు నిర్మాణంలో సహజంగానే చిన్నచిన్న సమస్యలు వస్తాయని పేర్కొన్నారు. వాటిని గమనిస్తూ ఎప్పటికప్పుడు మరమ్మతులు చేసుకుంటూ ముందుకు సాగాలని సూచించారు. పోలవరం ప్రాజెక్టులో ఇలాంటి ఒక చిన్న సమస్యను విపత్తుగా చూపించే మీడియా మన రాష్ట్రంలో ఉందంటూ మండిపడ్డారు. గత ప్రభుత్వ హయాంలో ఎగువ కాఫర్ డ్యాంలో ఖాళీలు వదిలేశారని, ఈ ఖాళీలగుండా వరద నీరు అతివేగంతో ప్రవహించడం వల్ల ప్రాజెక్టుకు నష్టం వాటిల్లిందని తెలిపారు. ఇఎస్‌ఆర్‌ఎఫ్ డ్యాం నిర్మాణానికి కీలకమైన డయాఫ్రం వాల్ దారుణంగా దెబ్బతినడంతో ప్రాజెక్టు ఆలస్యం కావడమే కాకుండా రూ.2 వేల కోట్లు అదనంగా ఖర్చు చేయాల్సి వచ్చిందన్నారు.

గైడ్‌వాల్ డిజైన్లన్నీ కేంద్ర జలసంఘం, సిడబ్ల్యుసి ఖరారు చేశాయి : సిఎంకు వివరించిన అధికారులు

పోలవరం ప్రాజెక్టు తొలి దశ పనులు పూర్తి చేయడానికి రూ.12,911.15 కోట్లు ఇచ్చేందుకు కేంద్రం అంగీకరించిందని ముఖ్యమంత్రికి అధికారులు తెలిపారు. దెబ్బతిన్న డయాఫ్రం వాల్ ప్రాంతంలో నిర్మాణాల కోసం అదనంగా రూ.2 వేల కోట్లు ఇచ్చిందని వివరించారు. కాంపౌండ్ వారీగా బిల్లుల చెల్లింపు వల్ల ప్రాజెక్టు నిర్మాణాలు ఆలస్యమవుతున్న విషయాన్ని పరిగణనలోకి తీసుకుని దానికి కేంద్ర ప్రభుత్వం మినహాయింపులు కూడా ఇచ్చిందని తెలిపారు. గైడ్‌వాల్ డిజైన్లన్నీ కేంద్ర జలసంఘం, సిడబ్ల్యుసి

మిగతా 2లో



కర్ణాటకలో రోడ్డు ప్రమాదం

- సంద్యాలకు చెందిన ఐదుగురు మృతి
- గుల్బర్గా ఉరుసుకు వెళ్లివస్తుండగా దారుణం

• లోపలి పేజీలో.. •

ఘనంగా గిరిజన సాంస్కృతిక సంబరాలు

- ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలి : మాజీ ఎంపి పి.మధు



కొమ్ము కోయ నృత్యంతో ఆకట్టుకున్న కళాకారులు, (ఇన్‌సెట్‌లో) మాట్లాడుతున్న మధు

ప్రజాశక్తి- అరకులోయ

ఈ నెల 8, 9 తేదీల్లో నిర్వహించనున్న ఎపి గిరిజన సంఘం ఎనిమిదో రాష్ట్ర మహాసభను పురస్కరించుకుని అరకులోయలో మూడు రోజులపాటు తలపెట్టిన గిరిజన సాంస్కృతిక సంబరాలు మంగళవారం సాయంత్రం ఉత్సాహపూరిత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. సాంస్కృతిక ప్రదర్శనలను తిలకించేందుకు పెద్ద సంఖ్యలో గిరిజనులు తరలివచ్చారు. తొలుత ఈ సంబరాలను సిపిఎం మాజీ ఎంపి, ఎంబివికె ట్రస్టు చైర్మన్ పి.మధు ఢంకా బజాయించి ప్రారంభించారు. మర్రి కామయ్య కళా వేదికపై అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు కొమ్ముకోయ నృత్య ప్రదర్శన, గిరిజన బాలల నృత్యం, బలి నాటకం, అనంతగిరి మండలం సింగర్భ గ్రామస్తుల కళాకారుల వాయిద్య ప్రదర్శన, చొంపి గ్రామస్తుల థింసా నృత్యం చూపరులను అమితంగా ఆకట్టుకున్నాయి. హాజరైన వారంతా డప్పు వాయిద్యాలకు ఉత్సాహంతో చిందేశారు. మునుపెన్నడూ లేనివిధంగా ఈ సంబరాలు జరగడంతో అరకులోయ పర్యాటకులు సైతం మంత్రముగ్ధులయ్యారు.

సంబరాల ప్రారంభం సందర్భంగా మధు మాట్లాడుతూ గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు కనుమరుగవుతున్న నేటి తరుణంలో వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు. ఇప్పటికే మన్య ప్రాంతంలోని మోదకొండమ్మ ఉత్సవాలను గిరిజనేతరులు కబ్జా చేసేశారన్నారు. ఆదివాసీల సంస్కృతిని పాలకులు నాశనం చేస్తున్నారని, గిరిజన హక్కులపై దాడి పెరిగిందని తెలిపారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం... అదానీ వంటి కార్పొరేట్లకు అటవీ సంపదను దోచిపెట్టడానికి 1/70 చట్టానికి తూట్లు పొడుస్తోందని, అటవీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ ఒత్తిడితో అనంతగిరి మండలంలో హైడ్రో పవర్ ప్రాజెక్టుకు ఇష్టానుసారంగా రాష్ట్ర ప్రభుత్వం అనుమతులు ఇచ్చిందన్నారు. గిరిజనులకు నష్టం చేకూర్చే చర్యలపై అల్లూరి స్ఫూర్తితో ఆదివాసీలు పోరాడాలని పిలుపునిచ్చారు. గిరిజన సాంస్కృతిక సంబరాల నిర్వహణ కమిటీ చైర్మన్ టి.చిట్టిబాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆహ్వాన కమిటీ సభ్యులు కె.రఘునాథ్, కో-కన్వీనర్లు వి.మహేశ్వరరావు, పి.బాలదేవ్, పి.దేముడు, పి.జోషి, పి.నందు, వి.అరుణ్, కె.సురేంద్ర, మంతెన సీతారాం, పి.అప్పలనర్స, ఎస్.ధర్మాన పడాల్, పిఎన్ఎం రాష్ట్ర అధ్యక్షులు మంగరాజు, గుర్రం రమణ పాల్గొన్నారు.



జల విద్యుత్ డ్యామ్‌పై దాడి

- ఇది ఉక్రెయిన్ పనేనన్న ఖెర్సియా నగర మేయర్
- రష్యాదే బాధ్యత అంటూ ఉక్రెయిన్, పశ్చిమ దేశాల ఎదురు దాడి

ఖెర్సాన్: రష్యాలోని ఖెర్సాన్ ప్రాంతంలోని నొవయ కఖోవా ప్రాంతంలోని జల విద్యుత్ డ్యామ్‌పై మంగళవారం తెల్లవారు జామున పెద్ద దాడి జరిగింది. ఈ దాడిలో డ్యామ్ పాక్షికంగా దెబ్బ తినిపోయింది. వరదగేట్లు పగిలిపోయి వరద నీరు కట్టలు తెంచుకుని కిందికి ప్రవహిస్తుండడంతో దిగువ ప్రాంతంలో నీటి మట్టం అమాంతంగా 2.5 మీటర్ల ఎత్తుకు ఒక్కసారిగా పెరిగిపోయింది. దీంతో లోతట్టు ప్రాంత ప్రజలు వరద ముంపు భయంతో వణుకుతున్నారు. అయితే, ప్రస్తుతానికి ముంపు ప్రమాదమేమీ లేదని, ఎలాంటి విపత్కర పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని ఖెర్సాన్ నగర మేయర్ స్థానిక అధికారులను అప్రమత్తం చేశారు. ప్రస్తుతానికి విద్యుత్, గ్యాస్, ఇంటర్నెట్, కమ్యూనికేషన్స్‌తో సహా అన్ని సర్వీసులు అందుబాటులో ఉన్నాయని మేయర్ వ్లదిమిర్ లియొంతెవ్ ఆర్ఐఎ నొవొస్తి వార్తా సంస్థకు తెలిపారు. పరంపరగా సాగుతున్న ఉక్రెయిన్ దాడుల్లో భాగమే ఇది అని

మిగతా 7లో



రామోజీరావు ఇంటి గేటు బయట నిరీక్షిస్తున్న సిఐడి అధికారులు

ఖాతాదారుల నిధుల మళ్లింపుపై ఆరా!

- మార్గదర్శి ఎండి శైలజాకిరణ్‌ను ప్రశ్నించిన సిఐడి


ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

మార్గదర్శి చిట్ ఫండ్స్ కేసులో నిందితురాలుగా ఉన్న ఆ సంస్థ ఎండి శైలజా కిరణ్‌ను ఆంధ్రప్రదేశ్ సిఐడి అధికారులు మంగళవారం విచారించారు. సిఐడి విచారణాధికారి రవికుమార్ నేతృత్వంలో 30 మంది బృందం ఉదయం 10.30 గంటల ప్రాంతంలో జూబ్లీహిల్స్‌లోని రామోజీరావు నివాసానికి చేరుకుంది. ఉదయం 11 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు సిఐడి అధికారులు ఆమెను ప్రశ్నించినట్లు తెలిసింది. మార్గదర్శి ఖాతాదారుల నగదు దారి మళ్లింపుపైనే ప్రధానంగా దృష్టి సారించిన సిఐడి... వాటిని ఎక్కడకు తరలించారనే దానిపై ఆరా తీసింది. నిబంధనల ఉల్లంఘనకు సంబంధించిన ఆధారాల మేరకు ముందుగానే సిద్ధం చేసిన ప్రశ్నావళిని ఆమె ముందుంచి విచారించారు. విచారణ మొత్తాన్ని సిఐడి అధికారులు వీడియో రికార్డింగ్ చేశారు. చాలా ప్రశ్నలకు తనకు తెలియదని సమాచారమిచ్చిన ఆమె.. మార్గదర్శి వ్యాపారంలో అంతా నిబంధనల మేరకే నడుచుకున్నామని సమాధానమిచ్చినట్లు తెలిసింది.

పబ్లిసిటీ వద్దు.. భద్రతకు ప్రాధాన్యమివ్వండి

రైలు ప్రమాదాలపై కేంద్రానికి సీతారాం ఏచూరి హితవు

న్యూఢిల్లీ : రైల్వేల విషయంలో మోడీ సర్కారు పబ్లిసిటీని పక్కన పెట్టి భద్రతకు ప్రాధాన్యతనివ్వాలని సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి అన్నారు. అలా చేస్తే అనేక అంశాల్లో మెరుగుదల ఉంటుందని తెలిపారు. రైలు ప్రమాదాలన్నీ నివారించదగినవేనని అన్నారు. కేంద్రం ప్రచారార్భాటాలతో సంపన్నుల కోసం కాకుండా ప్రయాణికులకు మౌలిక వసతులు అందించాలని సూచించారు. ఒడిశా ప్రమాద ఘటన నేపథ్యంలో ఒక వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడారు. రైల్వేలో అనేక సమస్యలు దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. రైల్వేలో గ్యాంగ్‌మెన్లది కీలక స్థానమని, వారిపై పని భారం రెట్టింపు కావటం వల్ల తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారని చెప్పారు. సిగ్నల్ వ్యవస్థ ఆధునీకరణను పట్టించుకోలేదని అన్నారు. రైల్వే శాఖ నియమించిన టాస్క్‌ఫోర్స్ కమిటీ రైల్వే ట్రాక్‌ల పునరుద్ధరణ సమస్యను, సిగ్నలింగ్ వ్యవస్థను తక్షణమే పరిష్కరించాలని తన నివేదికలో హెచ్చరికలు చేసినా పట్టించుకోలేదని చెప్పారు. 2022 బడ్జెట్ కేటాయింపుల్లో ట్రాక్‌ల పునరుద్ధరణ నిధుల్లో 14 శాతం కోత పెట్టారన్నారు. 'రైల్వే భద్రతకు సంబంధించిన మౌలిక సదుపాయాల కల్పన కంటే పబ్లిసిటీ కోసం ప్రారంభించే రైళ్ల మీద ఎక్కువ ఖర్చు చేస్తున్నారు. ఇప్పటికే దేశంలో శతాబ్ది, రాజధాని వంటి హైస్పీడ్ రైళ్లు ఉన్నాయి. వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు కూడా దాదాపు అదే స్పీడుతో నడుస్తున్నాయి.



దశాబ్దాలుగా రైల్వే ట్రాక్‌ల మనుగడ ప్రశ్నార్థకంగా ఉన్నది. బుల్లెట్ రైళ్ల లోడ్‌ను, స్పీడ్‌ను అవి భరించగలవా?' అని ప్రశ్నించారు. రైల్వేలో 3.12 లక్షల పోస్టులు ఖాళీగానే ఉన్నాయని తెలిపారు. సమగ్ర విచారణలోనే ఒడిశా ప్రమాదానికి గల కారణాలు తెలుస్తాయన్నారు. కోరమాండల్ ఎక్స్‌ప్రెస్‌లో రిజర్వ్ కంపార్ట్‌మెంట్‌లో జనాలు కిక్కిరిసిపోయి ఉన్న దృశ్యాలు హృదయవిదారకంగా ఉన్నాయని తెలిపారు. రిజర్వ్ కంపార్ట్‌మెంట్‌లో ప్రయాణించిన ఇతరుల వివరాలు ఎలా తెలుస్తాయని ప్రశ్నించారు. "ధనిక, పేద అందరూ ఒకే రైలులో ప్రయాణిస్తారు. అయితే, పేదలు ప్రయాణించే ప్యాసింజర్ రైళ్లను తొలగిస్తూ.. వారు భరించలేనటువంటి హైస్పీడ్ ట్రైన్ల పైనే దృష్టి పెడుతున్నారు. ఇలా భారత రైల్వేలోనూ రెండు రకాల భారతీయులను తయారు చేస్తున్నారు" అని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. "భారతీయ రైల్వే అనేది కోట్లాది మందికి ముఖ్యంగా పాలు, కూరగాయలు అమ్ముకునేటువంటి కార్మిక జీవులకు ఎంతగానో ఉపయోగపడుతున్నది. వారిని పట్టించుకోకపోవటం వల్లే రిజర్వ్ బెర్తుల్లో ఇలాంటి పరిస్థితులు ఏర్పడుతున్నాయి. పబ్లిసిటీ కోసం ప్రారంభించే రైళ్లను సంపన్నులు మాత్రమే ఉపయోగించుకోగలుగుతారు. వీటి మీద దృష్టిని సారించటం కంటే ప్రయాణికులకు వసతులు కల్పించటంపై దృష్టి సారించడం మేలు" అని తెలిపారు.

ఒడిశా ఘటనలో మృతదేహాలను గుర్తించే ప్రక్రియ అమానవీయంగా ఉన్నదన్నారు. క్షతగాత్రులకు సరైన వైద్య సదుపాయం అందేలా చూడాలని చెప్పారు. భారతీయ రైల్వేను ప్రయివేటీకరణ చేయడం లేదన్న ప్రభుత్వ ప్రకటనలు ఓ జిమ్మిక్కనీ, రైల్వేకు ఉన్న అనేక భూములను ప్రయివేటు వ్యక్తులకు అమ్మడం, లీజుకివ్వటం జరుగుతున్నదని తెలిపారు. ప్రభుత్వం పబ్లిసిటీ మీద కాకుండా రైల్వే భద్రతకే ప్రాధాన్యతనిస్తే అనేక అంశాల్లో మెరుగుదల కనిపిస్తుందన్నారు. తాజా ప్రమాద ఘటనపై సమగ్ర దర్యాప్తు జరపాలని ఆయన కోరారు.

వామపక్షాల ఆందోళన 11కు వాయిదా

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా పర్యటన ఈ నెల 8 నుంచి 11కు వాయిదా పడినందున తమ నిరసన కార్యక్రమాన్ని కూడా ఈ నెల 11కు వాయిదా వేసినట్లు వామపక్ష పార్టీలు ప్రకటించాయి. ఈ మేరకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణతోపాటు ఇతర వామపక్ష పార్టీల నాయకులు సాంబశివరావు (సిపిఐ (యంఎల్) న్యూడెమోక్రసి), జాస్తి కిషోర్‌బాబు (సిపిఐ (యంఎల్)), కాటం నాగభూషణం (యంసిపిఐ (యు)), యన్ మూర్తి (సిపిఐ (యంఎల్) లిబరేషన్), బిఎస్ అమర్‌నాథ్ (యస్‌యుసిఐ (సి)), పివి సుందరరామరాజు (ఫార్వర్డ్‌బ్లాక్), జానకి రాములు (రివల్యూషనరీ సోషలిస్టు పార్టీ), చిట్టిపాటి వెంకటేశ్వర్లు (సిపిఐ(యంఎల్) న్యూడెమోక్రసీ) మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కేంద్రంలో మోడీ అధికారంలోకి వచ్చి తొమ్మిదేళ్లపూర్తయిన సందర్భంగా బిజెపి ఆధ్వర్యాన విశాఖపట్నంలో జరిగే బహిరంగసభ ఈ నెల 8 నుంచి 11వ తేదీకి వాయిదా పడిన నేపథ్యంలో హోంమంత్రి అమిత్ షా పర్యటన కూడా 11కు వాయిదా పడినందున ఈ కార్యక్రమాన్ని వాయిదా వేసినట్లు వారు తెలిపారు. ప్రజలు, వామపక్షవాదులు, ప్రజాతంత్రవాదులు, రాష్ట్రాభివృద్ధిని కోరుకునే సంస్థలు, మేధావులు ఈ నిరసన కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు.

చించినాడలో పోలీసుల దాష్టీకం

- మట్టి తవ్వకాలను అడ్డుకుంటున్న పేదలపై లాఠీఛార్జి
- ఎమ్మెల్యే నిమ్మల, సిపిఎం, టిడిపి నాయకులను నడిరోడ్డుపై ఈడ్చేసిన పోలీసులు
- 50 మంది అరెస్ట్

ప్రజాశక్తి - యలమంచిలి/భీమవరం (పశ్చిమగోదావరి)

పశ్చిమగోదావరి జిల్లా యలమంచిలి మండలంలోని చించినాడ గ్రామం రణరంగంగా మారింది. ఈ పంచాయతీ పరిధిలోని పెరుగులంక భూముల్లో మట్టి అక్రమ తవ్వకాలను అడ్డుకునేందుకు వెళ్లిన పేదలపై, నేతలపై పోలీసులు జులుం ప్రదర్శించారు. అడ్డొచ్చిన దళితులపై, పేదలపై లాఠీఛార్జి చేశారు. పాలకొల్లు ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడుతో పాటు సిపిఎం, ఐద్వా ముఖ్యనేతలు, మరో 50 మంది సిపిఎం, టిడిపి నాయకులను అరెస్టు చేసి వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించారు. ఈ ఘటనలో సిపిఎం నాయకులు తెన్నేటి స్టాలిన్, శ్రీనివాస్ తలకు బలమైన గాయాలు కాగా మరికొంత మంది మహిళలకు గాయాలయ్యాయి. ఈ నేపథ్యంలో ఆ ప్రాంతం ఉద్రిక్తంగా మారింది. అనేక ఏళ్లుగా పేదల ఆధీనంలో ఉన్న పెరుగులంకలో మట్టి తవ్వకాలను అడ్డుకునేందుకు పేదలు పెద్దఎత్తున ఉద్యమిస్తున్నారు. ఈ పోరాటానికి ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు మద్దతు తెలిపారు. ఈ క్రమంలో సోమవారం రాత్రి సిపిఎం, టిడిపి నాయకులతో కలిసి పెరుగులంకలోనే ఆయన బసచేశారు.

బయటకు వెళ్లి తిరిగి కారులో లంకలోకి వస్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పేదల భూముల్లో మట్టి అక్రమ తరలింపును అడ్డుకోవాల్సిన రెవెన్యూ యంత్రాంగం ఉండాల్సిన చోట పోలీసులకు ఏమి సంబంధమని ఎమ్మెల్యే ప్రశ్నించారు. సుమారు గంటపాటు పోలీసులకు ఎమ్మెల్యే మధ్య తీవ్ర వాగ్వివాదం జరిగింది. అప్పటికే ఎమ్మెల్యే కారును సుమారు 200 మంది పోలీసులు చుట్టుముట్టారు. ఎమ్మెల్యేను బలవంతంగా కారులో నుంచి ఈడ్చుకెళ్లి పోలీసు జీపులో ఎక్కించేందుకు ప్రయత్నించారు. అప్పటికే అక్కడికి చేరుకున్న వందలాదిమంది పేదలు, సిపిఎం, టిడిపి, మహిళా సంఘం నాయకులు రోడ్డుకు అడ్డంగా పడుకుని, పోలీసు జీపులను అడ్డగించే ప్రయత్నం చేశారు.


పేదలను ఈడ్చిపడేస్తున్న పోలీసులు

పోలీసులు లాఠీలను ఝుళిపించారు. దొరికిన వారిని దొరికినట్లు ఈడ్చుకుంటూ తీసుకెళ్లి వ్యాను, బస్సులలో ఎక్కించి అరెస్టు చేశారు. ఈ క్రమంలో సుమారు పదిమంది వరకూ మహిళలకు, పురుషులకు తీవ్ర గాయాలైనట్లు ప్రజా సంఘాల నాయకులు తెలిపారు. గాయపడిన వారిని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అరెస్టు చేసిన వారిని గణపరం స్టేషన్‌తో పాటు పలు స్టేషన్లకు తరలించారు.

అక్రమ అరెస్టులకు సిపిఎం ఖండన

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పశ్చిమగోదావరి జిల్లా ఎలమంచిలి మండలం చించినాడ గ్రామం పెరుగులంక భూముల్లో అక్రమ తవ్వకాలకు వ్యతిరేకంగా, శాంతియుతంగా ఆందోళన చేస్తున్న దళితులపై లాఠీఛార్జి చేసి, అక్రమంగా అరెస్టు చేయడాన్ని సిపిఎం రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు మంగళవారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. పెరుగులంక భూముల్లో 380 దళిత, బిసి, పేద కుటుంబాలు పట్టాలు పొంది 40 ఏళ్లుగా సాగుచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాయని పేర్కొన్నారు. సాగులో వున్న ఈ భూముల్లో అక్రమ ఇసుక తవ్వకాలు ఆపాలని దళితులు ఆందోళన చేస్తున్నా, ప్రభుత్వ చీఫ్‌విప్ ప్రసాదరాజు అండతో అక్రమంగా తవ్వకాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ భూముల్లో తవ్వకాలు చేపట్టరాదని హైకోర్టు ఆదేశాలున్నప్పటికీ ప్రభుత్వ చీఫ్ విప్ ప్రసాదరాజు అండతో చట్టాన్ని ధిక్కరించి తవ్వకాలు కొనసాగిస్తున్నారని విమర్శించారు. ఈ అక్రమ తవ్వకాలకు పోలీసు, ప్రభుత్వ యంత్రాంగం అండగా వుంటోందన్నారు. తనకు ఎదురు చెబుతున్నారని చించినాడ ప్రజలు, దళితులపై ప్రసాదరాజు కక్ష కట్టి వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. కాంట్రాక్టర్లకు మట్టిని అక్రమంగా కట్టబెట్టేందుకు ప్రభుత్వ విప్ పూనుకోవడం తగదన్నారు. ఈ అక్రమ తవ్వకాలతో గోదావరి గట్టుకు ప్రమాదం ఏర్పడే అవకాశం వుందని ఆందోళన వ్యక్తం చేశారు. వరదల్లో కట్టతెగి పొలాల్లోకి నీళ్లు వస్తే అందుకు ప్రభుత్వ యంత్రాంగమే బాధ్యత వహించాల్సి వుంటుందని అన్నారు. అక్రమంగా మట్టి తవ్వుతారనే ఆందోళనతోనే 5న రాత్రంతా ఈ భూములను సాగుచేసుకుంటున్న పేదలు లంకల్లోనే నిద్రించారని తెలిపారు. శాంతియుతంగా ఆందోళన చేస్తున్న పేదలపై పోలీసు యంత్రాంగం లాఠీఛార్జి చేసి స్థానిక ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు సహా సుమారు 30 మందిని అరెస్టు చేయడం తగదన్నారు. కోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించి పేదలపై, మహిళలపై దౌర్జన్యానికి పూనుకోవటం దారుణమన్నారు. ఈ లాఠీఛార్జీల్లో నలుగురు గాయపడ్డారని తెలిపారు. చించినాడ దళితుల అరెస్టులను ప్రతిఘటించిన మహిళల ధైర్యం అభినందనీయమని అన్నారు. భూముల కోసం పోరాడుతున్న ప్రజలకు సిపిఎం సంపూర్ణ మద్దతు వుంటుందని తెలిపారు. అక్రమంగా అరెస్టు చేసిన వారిని తక్షణం విడుదల చేయాలని, పెరుగులంక భూముల్లో అక్రమ తవ్వకాలు ఆపాలని డిమాండ్ చేశారు.

హనుమాయమ్మ కుటుంబానికి రూ.కోటి పరిహారం

- టిడిపి అధినేత చంద్రబాబు డిమాండ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో



ప్రకాశం జిల్లా రావివారిపాలెం అంగన్వాడీ టీచర్ సవలం హనుమాయమ్మ కుటుంబానికి రూ.కోటి పరిహారం ఇవ్వాలని ప్రభుత్వాన్ని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు డిమాండ్ చేశారు. దళిత మహిళ హనుమాయమ్మ హత్య కేసును కేంద్ర దర్యాప్తు సంస్థలతో విచారణ జరిపించాలని, డిజిపికి మంగళవారం ఆయన లేఖ రాశారు. హత్యపై జోక్యం చేసుకోవాలని కోరుతూ.. నేషనల్ ఎస్‌సి కమిషన్, నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్, నేషనల్ మహిళా కమిషన్‌కు లేఖలు రాశారు. రాష్ట్రంలో పోలీస్ వ్యవస్థ దుర్వినియోగం అవుతోందని, బడుగువర్గాల హక్కులు హరించబడుతున్నాయని లేఖలో పేర్కొన్నారు. హత్య ఘటనలో వైసిపి నేతలకు పోలీసుల సహకారంపైనా విచారణ జరపాలని చంద్రబాబు డిమాండ్ చేశారు. హనుమాయమ్మ కుమార్తెకు ఉద్యోగం ఇవ్వాలన్నారు. నేరాలను అరికట్టడంపై పోలీసులు శ్రద్ధపెట్టడం లేదన్నారు. హనుమాయమ్మను అదే గ్రామానికి చెందిన సవలం కొండలరావు అనే వ్యక్తి ట్రాక్టరుతో తొక్కించి అత్యంత దారుణంగా హతమార్చాడన్నారు. అడ్డుకునే ప్రయత్నం చేసిన బాధితురాలి కుమార్తె మాధురిపైనా నిందితుడు దాడి చేశాడని పేర్కొన్నారు. నిందితుని గురించి స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చినా.. ఆయన్ను అరెస్టు చేయకపోగా, పారిపోయేందుకు సహకరించారన్నారు. ప్రభుత్వ చర్యలను తప్పుపడుతూ టిడిపి ఎమ్మెల్యే బాల వీరాంజనేయస్వామి శాంతియుత నిరసనలకు దిగిన సందర్భంలో పోలీసులు ఆయనను అరెస్టు చేశారని, ఈ నిరసనల్లో హనుమాయమ్మ భర్త సవలం సుధాకర్ కూడా పాల్గొన్న సమయంలోనే ఈ హత్య జరిగిందన్నారు.

నిమ్మల రామానాయుడు అరెస్టుకు ఖండన

దళితుల భూముల రక్షణ కోసం పోరాడుతున్న పాలకొల్లు టిడిపి ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడును అరెస్టు చేసి పోలీసులు వేధించారని, ఆయన అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నట్లు చంద్రబాబు పేర్కొన్నారు. ప్రకాశం జిల్లాలో దళిత ఎమ్మెల్యే డోలా బాలవీరాంజనేయస్వామిని అరెస్టు పేరుతో హింసించిన పోలీసులు.. పాలకొల్లు ఎమ్మెల్యేను అరెస్టు చేసి వేధించారని అన్నారు. రామానాయుడును వెంటనే విడుదల చేయాలని ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.


వైసిపి అనుబంధ ప్రజాసంఘాల నాయకులతో విజయసాయిరెడ్డి

క్షేత్రస్థాయిలో పార్టీ పటిష్టతకు కృషి


- విజయసాయిరెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో పార్టీ అనుబంధ సంఘాలన్నీ రానున్న 2024 ఎన్నికలను దృష్టిలో వుంచుకుని పార్టీ పటిష్టతకు క్షేత్రస్థాయిలో పనిచేయాలని వైసిపి ప్రధాన కార్యదర్శి, అనుబంధ విభాగాల ఇన్‌ఛార్జి వి విజయసాయిరెడ్డి తెలిపారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో ఆ పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులతో మంగళవారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా విజయసాయిరెడ్డి మాట్లాడుతూ.. పార్టీలో అనుబంధ విభాగాల పనితీరు మరింత మెరుగుపడాలని కోరారు. ఖాళీగా వున్న పదవులన్నీ త్వరలో భర్తీ చేస్తామన్నారు. గతంలో నిర్వహించిన జయహో బిసి సభ తరహాలో త్వరలో ఎస్‌సి, ఎస్‌టి, ముస్లిం మైనార్టీల సభలను నిర్వహించాలన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలు, కార్యక్రమాల ప్రచారాన్ని ఇంటింటికీ తీసుకెళ్లాలని కోరారు. అనుబంధ విభాగాలను మరింత పటిష్టపరిచేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. పార్టీ అనుబంధ విభాగాల జోనల్ ఇన్‌ఛార్జులు, జిల్లా అధ్యక్షులు తమ పరిధిలోని మండల ఇన్‌ఛార్జిల ఖాళీలను ఎమ్మెల్యేలు, సమన్వయకర్తలతో సమన్వయం చేసుకుని భర్తీ చేయాలని సూచించారు. ఈ సమావేశంలో వైసిపి కేంద్ర కార్యాలయ ఇన్‌ఛార్జి, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, వైసిపి అనుబంధ విభాగాల కో-ఆర్డినేటర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో టిడిపిని నమ్మే పరిస్థితి లేదు : కె రవిచంద్రారెడ్డి

అధికారంలో వున్నంతకాలం సొంత మనుషుల కోసం పనిచేసిన చంద్రబాబును రాష్ట్రంలో ప్రజలు నమ్మే పరిస్థితి లేదని వైసిపి అధికార ప్రతినిధి కె రవీంద్రారెడ్డి అన్నారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమపాలనను చూసి తమకు రాజకీయంగా మనుగడ లేదని లోకేష్ పిచ్చిపట్టినట్లు మాట్లాడుతున్నారని విమర్శించారు.



రైల్వే కాంట్రాక్టు కార్మికులను రెగ్యులరైజ్ చేయాలి

- పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీకి
- రైల్వే కాంట్రాక్టు వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సిఐటియు) వినతి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రైల్వేలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులందరినీ రెగ్యులరైజ్ చేయాలని, కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని రైల్వే కాంట్రాక్టురైజ్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కాంట్రాక్టు కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్‌లో పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ అండ్ కాంట్రాక్టు లేబర్ కమిటీ ఛైర్మన్ చర్తహరిమహతో నేతృత్వంలోని 15 మంది ప్రతినిధుల బృందానికి ఫెడరేషన్ వినతిపత్రం సమర్పించింది. ఈ కమిటీ రైల్వేలో టెక్స్‌టైల్, ఆయిల్ సెక్టారు, ఎన్‌ఎమ్‌డిసి ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు సిబ్బంది పని పరిస్థితులు, జీతాలు, ఇతర భత్యాలతోపాటు చట్టపరమైన అంశాలపై అధ్యయనం చేసి పార్లమెంటుకు నివేదిక ఇవ్వనుంది. ఈ బృందంలో ఎంపిలు యలమలం కరీమ్ (సిపిఎం), బినయ్ విశ్వం (సిపిఐ)కు కూడా ఉద్యోగుల సమస్యలపై వినతిపత్రాలు ఇచ్చారు. కమిటీని కలిసి వినతిపత్రం అందజేసిన వారిలో సిఐటియు ఆలిండియా నాయకులు సాయిబాబ, రైల్వే కాంట్రాక్టు వర్కర్స్ ఫెడరేషన్ ఎపి నాయకులు వివిఎల్ నరసింహులు, విజయవాడ రైల్వే కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు వై ఆదిలక్ష్మి, ఆలిండియా రైల్వే కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్స్ కన్వీనరు రమేష్‌బాబు తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా వివిఎల్ నరసింహులు మాట్లాడుతూ.. రైల్వేలో 8 లక్షల మంది కాంట్రాక్టు కార్మికులు పనిచేస్తున్నారన్నారు. దక్షిణ మధ్య రైల్వేలో సుమారు 40 వేల మంది (ఎపిలో) పనిచేస్తున్నారని, వీరికి యజమానులు కనీసవేతనాలు, పిఎఫ్, ఉద్యోగ భద్రత, ఇఎస్ఐ, సెలవులు చట్టప్రకారం అమలు చేయడం లేదన్నారు.

వడదెబ్బకు ఉపాధి కార్మికుడి మృతి

ప్రజాశక్తి-కొండపి (ప్రకాశం జిల్లా)

వడదెబ్బకు ఉపాధి కార్మికుడు మరణించిన ఘటన ప్రకాశం జిల్లా కొండపి మండలంలో మంగళవారం చోటుచేసుకుంది. ఎపిఒ మహాలక్ష్మి తెలిపిన వివరాల ప్రకారం.. అనకర్లపూడి గ్రామానికి చెందిన పెద్దినేని వెంకటేశ్వర్లు (75) రోజూలాగానే మంగళవారం కూడా ఉపాధి పనులకు వెళ్లారు. ఎండ తీవ్రతతో కళ్లు తిరిగి పనిప్రదేశంలోనే కుప్పకూలిపోయారు. తోటి కార్మికులు ఆయనను ఇంటికి తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో మరణించారు.

వీడని వడగాడ్పులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ఎండల తీవ్రతకు వడగాడ్పులు కొనసాగుతున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా 17 మండలాల్లో ఒక మాదిరి తీవ్ర వడగాడ్పులు, 161 మండలాల్లో వడగాడ్పులు వీచినట్లు రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎమ్‌డి బిఆర్ అంబేద్కర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో అత్యధికంగా ఏలూరు జిల్లా పంగిడిగూడెంలో 44.9 డిగ్రీలు, ఎన్‌టిఆర్ జిల్లా తిరువూరులో 44.7, తూర్పుగోదావరి జిల్లా చిట్యాలలో 44.6, పశ్చిమగోదావరి జిల్లాలోని వరదరాజపురంలో 43.3 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదైనట్లు పేర్కొన్నారు. బుధవారం 12 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు ఉంటాయని తెలిపారు.

సవరణ

మంగళవారం నాటి సంపాదకీయం మూడవ పేరాలో 'రైల్వేల ద్వారా ఏడాదికి రూ.2.40 కోట్ల ఆదాయాన్ని ...' అన్న వాక్యాన్ని 'రైల్వేల ద్వారా ఏడాదికి రూ.2.40 లక్షల కోట్ల ఆదాయాన్ని..'గా చదువుకోగలరు. పొరపాటుకు చింతిస్తున్నాం.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..
స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

త్వరలో ఇంటిగ్రేటెడ్ ఎక్స్‌పోర్ట్ పార్క్" ఏర్పాటు :

- కాకాణి గోవర్ధన్‌రెడ్డి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో " ఇంటిగ్రేటెడ్ ఎక్స్ పోర్ట్ పార్క్"ను త్వరలో ఏర్పాటు చేయడం .జరుగుతుందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. పురుగుమందుల అవశేషాలు లేని వ్యవసాయ ఉత్పత్తులకు ప్రపంచ మార్కెట్లో మంచి గిరాకి ఉందన్నారు, విజయవాడలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో వ్యవసాయం, ఉద్యానవనం ప్రాసెస్ చేసిన ఆహార ఉత్పత్తుల ఎగుమతుల అవకాశాలను పెంపొందించేందుకు రైతులు, ఎగుమతి దారులతో మంగళవారం వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి కాకాణి మాట్లాడుతూ రాష్ట్రం వ్యవసాయ ఆధారితరాష్ట్రమని, రాష్ట్రం నుంచి దేశంలోనే అధిక స్థాయిలో వ్యవసాయ ఉత్పత్తులు ఎగుమతులు జరుగుతున్నాయని వీటిని మరింత ఎక్కువగా పెంచాల్సిన అవసరం ఉందన్నారు. రైతులకు గిట్టుబాటు ధర కంటే ఎక్కువ ధర వ్యవసాయ ఉత్పత్తులకు ఇచ్చేందుకు ఎగుమతిదారులు ముందుకు రావాలన్నారు. సిఎం జగన్‌మోహన్‌రెడ్డి రైతన్నకు అధిక లబ్ధి చేకూర్చాలని నిరంతరం తపన పడుతున్నారని మంత్రి పేర్కొన్నారు. రైతు సంక్షేమం, రైతు భరోసా, యంత్రసేవా పథకం, ఆర్‌బికెల ఏర్పాటు ఇలా విత్తనం నుంచి విక్రయం వరకు రైతన్నలకు అండగా ప్రభుత్వం ప్రతి దశలోనూ నిలుస్తుందన్నారు. అందులో భాగంగానే మార్కెట్ యార్డులను బలోపేతం చేయడానికి చయర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వ్యవసాయశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది మాట్లాడుతూ రైతులకు ఎగుమతి దారులకు మధ్య ప్రభుత్వం సమన్వయ కర్తగా పనిచేస్తోందన్నారు. వ్యవసాయశాఖ స్పెషల్ కమిషనరు హరికిరణ్ మాట్లాడుతూ రాష్ట్రంలో రైతుసేవలో 10778 రైతు భరోసా కేంద్రాలు పనిచేస్తున్నాయని, విత్తు నుంచి విక్రయం వరకు సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎపి సీడ్స్ ఎండి శేఖర్‌బాబు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

'ఉక్కు' ప్రయివేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోండి

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)



దేశాభివృద్ధిలో కీలకపాత్ర పోషించిన వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటీకరించేందుకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రెండేళ్ల క్రితం తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని ఐఎన్‌టియుసి స్టీల్‌ప్లాంట్ విభాగం నాయకులు నీరుకొండ రామచంద్రరావు డిమాండ్ చేశారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే దీక్షలు మంగళవారానికి 845వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో స్టీల్ సిఒసిసిపి విభాగానికి చెందిన ఉద్యోగులు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ సుదీర్ఘకాలంగా స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం పోరాటం సాగుతున్నా.. కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. వేలాది మందికి ఉపాధి కల్పిస్తున్న కర్మాగారాన్ని ప్రయివేటుపరం చేయడం తగదన్నారు. ఇప్పటికైనా ప్రజల, కార్మికుల ఆకాంక్షను గుర్తించి స్టీల్‌పాంట్‌కు సొంతగనులు కేటాయించి, పూర్తి స్థాయిలో నడిచేలా చూడాలని కోరారు. ఉద్యోగుల ఆర్థిక ప్రయోజనాలు దెబ్బతీస్తున్న ప్లాంట్ యాజమాన్య తీరును ఖండించారు. వెంటనే వేతన సవరణ చేయాలని డిమాండ్ చేశారు. దీక్షల్లో సిఐటియు నాయకులు కె ఆనంద్, పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.



అనకాపల్లి ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద రాస్తారోకో నిర్వహిస్తున్న నాయకులు

హనుమాయమ్మ కుటుంబాన్ని ఆదుకోవాలి

- ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ డిమాండ్

ప్రజాశక్తి - టంగుటూరు, అనకాపల్లి

దారుణ హత్యకు గురైన అంగన్‌వాడీ కార్యకర్త సవలం హనుమాయమ్మ కుటుంబాన్ని ఆదుకోవాలని, వైసిపి కార్యకర్త కొండలరావును వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ ప్రకాశం జిల్లా టంగుటూరులో నిరసన ర్యాలీ, అనకాపల్లిలో రాస్తారోకో నిర్వహించారు. ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన మంగళవారం ఈ కార్యక్రమం నిర్వహించారు. అనకాపల్లిలో ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్బరావమ్మ మాట్లాడుతూ.. హనుమాయమ్మ కుటుంబానికి రూ.50 లక్షల పరిహారం ప్రకటించాలని, అంగన్‌వాడీలపై రాజకీయ వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించకుంటే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు బి.ప్రభావతి మాట్లాడుతూ.. జగన్ పాలనలో మహిళలకు రక్షణ లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు పి.మణి, కె.సుజాత, కాసులమ్మ తదితరులు పాల్గొన్నారు. ప్రకాశంలో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు వై.సత్యవతి మాట్లాడుతూ.. హనుమాయమ్మ కుటుంబానికి రూ.50 లక్షలు ఇచ్చి ఆర్థిక భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు. హనుమాయమ్మ కుటుంబానికి న్యాయం చేకూరేలా చర్యలు తీసుకోవాలని మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యాలయం సీనియర్ సహాయకులు సిహెచ్ లక్ష్మీనారాయణకు వినతిపత్రం అందజేశారు.

హంతకుడిని కఠినంగా శిక్షించాలి : ఐద్వా

అంగన్‌వాడీ కార్యకర్త హనుమాయమ్మను హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని ఐద్వా రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు బి.ప్రభావతి, డి.రమాదేవి ఒక ప్రకటన విడుదల చేశారు. పెరుగుతున్న హింసా రాజకీయాలకు ఈ ఘటన నిదర్శనమని పేర్కొన్నారు. హత్యపై ముఖ్యమంత్రి స్పందించకపోవడం శోచనీయమని తెలిపారు.

ప్రజా సమస్యలపై సిపిఎం సర్వే

- ఇప్పటికీ ఇళ్ల పట్టాలు లేవని పేదలు మొర
- వ్యవసాయ రంగం నుండి ఇతర రంగాలకు వలసలు : వి శ్రీనివాసరావు

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్ (గుంటూరు జిల్లా)

గ్రామాల్లో ఉన్న సమస్యలపై సిపిఎం ఆధ్వర్యంలో గ్రామాల అధ్యయనానికి శ్రీకారం చుట్టారు. గుంటూరు జిల్లా మంగళగిరి మండలం కాజ గ్రామంలో మంగళవారం సిపిఎం బృందం సర్వే ప్రారంభించింది. ఈ సర్వేలో పాల్గొన్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావుకు గ్రామస్తులు పలు సమస్యలు తెలిపారు. గ్రామంలోని అన్ని ప్రాంతాలలో వివిధ సామాజిక తరగతుల ప్రజలతో ఆయన మాట్లాడారు. ప్రధానంగా వ్యవసాయ రంగంలో వచ్చిన మార్పులు, గ్రామీణ ప్రాంతాల్లో పని పద్దతుల్లో వచ్చిన మార్పులు అధ్యయనం చేస్తున్నట్లు తెలిపారు. వ్యవసాయ రంగం యంత్రీకరణ పనిదినాలు తగ్గిపోవడం, రియల్ ఎస్టేట్‌తో సాగుభూమి తగ్గడం గుర్తించామన్నారు. తగ్గుతున్న వ్యవసాయ అనుబంధ పనుల నేపథ్యంలో వ్యవసాయేతర పనులకు మరలుతున్నారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో వ్యవసాయ రంగంలో పనులు కోల్పోయిన వారంతా స్థానికంగా ఉన్న వివిధ సంస్థల్లో చిరు ఉద్యోగులుగా, సెక్యూరిటీ గార్డులుగా మారిపోయిన పరిస్థితులు ఏర్పడ్డాయని స్థానికులు తెలిపారు. భవన నిర్మాణ రంగంలో పని లేకపోవడంతో కార్మికులు కూడా వేరే పనికి వెళ్లడం బంద సభ్యులు గుర్తించారు. ఫలితంగా పెరుగుతున్న ధరలకు అనుగుణంగా జీతాలు రాక తక్కువ వేతనాలకు పని చేయాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయని వివరించారు. దాదాపు 600 మంది ఇళ్ల పట్టాలు లేక ఇబ్బందులు పడుతున్నామనిపుల్లయ్య నగర్, ఎస్‌సి, ఎస్‌టి కాలనీ వాసులు తెలిపారు. ఆర్‌బికె కేంద్రం నిరుపయోగంగా మారిందని రైతులుఈ బృందం దృష్టికి తీసుకొచ్చారు. గత సంవత్సరం ఇవ్వవలసిన ట్రాన్స్‌పోర్ట్ ఛార్జీలూ నేటికీ అందలేదన్నారు. పంటకు గిట్టుబాటు ధర కూడా లభించడం లేదని తెలిపారు. డ్రయినేజీ సమస్య తీవ్రంగా ఉందని, పంచాయతీ అధికారులు కార్పొరేషన్ పరిధి అని చెప్పి పట్టించుకోవడం లేదని మరి కొందరు తెలిపారు. తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, పలు స్థానిక సమస్యలను సిపిఎం బృందానికి ప్రజలు తెలిపారు. అధ్యయనంలో వచ్చిన సమస్యలపై సిపిఎం పోరాటానికి పిలుపునివ్వనుందని, రాబోయే కాలంలో జరిగే ఆందోళన కార్యక్రమాల్లో ప్రజలు భాగస్వాములు కావాలని సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు కోరారు. ఈ అధ్యయన కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఈమని అప్పారావు, నాయకులు బి కోటేశ్వరి, తమ్మా ప్రసాదరెడ్డి, కె హరికిషోర్, ఆళ్ల సాంబిరెడ్డి, మాజీ ఎంపిటిసి సభ్యులు ఈదా ప్రతాపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


కాజ గ్రామంలో ప్రజల నుండి సమస్యలు తెలుసుకుంటున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు తదితరులు

మున్సిపల్ కార్మికులను క్రమబద్ధీకరించాలి

- నెల్లూరు, కృష్ణా జిల్లాలో కొనసాగిన జాతాలు

ప్రజాశక్తి - యంత్రాంగం


గుడివాడలో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు సోమయ్య

మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని పలువురు నాయకులు డిమాండ్ చేశారు. సిపిఎస్ రద్దు చేయాలని, మున్సిపల్ పారిశుధ్య, ఇంజనీరింగ్ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేస్తూ ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సిఐటియు) ఆధ్వర్యంలో చేపట్టిన జీపుజాతాలు మంగళవారం 8వ రోజుకు చేరాయి. శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలో ప్రారంభమైన జాతా ఏలూరు జిల్లా మీదుగా కృష్ణా జిల్లా గన్నవరంలోనికి, సత్యసాయి జిల్లా హిందూపురం నుంచి బయలు దేరిన జాతా తిరుపతి మీదుగా నెల్లూరులోకి ప్రవేశించింది. తిరుపతి, నెల్లూరులో ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర అధ్యక్షులు కె.నాగభూషణం మాట్లాడుతూ.. కరోనా కాలంలో ఫ్రంట్‌లైన్ వారియర్స్‌గా ప్రాణాలకు తెగించి ప్రజలకు సేవ చేసిన వారికి 010 పద్దు ద్వారా జీతాలు చెల్లించాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోగా ఆప్కాసు విధానం తీసుకువచ్చి 60 సంవత్సరాలకు కార్మికులను ఇళ్లకు పంపించే ప్రయత్నం చేయడం దుర్మార్గమన్నారు. గత రెండు నెలల నుంచి మున్సిపల్ కార్మికులకు హెల్త్ అలవెన్స్ అందజేసిన దాఖలాలు లేవన్నారు. దళిత కార్మికులను కులం పేరుతో దూషిస్తున్న వెంకటగిరి శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామారావును వెంటనే బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. సిఐటియు నెల్లూరు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.అజయ్ కుమార్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, అప్పటివరకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని జరిగే పోరాటానికి సిఐటియు సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందన్నారు. గుడివాడలో సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు సోమయ్య మాట్లాడుతూ.. ప్రజలకు సేవలందిస్తున్న మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. సిపిఎస్‌ను రద్దు చేయాలని, మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం అందించాలని డిమాండ్ చేశారు. జాతాకు ఆయా మున్సిపాల్టీల్లో ఘన స్వాగతం పలికారు.

షెడ్యూల్ ప్రకారమే

(మొదటి పేజీ తరువాయి)

ఖరారు చేసిందని, వాటి ఆమోదంతోనే పనులు చేశామని అధికారులు తెలిపారు. ప్రస్తుత సమస్యను కేంద్రానికి నివేదించామని వివరించారు. దీన్ని సరిదిద్దడం పెద్ద సమస్య కాదని, సిడబ్ల్యుసి పరిశీలన కాగానే వారి సూచనల మేరకు వెంటనే మరమ్మతులు చేస్తామన్నారు. స్పిల్‌వే కాంక్రీట్ పూర్తయిందని, 48 రేడియల్ గేట్లు పూర్తి స్థాయిలో ఏర్పాటు చేశామని వివరించారు. రివర్ స్లూయిస్ గేట్లు పూర్తయ్యాయని, ఎగువ కాఫర్ డ్యాం, దిగువ కాఫర్ డ్యాం, గ్యాప్-3 వద్ద కాంక్రీట్ డ్యాం, పవర్‌హౌస్‌లో సొరంగాల తవ్వకం కూడా పూర్తయిందని తెలిపారు. అప్రోచ్ ఛానల్ పనులు దాదాపుగా పూర్తి కావొచ్చాయని వివరించారు. ఇసిఆర్‌ఎఫ్ డ్యాంలో దెబ్బతిన్న గ్యాప్-1 ప్రాంతంలో ఇసుక నింపే కార్యక్రమం పూర్తయిందని, ఆ ప్రాంతంలో వైబ్రో కాంపాక్షన్ కూడా పూర్తయిందని తెలిపారు. ఇఆర్‌ఎఫ్ గ్యాప్-2 ప్రాంతంలో నింపడానికి అవసరమైన వంద శాతం ఇసుక రవాణా పూర్తయిందని సిఎంకు అధికారులు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పినిపే విశ్వరూప్, ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ, మంత్రులు అంబటి రాంబాబు, తానేటి వనిత, చెల్లుబోయిన వేణు గోపాలకృష్ణ, కారుమూరి వెంకట నాగేశ్వరరావు, పలువురు ఎంఎల్‌ఎలు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

యాక్సిల్ విరిగి

ఆర్‌టిసి బస్సు బోల్తా

- తొమ్మిది మందికి గాయాలు

ప్రజాశక్తి - నరసన్నపేట

శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట మండలంలోని కోమర్తి జంక్షన్ వద్ద ఆర్‌టిసి బస్సు మంగళవారం బోల్తా పడింది. ఈ ఘటనలో డ్రైవర్, కండక్టర్ సహా తొమ్మిది మంది గాయపడ్డారు. శ్రీకాకుళం రెండో డిపోకు చెందిన ఆర్‌టిసి బస్సు శ్రీకాకుళం నుంచి పాతపట్నానికి 17 మంది ప్రయాణికులతో బయలుదేరింది. కోమర్తి కూడలి వద్దకు రాగానే బస్సు ముందు చక్రాల యాక్సిల్ విరిగిపోయింది. దీంతో బస్సు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టి బోల్తాపడింది. డ్రైవర్, కండక్టర్‌కు తీవ్ర గాయాలు కాగా, ఏడుగురికి స్వల్ప గాయాలయ్యాయి. తీవ్ర గాయాలపాలైన డ్రైవర్, కండక్టర్‌ను శ్రీకాకుళం ప్రభుత్వ సర్వజనాస్పత్రికి తరలించారు.

స్పాటిఫైలో 200 మందిపై వేటు

న్యూఢిల్లీ : మ్యూజింగ్ స్ట్రీమింగ్ సంస్థ స్పాటిఫైలో మరోమారు ఉద్యోగులను తొలగించారు. ఐదు నెలల క్రితమే 600 మంది సిబ్బందిని ఇంటికి పంపించిన ఈ సంస్థ తాజాగా మరో 200 మందిపై వేటు వేసింది. స్థూల ఆర్థిక పరిస్థితులను సాకుగా చూపి తొలగింపులకు పాల్పడింది. పాడ్‌కాస్ట్ డివిజన్‌లో వ్యవస్థాగత మార్పుల ప్రక్రియలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నామని స్పాటిఫై పాడ్‌కాస్ట్ బిజినెస్ వైస్ ప్రెసిడెంట్ సహర్ ఎలబషి పేర్కొన్నారు. ఉద్యోగాలు కోల్పోయే వారికి స్పాటిఫై అండగా ఉంటుందని, వారి పట్ల గౌరవంగా, సహానుభూతితో వ్యవహరిస్తామన్నారు.



జూపాడుబంగ్లా మండలం మండ్లెంలో రాయితీ విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆర్థర్ (ఫైల్ ఫొటో)

విత్తన కొరత

- అవసరంలో సగం కూడాలేని కేటాయింపులు
- రైతన్నల ఎదురుచూపులు

ప్రజాశక్తి- కర్నూలు ప్రతినిధి

రైతులకు రోజు రోజుకూ రాయితీ విత్తనం అందని ద్రాక్షగా మారిపోతోంది. తక్కువగా సాగయ్యే పంటల విత్తనాలకే రాయితీ అందిస్తున్నారు. అవీ, నాణ్యతగా ఉండడం లేదు. అవసరం మేరకు ఇవ్వడం లేదు. దీంతో, రైతులు బహిరంగ మార్కెట్లో అధిక ధరకు కొనుగోలు చేయాల్సి వస్తోంది. కర్నూలు జిల్లాకు 35,188 క్వింటాళ్ల వేరుశనగ అవసరం కాగా, 15,905 క్వింటాళ్లను మాత్రమే కేటాయించారు. వాటిలోనూ ఇప్పటి వరకూ 8,295.90 క్వింటాళ్ల రాయితీ విత్తన వేరుశనగ జిల్లాకు చేరింది. జిల్లాకు 1633.1 క్వింటాళ్ల కందులు అవసరం. 1,080 క్వింటాళ్లను మాత్రమే కేటాయించారు. 37.8 క్వింటాళ్ల మినుము విత్తనాలు అవసరం. 25 క్వింటాళ్లు మాత్రమే కేటాయించారు. 16 క్వింటాళ్ల పెసర అవసరం. ఐదు క్వింటాళ్లు మాత్రమే కేటాయించారు. కొర్ర విత్తనాలు 133.2 క్వింటాళ్లు అవసరం. 15 క్వింటాళ్లు మాత్రమే కేటాయించారు. పిల్లిపెసర 216.7 క్వింటాళ్లు అవసరం. 191 క్వింటాళ్లు కేటాయించారు. అందులో 15.36 క్వింటాళ్లు మాత్రమే జిల్లాకు చేరాయి.

గతేడాదీ బయట మార్కెట్‌లోనే..

ఉమ్మడి జిల్లాలో సుమారు నాలుగు లక్షల మంది వేరుశనగ సాగు చేస్తున్నారు. 25 వేల మందికి మాత్రమే రాయితీ విత్తనాలు అందాయి. మిగిలిన వారంతా గత ఖరీఫ్‌లో బహిరంగ మార్కెట్‌లో అధిక ధరకు విత్తనాలు కొనుగోలు చేయాల్సి వచ్చింది. ఇందుకోసం దాదాపు రూ.80 కోట్ల వరకు ఖర్చు చేశారు. ఉమ్మడి జిల్లాకు వేరుశనగ, కందులు, జీలుగ, పిల్లి పెసర, కొర్రలు, పెసలు అన్ని విత్తనాలు కలిపి 91,970 క్వింటాళ్ల రాయితీ విత్తనాలు అవసరమని జిల్లా వ్యవసాయ శాఖాధికారులు ప్రతిపాదనలు పంపారు. 35,087 క్వింటాళ్లు మాత్రమే కేటాయించారు. పత్తి, మిరప, ఉల్లి, మొక్కజొన్న తదితర ఎంపిఆర్ ధరలకు విక్రయించే నాన్ సబ్సిడీ విత్తనాల పంపిణీ కూడా అంతంత మాత్రమే జరిగింది. రైతు భరోసా కేంద్రాల ద్వారా విత్తనాల పంపిణీకి ప్రభుత్వం పలు కంపెనీలతో ఎంఒయు కుదుర్చుకున్నప్పటికీ సకాలంలో రైతులకు అందించలేదు. ఈ రెండు జిల్లాల పరిధిలో పత్తి సాధారణ సాగు 7.5 లక్షల ఎకరాలు. 22 లక్షల పత్తి విత్తన ప్యాకెట్లు అవసరమని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. 835 ప్యాకెట్ల పత్తి విత్తనాలు, 110 మిరప, 45 క్వింటాళ్ల సోయాబీన్, 279 ప్యాకెట్ల కాకర విత్తనాలు మాత్రమే అందించారు.

అవసరానికి తగినట్టు కేటాయించాలి



రాయితీ విత్తనాలు నామమాత్రంగా వస్తున్నాయి. అవి కూడా దాదాపు బయట మార్కెట్ ధరకే అందుతున్నాయి. రైతులకు అవసరమైన విత్తనాలు అందించడం లేదు. ఇచ్చినవి కూడా నాణ్యత లేకుండా ఉండడంతో ఉపయోగించేందుకు వీలులేకుండా పోతోంది. అవసరానికి తగినట్టు నాణ్యమైన విత్తనాలను రాయితీపై ఇవ్వాలి.

- జి.రామకృష్ణ, రైతు సంఘం కర్నూలు జిల్లా ప్రధాన కార్యదర్శి



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

కర్ణాటకలో రోడ్డు ప్రమాదం

- ఎపికి చెందిన ఐదుగురు మృతి

ప్రజాశక్తి - వెలుగోడు (నంద్యాల)

కర్ణాటక రాష్ట్రం యాదగిరి జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో నంద్యాల జిల్లా వెలుగోడుకు చెందిన ఐదుగురు మృతిచెందారు. రోడ్డుపక్కన ఆగి ఉన్న లారీని కారు ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. గుల్బర్గా దర్గా ఉరుసు జాతరకు వెలుగోడు నుంచి 17మంది సోమవారం రాత్రి తుఫాన్ వాహనంలో బయలుదేరారు. ఈ క్రమంలో మంగళవారం తెల్లవారు జామున యాదగిరి జిల్లా నేషనల్ హైవేలో రోడ్డుపక్కన ఆగి ఉన్న సిమెంట్ లారీని వేగంగా తుఫాన్ వాహనం ఢీకొట్టింది. ఘటనాస్థలంలోనే ఐదుగురు మరణించారు. గాయపడిన 12 మందిని సమీప ఆస్పత్రికి తరలించారు. మృతిచెందిన వారిలో మునీర్ (40), నయామత్ (40), రమీజా బేగం (50), ముద్దత్ షీర్ (12), సుమ్మి (13) ఉన్నారు. తుఫాన్ వాహనంలో ప్రయాణించిన మొత్తం 17 మందిలో 13 మంది వెలుగోడు, ఒకరు బండి ఆత్మకూరు, ముగ్గురు కర్నూలు వాసులుగా పోలీసులు గుర్తించారు.పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రైవేటుకు 'పర్యాటకం'

- సొంత ఆస్తుల నిర్వహణ బదలాయింపు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

స్వయంగా నిర్వహించాల్సిన ఆస్తులను ప్రైవేటు సంస్థలకు అప్పగించేందుకు పర్యాటకశాఖ పావులు కదుపుతోంది. హోటళ్లు, సేవా కేంద్రాలు, ఇతర ఆస్తులను కూడా టెండర్ల ద్వారా ప్రైవేటుపరం చేసేందుకు కసరత్తు చేస్తోంది. ఇప్పటికే అనేక రంగాల్లో ప్రైవేటుకు ప్రాధాన్యత ఇస్తున్న ఆ శాఖ తాజాగా మరో 37 రంగాలను కూడా అప్పగించేందుకు చర్యలు తీసుకుంది. మరికొన్నింటినీ 'ఓల్డేజ్ స్ట్రక్చర్స్' పేరుతో అప్పగించనుంది. తాజా నిర్ణయంలో భాగంగా 16 పర్యాటక మౌలికాభివృద్ధి ప్రాజెక్టులను, 21 పర్యాటక సేవా ప్రాజెక్టులను టెండర్ల ద్వారా పర్యాటకశాఖ ప్రైవేటుపరం చేస్తోంది. ఇందుకు సంబంధించి టెండర్లను కూడా ఖరారు చేసింది. ఇందులో కీలకమైన కొల్లేరు రిసార్ట్‌ను చంద్రశేఖర్ అనే వ్యక్తికి అప్పగించగా, కొత్త కోడూరు రిసార్ట్‌ను సిఆర్ ఆక్వా సంస్థకు అప్పగించారు. శ్రీకాకుళం జిల్లాలోని శాలిహుండంలోని టూరిస్ట్ ఎమినిటీ సెంటర్, భట్టిప్రోలు-బావికొండ-అమరావతి- గుంటుపల్లి బౌద్ధ పర్యాటకాన్ని, మరికొన్ని కేంద్రాలను కూడా ప్రైవేటుకు అప్పగించనున్నారు. అలాగే లేపాక్షిలోని ఆర్అండ్‌బి అతిథి గృహాన్ని, అమరావతిలోని ధరణి అతిథి గృహాన్నీ అప్పగించాలని నిర్ణయించారు.

ఇడుపులపాయలో ఒక బార్‌కు..

ఇదే విధంగా ముఖ్యమంత్రి స్వస్థలమైన ఇడుపులపాయలో పర్యాటకశాఖ పరిధిలో ఉన్న ఒక హోటల్‌ను అక్కడి తేజా బార్ అండ్ రెస్టారెంట్‌కు అధికారులు అప్పగించారు. విశాఖలోని రిషికొండ వద్ద ఉన్న ఫుడ్‌కోర్ట్-4ను డి డైన్ హాస్పిటాలిటీ సర్వీసెస్‌కు అప్పగించారు. ఈ ప్రాజెక్టులన్నిటినీ ఆపరేషన్ అండ్ మెయింటేనెన్స్ (ఒ అండ్ ఎం) కింద అప్పగించాలని నిర్ణయించారు.

హోటళ్లు, రిసార్టులు కూడా..

రాష్ట్ర వ్యాప్తంగా ఎప్పటి నుంచో ఉన్న పర్యాటక హోటళ్లు, రిసార్టులనూ ఇదే విధంగా ప్రైవేటుకు అప్పగించనున్నారు. ఇవి పూర్తిగా పునరుద్ధరించాల్సిన అవసరం ఉందని, అందుకే ఈ పనులు ప్రైవేటు ద్వారా చేయించి, ఒ అండ్ ఎం విధానం ద్వారా నిర్వహించాలని ప్రతిపాదించారు.

రాష్ట్రానికి అన్యాయం చేస్తోన్న బిజెపి : జంగా గౌతమ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మోడీ నేతృత్వంలోని కేంద్ర బిజెపి ప్రభుత్వం తొమ్మిదేళు ్లగా రాష్ట్రానికి అన్యాయం చేస్తోందని పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జంగా గౌతమ్ పేర్కొన్నారు. అబద్ధాలకు నెంబర్‌వన్ నాయకుడు ప్రధాని మోడీ అని, నెంబర్ టూ అమిత్ షా అని అన్నారు. విజయవాడలోని ఆంధ్రరత్న భవన్‌లో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం తొమ్మిదేళ్లుగా రాష్ట్రానికి ఏమి చేసిందో ప్రజలకు కేంద్ర మంత్రులు చెప్పాలని డిమాండ్ చేశారు. మీడియా సమావేశంలో ఎఐసిసి సభ్యులు మీసాల రాజేశ్వరరావు, కొరివి వినయ్‌కుమార్, పట్టణ అధ్యక్షులు నరహరిశెట్టి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

లెన్స్‌కార్ట్ నుంచి స్పోర్ట్స్ ఐవేర్ బ్రాండ్

న్యూఢిల్లీ : ప్రముఖ కళ్లజోళ్ల సంస్థ లెన్స్‌కార్ట్ కొత్తగా లెన్స్‌కార్ట్ బూస్ట్ పేరుతో స్పోర్ట్స్ ఐవేర్‌ను ప్రారంభించినట్లు వెల్లడించింది. ఈ సరికొత్త కేటగిరీలో రన్, రైడ్, స్విమ్, ఆల్ స్పోర్ట్ పేర్లతో నాలుగు వేరియంట్లను విడుదల చేసినట్లు తెలిపింది. ఇంతకుముందు స్పోర్ట్స్ అన్నింటికి ఒకటే ఐవేర్ ఉండేదని.. కానీ ఇప్పుడు లెన్స్ కార్ట్ బూస్ట్‌లో ప్రతీ ఆటకు దేనికదే ప్రత్యేకమైన ఐవేర్ అందుబాటులో ఉందని తెలిపింది.

చరిత్రపై బిజెపి దాడి

- ఎస్ఎఫ్ఐ అఖిల భారత అధ్యక్షులు విపి.సాను

ప్రజాశక్తి - విశాఖపట్నం



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ అఖిల భారత అధ్యక్షులు విపి.సాను


బిజెపి హయాంలో చరిత్రపై దాడి తీవ్రమైంద ని, విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టించే ప్రయత్నాలు పెరిగాయని ఎస్ఎఫ్ఐ అఖిల భారత అధ్యక్షులు విపి సాను అన్నారు. విశాఖలోని దువ్వాడ విజ్ఞాన్ కళాశాలలో సోమ, మంగళవా రాల్లో జరిగిన ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ప్లీనంను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. చరిత్రను బిజెపి వక్రీకరించి మతంతో ముడిపడిన అంశాలను విద్యా వ్యవస్థలోకి జొప్పిస్తోందన్నారు. సైన్స్‌ను తప్పుదోవ పట్టించే అంశాలను పాఠ్యాంశాలుగా చేరుస్తోందని, విద్యార్థులకు ఎంతో ఉపయుక్తమైన, అభ్యుదయకం ్మైన పాఠాలను పాఠ్య పుస్తకాల నుంచి తొలగించడం దారుణమని ఆందోళన వ్యక్తం చేశారు. హిందుత్వ అజెండాను అన్ని రంగాల్లోకి ఎక్కించడానికి మోడీ సర్కారు ప్రయత్నిస్తోందని తెలిపారు. గిరిజన మహిళా రాష్ట్రపతి చేతుల మీదుగా ప్రారంభించాల్సిన పార్లమెంటు నూతన భవనాన్ని మోడీ తన బలగమైన సన్యాసులతో కలిసి ప్రారంభించడం రాజ్యాంగ విరుద్ధమని పేర్కొన్నారు. దేశ ప్రజాస్వామ్య, సార్వభౌమాధికార, సమగ్ర రూపాన్ని దెబ్బతీసేవిగా మోడీ విధానాలున్నాయని విమర్శించారు. క్రీడల్లో అంతర్జాతీయ స్థాయిలో దేశానికి పేరు తెచ్చిన మహిళా రెజ్లర్లు తమపై లైంగిక వేధింపులకు పాల్పడిన బిజెపి ఎంపి బ్రిజ్ భూషణ్ సింగ్‌పై చర్యలు తీసుకోవాలని ఢిల్లీ నడిబొడ్డున కొన్ని రోజులుగా ఆందోళన చేస్తున్నా పట్టించుకోక పోవడం దారుణమన్నారు. మోడీ హయాంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని విమర్శిం చారు. రైతులు, విద్యార్థులు, కార్మికులు.. ఇలా అన్ని తరగతుల వారూ ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. బిజెపి చేపట్టే ప్రజా, కార్మిక, రైతు, విద్యార్థి వ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు భవిష్యత్తులో ఉద్యమాన్ని ఉధృతం చేయనున్నట్టు వెల్లడించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె ప్రసన్న కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశాల్లో సంఘం పూర్వ జాతీయ అధ్యక్షులు వై వెంకటేశ్వరరావు, ప్రస్తుత రాష్ట్ర కార్యదర్శి అశోక్, రాష్ట్ర నాయకులు ఎల్‌జె నాయుడు, పావని, నాగూర్‌బీ, శివ, పల్లవి పాల్గొన్నారు. రాష్ట్ర నలుమూలల నుంచి 360 మంది ప్రతినిధులు హాజరయ్యారు.

భూ యజమానితో సంబంధం లేకుండా..

కౌలు కార్డులు ఇవ్వాలి

సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు

ప్రజాశక్తి - అనకాపల్లి



జాతాలో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు

భూ యజమానితో సంబంధం లేకుండా కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు డిమాండ్ చేశారు. కౌలు రైతుల సమస్యల పరిష్కారం కోరుతూ అనకాపల్లి జిల్లా మునగపాక లో ప్రారంభమైన 'కౌలు రైతుల రక్షణ యాత్ర' రాష్ట్ర జాతా రెండో రోజైన మంగళవారం అనకాపల్లిలోని గవరపాలెం పాల కేంద్రం నుంచి ప్రారంభమైంది. ఈ జాతాను నర్సింగరావు ప్రారంభిస్తూ మాట్లాడారు. వ్యవసాయంలో నూటికి 70 మందిగా ఉన్న కౌలు రైతులు గుర్తింపు కార్డులు లేకపోవడంతో ప్రభుత్వ సహాయం పొందలేకపోతున్నారని తెలిపారు.

2019 ఎన్నికల ముందు జగన్మోహన్‌రెడ్డి రైతులను ఆదుకొని ఆత్మహత్యలను నివారిస్తానని చేసిన వాగ్దానాన్ని అధికారంలోకి వచ్చిన తరువాత విస్మరించారని, అప్పటివరకూ అమల్లో ఉన్న చట్టాన్ని భూస్వాములకు అనుకూలంగా సవరణ చేసి తీరని ద్రోహం చేశారని విమర్శించారు. భూ యజమాని ఆమోదం ఉంటే తప్ప గుర్తింపు కార్డులు ఇవ్వలేని దుస్థితిలో ప్రభుత్వం ఉందన్నారు. దీంతో రైతు భరోసా, బ్యాంకు రుణాలు, పంట నష్ట పరిహారాలు, ఇన్‌పుట్ సబ్సిడీలను కౌలు రైతులు పొందలేక అప్పుల పాలై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా కౌలు రైతులకు మెరుగైన చట్టం తేవాలని, భూ యజమాని ఆమోదంతో నిమిత్తం లేకుండా గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎపి కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎ బాలకృష్ణ, నాయకులు కాళ్ల తేలయ్యబాబు, బి ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు. జాతా పొడుగునా ప్రజానాట్యమండలి కళాకారులు ఆలపించిన రైతు పాటలు ఉత్తేజం నింపాయి. జాతా చోడవరం, బుచ్చయ్యపేట మండలాల్లోని పలు గ్రామాల్లో సాగింది.

అధిక వడ్డీ రేట్లతో వృద్ధికి దెబ్బ

- ప్రపంచ బ్యాంక్ హెచ్చరిక
- ఆర్‌బిఐ సమీక్షా ప్రారంభం

వాషింగ్టన్ : హెచ్చు వడ్డీ రేట్లతో ఆర్థిక వ్యవస్థల వృద్ధి దెబ్బతిననుందని ప్రపంచ బ్యాంక్ విశ్లేషించింది. 2023లో ప్రపంచ వృద్ధి రేటు 2.1 శాతానికి పడిపోనుందని అంచనా వేసింది. 2022లో 3.1 శాతం వృద్ధి చోటు చేసుకుంది. 189 దేశాలు సభ్యత్వం కలిగిన ప్రపంచ బ్యాంక్ తన తాజా గ్లోబల్ ప్రాస్పెక్ట్స్ రిపోర్ట్‌లో పలు దేశాలు వరుసగా పెంచుతున్న వడ్డీ రేట్ల పట్ల ఆందోళన వ్యక్తం చేసింది. మంగళవారం విడుదల చేసిన ఈ రిపోర్ట్ ప్రకారం.. హెచ్చు వడ్డీ రేట్లకు తోడు ఉక్రెయిన్, రష్యాలోని ఆందోళన పరిణామాలు, కరోనా వైరస్ మహమ్మారి దీర్ఘకాలిక ప్రభావాలతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మందగించే అవకాశం ఉందని విశ్లేషించింది. 2022లో 3.1 శాతం పెరిగిన ఆర్థిక వ్యవస్థ, ప్రస్తుత ఏడాదిలో 2.1 శాతం మాత్రమే విస్తరించవచ్చని అంచనా వేసింది. అమెరికాకు చెందిన ఫెడరల్ రిజర్వ్, ఇతర ప్రధాన కేంద్ర బ్యాంకులు ద్రవ్యోల్బణాన్ని ఎదుర్కోవడానికి దూకుడుగా వడ్డీ రేట్లను పెంచుతున్నాయి. ఇది మహమ్మారి మాంద్యం, నిరంతర సరఫరా కొరత, ఉక్రెయిన్ యుద్ధం కారణంగా ఏర్పడిన అనిశ్చిత్తి, ఆహార ధరల షాక్‌ల నుండి ఊహించిన దానికంటే ఆర్థిక వ్యవస్థ కొంత బలంగా పుంజుకుంటునప్పటికీ ఆందోళకరమేనని పేర్కొంది. అధిక రుణ వ్యయాల వల్ల ఆర్థిక వ్యవస్థలో స్తబ్దత పెరుగుతోందని తెలిపింది. వచ్చే ఏడాది 2024లో 2.4 శాతం వృద్ధి చోటు చేసుకోవచ్చని ప్రపంచ బ్యాంక్ అంచనా వేసింది.

8న ఆర్‌బిఐ నిర్ణయం..

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) మానిటరీ పాలసీ కమిటీ సమావేశాలు మంగళ వారం ప్రారంభమయ్యాయి. ఆర్‌బిఐ గవర్నర్ శక్తికాంత దాస్ అధ్యతన జరుగుతున్న ఈ ద్వైమాసి క ద్రవ్య పరపతి విధాన సమీక్ష జూన్8న ముగియ నుంది. ఇందులో కీలక వడ్డీ రేట్ల మార్పునపై నిర్ణయం తీసుకోనున్నారు. గత ఏప్రిల్‌లో జరిగిన సమీక్షలో వడ్డీ రేట్లను యథాతథంగా ఉంచారు. అంతక్రితం 2022 మే నుంచి వరుసగా రెపోరేటును 250 బేసిస్ పాయింట్ల మేర పెంచారు. దీంతో రుణ గ్రహీతలపై అదనంగా 2.5 శాతం వడ్డీ భారం పడింది.

రూ.800 కోట్ల రుణాల జారీ లక్ష్యం

- కినారా క్యాపిటల్ సిఒఒ వెల్లడి

హైదరాబాద్ : తెలుగు రాష్ట్రాల్లోని ఎంఎస్ఎంఇ పరిశ్రమలకు మరింత మద్దతును అందించనున్నట్లు కినారా క్యాపిటల్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ (సిఒఒ) తిరునావుక్కరసు తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఎపి, టిఎస్‌లో రూ.800 కోట్ల పైగా రుణాలు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. 2016లో తమ సంస్థ ఫిన్‌టెక్‌సేవలను ప్రాంభించిగా ఇప్పటి వరకు 20,000 మంది వ్యాపారులకు అప్పులిచ్చింద న్నారు. 2021-22, 2022-23లో తమ సంస్థ ఆస్తుల్లో 190 శాతం పెరుగుదల చోటు చేసుకుందన్నారు. తెలుగు రాష్ట్రాల్లో ఇప్పటి వరకు రూ.1,200 కోట్ల రుణాలు పంపిణీ చేశామన్నారు. పలు రంగాలలో 300 కంటే ఎక్కువ ఉప రంగాలకు వ్యాపార రుణాలను అందిస్తున్నామన్నారు. తెలుగు రాష్ట్రాల్లో 27 శాఖలతో 300 మంది ఉద్యోగులను కలిగి ఉన్నామన్నారు. 2023-24లో కొత్తగా 150 మందిని నియమించుకోవాలని యోచిస్తున్నామన్నారు.

పొరుగు రాష్ట్రాలకు పరిశ్రమలు

- జె ట్యాక్స్ పేరుతో వేధిస్తున్నారు
- పాదయాత్రలో నారా లోకేష్

ప్రజాశక్తి-కడప అర్బన్

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి జె-ట్యాక్స్ వేధింపుల కారణంగా రాష్ట్రంలోని పరిశ్రమలు పొరుగు రాష్ట్రాలకు తరలిపోయాయని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఆరోపించారు. యువగళం పేరుతో లోకేష్ చేపట్టిన పాదయాత్ర మంగళవారానికి 118 రోజుకు చేరుకుంది. కడప శివారులోని బిల్టప్ విడిది కేంద్రం నుంచి పాదయాత్ర ప్రారంభమై కడప నగరంలోని రామకృష్ణ కాలేజ్, మాసీమ సర్కిల్, రెండవ గాంధీబొమ్మ, చెన్నూరు బస్టాండ్, మొదటి గాంధీబొమ్మ, గోకుల్ సర్కిల్, కృష్ణదేవరాయ సర్కిల్, శంకరాపురం, అప్సర సర్కిల్, ఎన్‌టిఆర్ సర్కిల్, చిన్నచౌక్, రాజరాజేశ్వరి కల్యాణ మండపం ఎదుట విడిది కేంద్రం వరకూ కొనసాగింది. పలుచోట్ల లోకేష్ మాట్లాడుతూ జె-ట్యాక్స్ కారణంగా ఆర్యవైశ్యులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. రకరకాల పన్నులతో వ్యాపారులను వేధింపులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో అన్నిరకాల ప్రభుత్వ, కాంట్రాక్ట్ ఉద్యోగులకు వైసిపి ప్రభుత్వం తీరని అన్యాయం చేసిందని విమర్శించారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో 2014కు ఐదేళ్ల సర్వీసు పూర్తిచేసిన కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని జగన్ కొత్త డ్రామా మొదలుపెట్టారన్నారు. ప్రజలకు మెరుగైన పౌరసేవలందించేందుకు ఉద్దేశించిన మీ సేవ వ్యవస్థను జగన్ నిర్వీర్యం చేశారని విమర్శించారు. కడప స్టీల్ ప్లాంట్‌కు జగన్ రెండుసార్లు శిలాఫలకాలు వేశారని అయితే పనులు అడుగు కూడా ముందుకు కదలలేదన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చాక కడప స్టీల్ ప్లాంట్ నిర్మాణాన్ని వేగవంతం చేసి స్థానిక యువతకు ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా మారుస్తామన్నారు. దానిమ్మ, అరటి, బొప్పాయి, మామిడి, కర్జూరం తదితర పంటలు వేసేలా అధిక ప్రోత్సాహకాలు ఇస్తామని తెలిపారు. రాయలసీమ రైతులకు సరైన ప్రోత్సాహం ఇస్తే బంగారం పండిస్తారని పేర్కొన్నారు. పరిపాలన ఒకే చోట అభివృద్ధి వికేంద్రీకరణ టిడిపి నినాదమన్నారు.



కడప నగరంలో పాదయాత్రలో నారా లోకేష్



టిడిపి గోపవరం జడ్‌పిటిసిపై దాడి

ప్రజాశక్తి-గోపవరం

వైఎస్ఆర్ జిల్లా గోపవరం టిడిపికి చెందిన జడ్‌పిటిసి సభ్యులు అలవాయి జయరామిరెడ్డిపై వైసిపి అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయిన వేణుగోపాల్‌రెడ్డి అనుచరులు దాడి చేశారు. మంగళవారం తెల్లవారుజామున 3.30 గంటల సమయంలో జయరామిరెడ్డి తన ఇంటి వద్ద నిద్రిస్తున్న సమయంలో వేణుగోపాల్‌రెడ్డి అనుచరులైన సుబ్బారెడ్డి, సుబ్బరాయుడు దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో జయరామిరెడ్డితో పాటు ఇద్దరు మహిళలకు గాయాలయ్యాయి. టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్ర జిల్లాలో జరుగుతున్న నేపథ్యంలో జనసమీకరణ చేయడం ఓర్వలేక తనపై దాడి చేశారని, అసభ్య పదజాలంతో దూషించారని, తనను చంపుతామని బెదిరించారని బాధితుడు బద్వేలు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బద్వేలు ప్రభుత్వాస్పత్రిలో జయరామిరెడ్డికి ప్రాథమిక చికిత్స చేసి అనంతరం కడప రిమ్స్‌కు మెరుగైన చికిత్స కోసం తరలించారు. ఈ సంఘటనపై బద్వేల్ రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. జయరామిరెడ్డిని మాజీ మంత్రి అమర్‌నాథ్‌రెడ్డి, ఎమ్మెల్సీ రాంభూపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, టిడిపి నాయకులు రెడ్యం వెంకటసుబ్బారెడ్డి, నాయకులు, కార్యకర్తలు పరామర్శించారు. దాడిని వారు తీవ్రంగా ఖండించారు. దాడిచేసిన వారిపై కఠినచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మల్టీ ప్రొడక్ట్ ఇండస్ట్రియల్ పార్కు వద్దు

- తేల్చి చెప్పిన ప్రభావిత గ్రామాల ప్రజలు
- ప్రజాభిప్రాయ సేకరణలో పెల్లుబికిన ఆగ్రహం
- సభ వద్దకు రాకుండా టిడిపి నాయకులు, మత్స్యకారులను అడ్డుకున్న పోలీసులు

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి




యు.కొత్తపల్లి మండలం మూలపేట వద్ద మాజీ ఎమ్మెల్యే వర్మను అడ్డుకుంటున్న పోలీసులు

కాకినాడ సెజ్‌లో 'మల్టీ ప్రోడక్ట్ ఇండస్ట్రియల్ పార్కు'ను ఏర్పాటు చేయొద్దని పలు గ్రామాల ప్రజలు తేల్చి చెప్పారు. కాకినాడ జిల్లా తొండంగి మండలం పెరుమాళ్లపురంలో కాకినాడ ఎస్ఇజడ్ లిమిటెడ్ ప్రాతిపదించిన 'మల్టీ ప్రోడక్ట్ ఇండస్ట్రియల్ పార్కు'(ఎంఐపి) కోసం మంగళవారం పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. సెజ్‌లో 4072.63 ఎకరాల్లో రూ.2,500 కోట్లతో దీన్ని ఏర్పాటు చేయనున్నారు. ప్రజాభిప్రాయణ సేకరణ నేపథ్యంలో పెరుమాళ్లపురంలో పెద్ద ఎత్తున పోలీసులు మొహరించారు. ప్రజాభిప్రాయ సేకరణ సభకు వస్తున్న పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్‌విఎస్ఎన్.వర్మను, పలువురి మత్స్యకారులను యు.కొత్తపల్లి మండలం మూలపేట వద్ద పోలీసులు అడ్డుకున్నారు. సభా ప్రాంగణం వద్ద సైతం పెద్ద ఎత్తున పోలీసులు మొహరించారు.

ఈ సభకు తొండంగి మండలం పెరుమాళ్ల పురంతో పాటూ తొండంగి, కోదాడ, యు.కొత్తపల్లి మండలం రమణక్కపేట, మూలపేట గ్రామస్తులు హాజరయ్యారు. ఈ మేరకు కలెక్టర్ కృతికాశుక్లా, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఇఇ ఎన్.అశోక్‌కుమార్ పాల్గొని పరిశ్రమ వివరాలను గ్రామస్తులకు వివరించే ప్రయత్నం చేశారు. ఈ సమయంలో 'పొల్యూషన్ కంపెనీలు మాకు వద్దు' అంటూ' పలు గ్రామాల ప్రజలు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు, మత్స్యకారులు మాట్లాడారు. గతంలో ప్రతిపక్ష నేతగా ఉన్న సమయంలో సెజ్‌లో కాలుష్య పరిశ్రమలను జగన్ వ్యతిరేకించారన్నారు. ఇప్పుడు కాలుష్య పరిశ్రమలను ఎలా ఏర్పాటు చేస్తారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. గుట్టుచప్పుడు కాకుండా ప్రజాభిప్రాయ సేకరణకు అధికారులు ప్రయత్నించడం శోచనీయమన్నారు. ఇలాంటి పరిశ్రమల వల్ల తీర ప్రాంతం కాలుష్యానికి గురై మత్స్య సంపదకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. దీని వల్ల తమ జీవనోపాధికి పూర్తిగా గండిపడుతుందని తెలిపారు. 32 మంది మత్స్యకారులు, రైతులు, హేచరీస్ ప్రతినిధులు, యాదవ సంఘాల నాయకులు, సామాజిక కార్యకర్తలు తమ అభిప్రాయాలను వెల్లడించారు. కాలుష్యం లేకుండా పరిశ్రమలు ఏర్పాటు చేయాలని, స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కొంతమంది తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు.

మత్స్యకారుల మనుగడకే ముప్పు



తీర ప్రాంతంలో సముద్రంపై ఆధారపడి ఈ ప్రాంతంలో దాదాపు 50 వేల మంది మత్స్యకార కుటుంబాలు జీవనం సాగిస్తున్నాం. కాలుష్యకారక పరిశ్రమలు వస్తే మా మత్స్యకారుల మనుగడ దెబ్బతింటుంది. చేపల వేటపైనే ఆధారపడి ఉన్నాం. మాకు భూములు, ఆస్తులు లేవు. మా మనుగడ దెబ్బతినకుండా ఉండే విధంగా పరిశ్రమలు ఏర్పాటు చేస్తామంటే దానికి మేము సహకరిస్తాం. కాలుష్య పరిశ్రమలను ఏర్పాటు చేస్తే మాత్రం వ్యతిరేకంగా ఉద్యమిస్తాం.

- ఎం. వెంకటేశ్వరరావు, మత్స్యకారుడు అమీనాబాద్, యు.కొత్తపల్లి మండలం

సంపాదకీయం

అందరికీ ఇంటర్నెట్

ఇంటర్నెట్‌ను ప్రాథమిక హక్కుగా గుర్తించిన తొలి రాష్ట్రంగా కేరళ రికార్డులకెక్కింది. ఎల్‌డిఎఫ్ ప్రభుత్వ పాలనలో...విద్య, ఆరోగ్యం, మానవాభివృద్ధి, లింగ సమానత్వం, సామాజిక అభివృద్ధి, పర్యావరణం... ఇలా అన్ని రంగాల్లోనూ అగ్రగామిగా నిలిచిన ఆ రాష్ట్రం డిజిటల్ రంగాన్ని సామాన్యుడికి అందుబాటులోకి తేవడమే లక్ష్యంగా వడివడిగా అడుగులు వేయడం శ్లాఘనీయం. పేద, గొప్ప తారతమ్యాలు లేకుండా అందరికీ హైస్పీడ్ ఇంటర్నెట్ అందించాలనే లక్ష్యంతో కె-ఫోన్ (కేరళ ఫైబర్ ఆప్టిక్ నెట్‌వర్క్) ప్రాజెక్టును ఆ రాష్ట్ర సి.ఎం పినరయి విజయన్ తాజాగా ప్రారంభించారు. రోజురోజుకూ ఇంటర్నెట్ ధరలను పెంచేస్తూ, సామాన్యుడిని పీల్చిపిప్పి చేసి లాభాలను దండుకుంటున్న కార్పొరేట్, ప్రైవేట్ కేబుల్ నెట్‌వర్క్‌లు, సర్వీస్ ప్రొవైడర్లకు ప్రత్యామ్నాయంగా కేరళ ప్రభుత్వం కె-ఫోన్ ప్రాజెక్టును అందుబాటులోకి తీసుకొచ్చింది. రాష్ట్రంలోని ప్రభుత్వ కార్యాలయాలతోపాటు దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న 20 లక్షలకుపైగా కుటుంబాలకు ఉచితంగా, మిగిలిన వారికి సబ్సిడీ రేట్లకు హైస్పీడ్ ఇంటర్నెట్ సౌకర్యం కల్పించడంతోపాటు అవసరమైన డిజిటల్ సాధనాలతో, అవకాశాలతో వారికి సాధికారత కల్పించడమే ఈ బృహత్తర ప్రాజెక్టు లక్ష్యం.

కంప్యూటర్ లిటరసీ, డిజిటల్ డివైడ్ వంటి మాటలు ఎక్కువగా వింటున్నాం. ఎటువంటి అసమానతలు లేకుండా అందరికీ అందుబాటులో ముఖ్యంగా సామాన్యులకు అంతర్జాలాన్ని అందుబాటులోకి తేవడం బహుప్రశంసనీయం. ఐ.టి రంగంలో ప్రపంచం శరవేగంగా దూసుకెళ్తున్న ప్రస్తుత పరిస్థితుల్లో 20 లక్షల బిపిఎల్ కుటుంబాలను ఆ పోటీలోకి తీసుకొచ్చేందుకు లెఫ్ట్ డెమొక్రటిక్ ప్రభుత్వం శ్రీకారం చుట్టడం ముదావహం. ఇప్పటికే 17,412 ప్రభుత్వ కార్యాలయాలకు, 2,105 నివాసాలకు ఇంటర్నెట్ సదుపాయం కల్పించారు. రెండు వేల బహిరంగ ప్రదేశాల్లో ఉచిత వైఫై సదుపాయం కూడా అందిస్తుంది. 30 వేల కిలోమీటర్ల ఆప్టికల్ ఫైబర్ నెట్‌వర్క్ ద్వారా ఇది సాధ్యమైంది.

సమగ్ర సామాజిక ప్రగతికి సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకునేందుకు ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం 2017లో ప్రారంభించిన ప్రాజెక్టు వాస్తవరూపం దాల్చుతోంది. భారీ వరదలు, కోవిడ్ విజృంభణ ప్రాజెక్టును సకాలంలో పూర్తి చేయడానికి ఆటంకం కలిగించినప్పటికీ, ప్రాజెక్ట్‌ను అమలులోకి తీసుకురావడం 'నూతన కేరళ ఆవిర్భావం' దిశగా ప్రభుత్వ సంకల్పాన్ని చూపుతుంది. యూనివర్సల్ ఇంటర్నెట్ కనెక్టివిటీ నాలెడ్జ్ ఎకానమీ వృద్ధికి తోడ్పడుతుంది. కె-ఫోన్ ప్రాజెక్టు మారుమూల గ్రామాల్లో సైతం స్టార్టప్‌లు, ఇతర చిన్న పరిశ్రమలను ప్రేరేపించే పథకం, తద్వారా ఉపాధి అవకాశాలు వెల్లువెత్తించాలనేది ప్రభుత్వ సంకల్పం. ఆన్‌లైన్‌లో ఇప్పటికే ఉన్న ఎనిమిది వందల ప్రభుత్వ సర్వీసులను కె-ఫోన్‌తో అనుసంధానమై ఒకే సైట్ ద్వారా యాక్సెస్ చేయవచ్చు.

కె-ఫోన్ ఇప్పటికే ప్రపంచ మీడియా దృష్టిని ఆకర్షించింది, అభివృద్ధి చెందిన దేశాలతో పోటీ పడేలా, కార్పొరేట్ ఆధిపత్య టెలికాం రంగానికి ఓ ప్రత్యామ్నాయం. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోలేక ఏ ఒక్కరూ వెనకడుగు వేయకూడదన్నదే ఎల్‌డిఎఫ్ ప్రభుత్వ నిర్ణయం. ప్రజల కనీస అవసరాలైన ఆహారం, దుస్తులు, నివాసం, జీవిత ప్రగతికి ప్రాథమిక అవసరంగా మారిన ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ వంటి వాటిపై శ్రద్ధ వహించే ప్రభుత్వం వాస్తవంగా మారింది.

ఆంధ్రప్రదేశ్‌తోపాటు తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక తదితర రాష్ట్రాల్లో ప్రభుత్వరంగంలో హైస్పీడ్ బ్రాడ్ బాండ్ నెట్‌వర్క్‌లు ఉన్నప్పటికీ పూర్తిస్థాయిలో సేవలందించడంలో వెనుకబాటు ఉంది. కేరళ ప్రభుత్వం మాదిరిగా బిపిఎల్ కుటుంబాలన్నింటికీ ఉచితంగా కనెక్షన్లు అందించే ప్రణాళికేదీ ఈ ప్రభుత్వాల వద్ద లేదు. అన్నింటా ఐ.టి రంగం విస్తరిస్తున్న ఈ తరుణంలో కార్పొరేట్, ప్రైవేట్ దోపిడీ నుంచి సామాన్యుడికి ఊరట కలిగించే ప్రణాళికలను చేపట్టడం బాధ్యతగా మిగిలిన ప్రభుత్వాలు కూడా తీసుకుని, కేరళ బాటలో నడవాలి.

మహనీయుల మాట



భిన్నాభిప్రాయాలు లేకుండా సజీవమైన, శక్తివంతమైన ఉద్యమం వుండదని నా విశ్వాసం. సర్వ సంపూర్ణమైన ఏకాభిప్రాయం శ్మశానంలో మాత్రమే సాధ్యపడుతుంది.

\- జోసెఫ్ స్టాలిన్

పెట్టుబడిదారీ విధానంపై యువతలో ఆగ్రహం

అంతర్జాతీయం



ఎం. కోటేశ్వరరావు

ఎవరు ఎన్ని చెప్పినా చివరికి కారల్ మార్క్స్ చెప్పిందే సరైనదా? అంటూ జర్మన్ కార్పొరేట్ల పత్రిక 'డెర్ స్పీగల్' ఈ ఏడాది జనవరిలో ఒక విశ్లేషణను ప్రచురించింది. అంతకు ముందు గతేడాది సెప్టెంబరులో అమెరికా పరిశోధనా సంస్థ 'ప్యూ' సోషలిజం-పెట్టుబడిదారీ విధానాల గురించి అమెరికన్లలో ఉన్న వైఖరి గురించి సర్వే వివరాలను వెల్లడించింది. దీనిలోని కొన్ని ముఖ్య అంశాలను చూద్దాం. అమెరికాలో పద్దెనిమిది-ఇరవై తొమ్మిది సంవత్సరాల వయస్సు వారిలో సోషలిజాన్ని సమర్ధించే వారు 44 శాతం మంది ఉండగా పెట్టుబడిదారీ విధానాన్ని అభిమానించిన వారు 40శాతం ఉన్నారు. 2019 మే నెలలో క్యాపిటలిజం పట్ల సానుకూలంగా ఉన్న వారు 65 శాతం కాగా 2022 ఆగస్టులో వారు 57 శాతానికి తగ్గారు. ఇదే కాలంలో సోషలిజం పట్ల సానుకూలంగా ఉన్నవారు 42 నుంచి 36 శాతానికి తగ్గినట్లు పేర్కొంది. 'ఆక్సియోస్' సర్వే ప్రకారం 2019 నుంచి 2021 వరకు చూస్తే రిపబ్లికన్ పార్టీని సమర్ధించే 18-34 సంవత్సరాల యువతలో పెట్టుబడిదారీ విధానాన్ని సమర్ధించేవారు 81 నుంచి 66 శాతానికి తగ్గారు. మొత్తంగా సోషలిజాన్ని సమర్ధించే వారు 39 నుంచి 41 శాతానికి పెరిగారు. ధనిక దేశాల్లో పెట్టుబడిదారీ విధానం ఎదుర్కొంటున్న తీవ్ర సమస్యల పూర్వరంగంలో సోషలిజం, మార్క్స్ మీద ప్రేమ కంటే పెట్టుబడిదారీ విధాన సమర్ధకులను హెచ్చరిస్తూ చేసిన విశ్లేషణలు ఇవి అన్నది గమనించాలి. సర్వే సంస్థలు ఇచ్చే ప్రశ్నావళి, దానికి అడిగే సమాధానాల తీరు తెన్నులను బట్టి సమర్ధకులు, కాని వారి సంఖ్య మారుతున్నప్పటికీ రూపుదిద్దుకుంటున్న ప్రధాన ధోరణులు ఏమిటన్నదానిని చూడాలి. గతంలో సోషలిజాన్ని వ్యతిరేకించే అంశం గురించి చర్చలు జరిగితే ఇప్పుడు పెట్టుబడిదారీ విధాన వైఫల్యం గురించి కమ్యూనిస్టుల కంటే పెట్టుబడిదారీ విధాన సమర్ధకులే ఎక్కువగా మాట్లాడుతున్నారు.

"పెట్టుబడిదారీ విధానం మీద విమర్శ కొత్తదేమీ కాదు. కరోనా మహమ్మారి నాలుగో సంవత్సరం, ఉక్రెయిన్ యుద్ధం రెండవ సంవత్సర ప్రారంభంలో గమనించాల్సినంతగా అది పెరుగుతున్నది. అనేక అంశాలు ఎక్కువ కాలం పని చేయవు. ప్రపంచీకరణ కుప్పకూలుతున్నది, దానితో పాటే జర్మన్ తరహా కలిమి కూడా ఉంది.ప్రపంచం శత్రుపూరిత కూటములలో పాదుకొని పోతున్నది. ద్రవ్యోల్బణం పేదలు-ధనికులను మరింతగా వేరు చేస్తున్నది. దాదాపు అన్ని పర్యావరణ లక్ష్యాలు తప్పాయి. వ్యవస్థలో కనిపిస్తున్న కొత్త పగుళ్లన్నింటినీ రాజకీయవేత్తలు ఇంకేమాత్రమూ సరి చేయలేరు. ఒక పెద్ద సమస్య తరువాత మరొకటి వెనుకే వస్తున్నది, అవన్నీ ఒకదానితో ఒకటి సంబంధం కలిగి ఉన్నాయి. ఇంధన సంక్షోభం, వాణిజ్య పోరు, ప్రపంచ యుద్ధం పోకడలు కనిపిస్తున్నాయి. జనాకర్షక (మభ్యపెట్టే) నేతలు, నిరంకుశ పాలకుల నుంచి ప్రజాస్వామ్యం దాడులను ఎదుర్కొంటున్నది. ఇటీవలి వరకు ఈ సమస్యలన్నింటికీ ఒక పరిష్కారం ఉంటుందని, మార్కెట్ తనను తాను రక్షించుకోగలదని అనుకున్నారు. కానీ ఈ రోజు దాన్ని ఎంత మంది నిజంగా నమ్ముతున్నారు? ప్రత్యేకించి అన్ని ప్రతికూలతలు, వాతావరణ సంక్షోభం అనేక రెట్లు పెరుగుతున్నది." ఇలాంటి వర్ణన సాధారణంగా సోషలిస్టు, కమ్యూనిస్టు పార్టీలు చేస్తుంటాయి. కానీ ఇదంతా పెట్టుబడిదారీ విధానాన్ని సమర్ధించే 'డెర్ స్పీగల్' విశ్లేషకుల అభిప్రాయాల సారమే. అంతేనా?

"పెట్టుబడిదారీ విధానాన్ని తక్షణమే మౌలికంగా సంస్కరించాల్సి ఉంది. లేకుంటే అది నాశనమౌతుంది గనుక తగిన చర్యలు తీసుకోవాలి" అని రే డాలియో అనే 2200 కోట్ల డాలర్ల హెడ్జ్ ఫండ్ మేనేజర్ చెప్పాడు. ఫైనాన్సియల్ టైమ్స్, గోల్డ్‌మన్ శాచ్స్, బోష్ వంటి సంస్థలు ఎన్నో ఇలాంటి అభిప్రాయాలను వెల్లడించినట్లు ఆ పత్రిక విశ్లేషకులు ఉటంకించారు. "మహా పెట్టుబడిదారులుగా రుజువు చేసుకున్న వారు ప్రపంచస్థితి గురించి చెబుతూ ఆకస్మికంగా కారల్ మార్క్స్ అభిమానుల మాదిరి మాట్లాడుతున్నారు. అనేక ప్రాంతాల్లో ప్రభుత్వాలు, కార్పొరేట్ ప్రధాన కార్యాలయాలు, అగ్రశ్రేణి మేధావులు, వ్యవహార జ్ఞానులు ఎవరైనా అడుగుతున్న అతి పెద్ద, మౌలిక ప్రశ్న ఏమిటంటే ఈ ఆర్థిక వ్యవస్థతో మనం కొనసాగగలమా అంటున్నారు." అని 'డెర్ స్పీగల్' అన్నదంటే పెట్టుబడిదారులకు తమ వ్యవస్థ మీద తమకే విశ్వాసం సన్నగిల్లుతున్నదని చెప్పినట్లే . దీని అర్ధం వారు చేతులు ముడుచుకు కూర్చుంటారని కాదు, దాన్ని అధిగమించేందుకు, జనాన్ని తొక్కిపెట్టేందుకు కొత్త పద్ధతులను వెతికే పనిలో ఉన్నారని చెప్పవచ్చు. ప్రస్తుతం పెట్టుబడిదారీ విధానం సాధారణ సంక్షోభాన్ని కాదు ప్రపంచంలో 2023లో విధానపరమైన సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నట్లు 'డెర్ స్పీగల్' విశ్లేషకులు చెబుతున్నారు.

వారి అసలు బాధ ఏమిటో కూడా దాచుకోలేకపోయారు. "పారిశ్రామిక దేశాలలో సంవత్సరాల తరబడి ఒక స్పష్టమైన ఆగ్రహం వ్యాపిస్తున్నది. అది సైద్ధాంతిక కారణాలతో కాదు, ఎందుకంటే ఇళ్ల అద్దెలు విపరీతంగా పెరుగుతున్నాయి, ఎందుకంటే ఆస్తులను కొనుగోలు చేయలేనివిగా మారాయి. వనరులనుంచి సంపదలను సృష్టించే యంత్రం అందరికీ సృష్టించనపుడు దాన్ని ఎందుకు ఆమోదించాలి" అని ప్రశ్నిస్తున్నారని అంటూ అమెరికాలో సోషలిజం పట్ల యువతలో సానుకూల వైఖరి పెరగటాన్ని ఉటంకించారు. అసంతృప్తి, ఆగ్రహం, ఉద్యోగాలకు రాజీనామాలతో నిరసన కొట్టవచ్చినట్లుగా కనిపిస్తోందని, సోషలిస్టు సిద్ధాంతాల పట్ల ఆకర్షితులౌతున్నట్లు పేర్కొన్నారు. గతంలో ఇదే పత్రిక జరిపిన సర్వేలో పెట్టుబడిదారీ విధానం వాతావరణ సంక్షోభానికి కారకురాలైనట్లు సగం మంది జర్మన్లు భావిస్తున్నట్లు వెల్లడైంది. ఎక్కడైనా సంక్షోభాలు తలెత్తినపుడే దాన్నుంచి బయటపడే మార్గాలను సమాజం వెతుకుతుంది. అసలీ కారల్ మార్క్స్-ఫెడరిక్ ఎంగెల్స్ పుట్టకపోతే ఈ కమ్యూనిస్టు సిద్ధాంతం ఉండేది కాదని కొందరు అనుకుంటారు. వారుగాక పోతే మరొకరు, మరొకరు దోపిడీని అంతం చేసే శాస్త్రీయ సిద్ధాంతాన్ని ముందుకు తెచ్చి ఉండేవారు. సోషలిజం గాకపోతే మరొక పేరు పెట్టి ఉండేవారు. దోపిడీ అంతం కావటం, సమ సమాజం రావటం తప్ప పేరు ఏదైతేనేం. నిజానికి వారి కంటే ముందుగానే సోషలిజం గురించి చెప్పిన వారున్నారు. దాన్ని సాధించే మార్గం వారు చెప్పలేకపోయారు గనుక వారిని ఊహాజనిత సోషలిస్టులని పిలిచారు. మన దేశంలో కూడా సర్వేజనా సుఖినో భవంతు అని చెప్పిన వారు, వసుదైక కుటుంబం అన్నవారి గురించి తెలిసిందే.

అమెరికాలో 'ప్యూ' సంస్థ జరిపిన సర్వే ప్రకారం అక్కడి డెమోక్రాట్లలో అనేక మంది...పౌరుల మౌలిక అవసరాలను సోషలిజం తీరుస్తుందని నమ్ముతున్నారు. వ్యక్తిగత స్వేచ్ఛను హరిస్తుందని రిపబ్లికన్లు చెబుతారు. 2019లో సోషలిజం పట్ల డెమోక్రాట్లలో 65 శాతం మంది సానుకూలంగా ఉన్నారని 2022లో 57 శాతానికి తగ్గినట్లు సర్వే చెప్పింది. పెట్టుబడిదారీ విధానం గురించి సానుకూల వైఖరి ఉన్న డెమోక్రాట్లు ఇదే కాలంలో 55 నుంచి 46 శాతానికి తగ్గినట్లు కూడా పేర్కొన్నది. దీన్ని ఏ విధంగా చూడాలి? ఏ సమాజంలోనైనా మధనం జరగాలి. అమెరికాలో ఇప్పుడు అదే జరుగుతున్నదని చెప్పవచ్చు. పెట్టుబడిదారీ విధానం పట్ల రిపబ్లికన్లలో సానుకూల వైఖరి 78 నుంచి 74 శాతానికి తగ్గింది. ఇదీ మంచి పరిణామమే కదా! పెట్టుబడిదారీ విధానం ఎక్కువ అవకాశాలను కల్పిస్తుందని నమ్ముతున్నవారు తగ్గుతున్నారు. తక్కువ కుటుంబ ఆదాయం ఉన్న వారు సోషలిజం పట్ల సానుకూలంగా ఉంటే ఎక్కువ వస్తున్నవారు పెట్టుబడిదారీ విధానమే ఉండాలని కోరుకుంటున్నారు. జనాలకు మౌలిక అవసరాలైన ఆహారం, ఆరోగ్యం, ఇంటి వసతులను సోషలిజం తీరుస్తుందని 38 శాతం నమ్ముతుంటే 18 శాతానికి పెట్టుబడిదారీ విధానం మీద భ్రమలు ఉన్నాయి. మూడు పదులు దాటిన వారిలో వయసుపైబడిన కొద్దీ సోషలిజం పట్ల సానుకూల వైఖరి ఉన్నవారు తగ్గినట్లు సర్వే వెల్లడించింది. దానిలో ఆశ్చర్యం ఏముంది? తీవ్రమైన సోషలిస్టు వ్యతిరేక ప్రచారానికి లోనైన వారు. గతంలో అనుభవించిన సామాజిక రక్షణ పథకాలు నేటి తరాలకు అందుబాటులో ఉండటం లేదు. పాతవారితో పోల్చితే బతుకు దుర్భరంగా మారుతున్నది. అందువలన యువతలో కొత్త ఆలోచనలు. సోవియట్ ఉనికిలో ఉన్నపుడు సోషలిస్టు దేశాల గురించి చేసిన తప్పుడు ప్రచారంతో పోలిస్తే ఇప్పుడు అమెరికాలో అది తగ్గింది. ఎందుకంటే సోషలిజం మీద విజయం సాధించామని అక్కడి పాలకులు మూడు దశాబ్దాల క్రితం ప్రకటించారు. అదే నోటితో ఇప్పుడు పోరు సాగిస్తామని చెప్పలేరు కదా! అందుకే కొత్త తరాలు పెట్టుబడిదారీ విధాన వైఫల్యం గురించి ఆలోచించే క్రమంలో ప్రత్యామ్నాయంగా సోషలిజం తప్ప మరొకటి కనిపించటం లేదు గనుక దాని పట్ల క్రమంగా సానుకూలత పెరుగుతోంది.

సోషలిస్టు దేశాలంటే జనానికి ఇచ్చిన మేరకు తీసుకోవటం తప్ప అవసరమైన సరకులను అందించలేరంటూ ఖాళీగా ఉన్న దుకాణాలను చూపి కట్టుకథలను ప్రచారం చేశారు. మరోవైపు చైనాలో కమ్యూనిస్టు ప్రభుత్వాన్ని విమర్శిస్తారు. కానీ అక్కడి నుంచి కావాల్సిన వస్తువులన్నింటినీ దిగుమతి చేసుకుంటారు. ఆ మేరకు తమ ప్రభుత్వం తమ ఉపాధి అవకాశాలను దెబ్బ తీస్తున్నదని అమెరికన్లు భావించటంతో పాటు చైనా అనేక దేశాలకు వస్తువులను ఎలా అందచేస్తున్నది. అక్కడ ఉపాధిని, ఆదాయాలను ఎలా పెంచుతున్నది అనే మధనం కూడ ప్రారంభమైంది.మనకు పెట్టుబడిదారీ విధానం వలన ఉపయోగం ఏమిటి? అన్న సందేహాలు మొగ్గ తొడిగాయి. వరుసగా వచ్చిన ఆర్థిక మాంద్యాలకు పెట్టుబడిదారీ దేశాలు ప్రభావితమైనట్లుగా చైనాలో జరగకపోవటం కూడా అమెరికన్లలో సోషలిజం పట్ల మక్కువను పెంచింది. నూట ఆరు సంవత్సరాల చరిత్రలో తొలిసారిగా బ్రిటన్‌లో నర్సులు సమ్మె చేశారు. ఫ్రాన్సు సమ్మెలు, ప్రదర్శనల ఆందోళనలతో ఉడికిపోతోంది. ప్రభుత్వం దిగిపోవాలని 74 శాతం మంది కోరుకుంటున్నారు. ఐరోపాలో అనేక దేశాల్లో కార్మికవర్గం వీధుల్లోకి వస్తోంది. పెట్టుబడిదారీ విధానం మీద కరోనాకు ముందే అమెరికాలో దాడి మొదలైందని, తరువాత ఆర్థిక, సామాజిక ఇబ్బందులు పెరగటంతో మరింత తీవ్రమైందని కొందరు గగ్గోలు పెడుతూ పత్రికల్లో రాశారు. పెట్టుబడిదారీ విధానం చితికింది అని న్యూయార్క్ టైమ్స్ పత్రిక, ఇంకేమాత్రం పెట్టుబడిదారీ విధానం పనిచేయదు అంటూ సిఎన్ఎన్, పెట్టుబడిదారీ విధానాన్ని తిరిగి పెద్ద ఎత్తున తిరిగి ప్రారంభించాలి అని ప్రపంచ ఆర్థిక వేదిక వంటివి చెప్పిన తరువాత జనాలకు ఆ వ్యవస్థ మీద విశ్వాసం ఎలా పెరుగుతుంది. మరో ప్రపంచం అదీ సోషలిస్టు సమాజం సాధ్యమే అని చెప్పేందుకు పెట్టుబడిదారీ విధానమే అనేక అవకాశాలను ముందుకు తెచ్చింది.

ఆందోళనలో పాలకవర్గం !



పెట్టుబడిదారీ విధానం పట్ల రిపబ్లికన్లలో సానుకూల వైఖరి 78 నుంచి 74 శాతానికి తగ్గింది. ఇదీ మంచి పరిణామమే కదా! పెట్టుబడిదారీ విధానం ఎక్కువ అవకాశాలను కల్పిస్తుందని నమ్ముతున్నవారు తగ్గుతున్నారు. తక్కువ కుటుంబ ఆదాయం ఉన్న వారు సోషలిజం పట్ల సానుకూలంగా ఉంటే ఎక్కువ వస్తున్నవారు పెట్టుబడిదారీ విధానమే ఉండాలని కోరుకుంటున్నారు. జనాలకు మౌలిక అవసరాలైన ఆహారం, ఆరోగ్యం, ఇంటి వసతులను సోషలిజం తీరుస్తుందని 38 శాతం నమ్ముతుంటే 18 శాతానికి పెట్టుబడిదారీ విధానం మీద భ్రమలు ఉన్నాయి.

కవిత్వం

ఆ దేశం మీద జాలిపడు

ఏ దేశ ప్రజలు గొర్రెల్లా ఉంటారో
ఆ జాతిని చూసి జాలిపడు
ఏ గొర్రెల కాపరులు వారిని తప్పుదారి పట్టిస్తారో
ఆ దేశపు బూటకపు నాయకత్వాన్ని చూసి జాలిపడు
ఏ దేశ మేధావులు నోరు విప్పరో
ఏ సద్గుణ సంపన్నులు గాలి కబుర్లతో
గాలితో యుద్ధాలు చేస్తుంటరో
వారినందరినీ చూసి జాలిపడు
అవసరమైనప్పుడైనా గొంతెత్తలేని
జాతి జనుల చూసి జాలిపడు
దాడులు చేసే వారిని పొగడుతూ ఉండడం
హింసిస్తూ, ప్రపంచాన్ని బలవంతంగా
పాలించాలనుకునే ఆంబోతుల్ని - హీరోలనుకుని,
భజనలు చేస్తున్న భక్తుల్ని చూసి జాలిపడు -
తమ భాష తమదే తప్ప, మరో భాష అర్థం చేసుకోలేని
అవివేకులను చూసి జాలిపడు
తమ సంస్కృతీ సంప్రదాయాలు తమవే తప్ప,
ఇంకా వేరేవి కూడా ఉంటాయని
తెలుసుకోలేని మూర్ఖుల్ని చూసి జాలిపడు
డబ్బే ఊపిరిగా బతికే వారిని చూసి జాలిపడు
బాగా మెక్కి నిద్రిస్తున్న వారిని ఇంకా నిద్రబుచ్చుతున్న
కాపాలాదారుల కపటత్వాన్ని చూసి జాలిపడు
హక్కుల్ని, బాధ్యతల్ని గాలికి వదిలేసే దేశప్రజల్నీ..
వారి దేశాన్నీ... చూసి జాలిపడు!
తమ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు కొట్టుకుపోతున్నా,
మిన్నకుండే వానపాము మనస్తత్వాన్ని చూసి జాలిపడు.
స్వేచ్ఛాలోచనతో తలెత్తుకు సగర్వంగా బతికిన
ఓ నా ప్రియమైన దేశమా? నువ్విప్పుడు నిరంతరం
కన్నీళ్ళెందుకు కారుస్తున్నావ్?

ఖలీల్ జీబ్రాన్ భావానికి కవితా రూపం ఇచ్చింది: అమెరికన్ కవి లారెన్స్ ఫెర్‌లిగెట్టి
తెలుగు : డా॥ దేవరాజు మహారాజు

భద్రతా లోపాలు సరిచేయకుంటే మరిన్ని విపత్తులు

సమస్య

ఎం. ప్రశాంత్

'భారత రైల్వేలో ప్రయాణం ఇప్పుడు ఆహ్లాదకరమైన అనుభవంగా మారుతోంది. ఈ స్వాతంత్ర్య అమృతోత్సవ కాలంలో రైల్వేలు గొప్ప ప్రగతిని సాధిస్తున్నాయి. ప్రతి వందేభారత్ రైలు ఆధునిక భారతదేశాన్ని ప్రతిబింబిస్తున్నది. ప్రతి వందేభారత్ రైలు దేశ ప్రగతికి, స్వావలంబనకు ప్రతీకగా మారుతోంది'- ఇవీ ప్రధాని నరేంద్ర మోడీ మాటలు. జనవరి 15న సికింద్రాబాద్-విజయవాడ వందే భారత్ సర్వీస్‌ను ప్రారంభించిన సందర్భంగా ప్రధాని ఈ విధంగా మాట్లాడారు.

వందేభారత్, అమృతోత్సవాల వెలుగులో మోడీ ప్రభుత్వం మరచిపోయిన విషయం ఒకటుంది. అదే ప్రయాణీకుల భద్రత. వచ్చే లోక్‌సభ ఎన్నికలకు ముందు అత్యధిక సంఖ్యలో వందేభారత్ రైళ్లను నడిపేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోంది.

వందే భారత్ కోసం భద్రతతో సహా రైల్వేకు సంబంధించిన అన్ని ఇతర అత్యవసర అవసరాలూ వాయిదా వేయబడుతున్నాయి. ఏటా రైలు ప్రమాదాలు పెరుగుతున్నా ప్రభుత్వం సీరియస్‌గా తీసుకోవడం లేదు. సిగ్నలింగ్ వ్యవస్థలో తీవ్ర లోపాలను ఎత్తిచూపుతూ కాగ్ చేసిన హెచ్చరికను, సీనియర్ అధికారి లేఖను ప్రభుత్వం రైల్ భవన్ చెత్తబుట్ట లోకి విసిరేసింది. దాదాపు 300 మంది ప్రాణాలను బలిగొన్న ఒడిశా రైలు దుర్ఘటన, రైలు రంగం పట్ల మోడీ ప్రభుత్వం చూపుతున్న తీవ్ర ఉదాసీనతకు స్పష్టమైన చిత్రం.

'ప్రైవేటు' కోసమే....

సాధారణ బడ్జెట్‌కు ముందు ప్రత్యేక రైలు బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిలిపివేయబడింది. బ్రిటీష్ పాలనలో 1924 నుండి రైల్వే గణాంకాలు ఇతర ప్రభుత్వ గణాంకాల నుండి విడిగా సమర్పించబడ్డాయి. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కూడా ఇది కొనసాగింది. స్వతంత్ర భారతదేశంలో మొదటి రైలు బడ్జెట్‌ను జాన్ మథాయ్ సమర్పించారు. భారతదేశం వంటి పెద్ద దేశంలో రైల్వే వ్యవస్థ ప్రాముఖ్యతను గ్రహించి, స్వాతంత్ర్యం తర్వాత కూడా ప్రత్యేక బడ్జెట్ సమర్పణ కొనసాగింది. అయితే, 2016లో మోడీ ప్రభుత్వం ప్రత్యేక రైలు బడ్జెట్‌ను ఆపివేసి సాధారణ బడ్జెట్‌లో భాగం చేసింది. వివేక్ దేవరాయ్ కమిటీ సిఫార్సు మేరకు ఈ చర్య తీసుకున్నారు. దీంతో రైల్వే పనుల తీరును పరిశీలించాల్సిన పార్లమెంట్‌లో సవివరమైన రైల్వే బడ్జెట్ చర్చ కూడా కనుమరుగైంది. ప్రభుత్వానికి రెండు లక్ష్యాలు ఉన్నాయి. ఒకటి, వారి ప్రైవేటీకరణ ఎత్తుగడలపై పార్లమెంట్‌లో చర్చ జరగకూడదు. రెండు, రైలు ఛార్జీలలో పారదర్శకత లేకుండా చేయడం, ఫ్లెక్సీ వ్యవస్థను అమలు చేయడం మొదలైనవి.

2027 నాటికి భారతీయ రైల్వేలో 151 ప్రైవేట్ రైళ్లు నడుస్తాయి. స్టేషన్ల ఆధునీకరణ పేరుతో ప్రైవేటీకరణ కూడా అమలు చేస్తున్నారు. విమానాశ్రయాల తరహాలో రైల్వే స్టేషన్లలోనూ యూజర్ చార్జీలను ప్రవేశపెట్టేందుకు మోడీ ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నిస్తోంది. స్టేషన్లను ప్రైవేట్ సంస్థలకు అప్పగించే ఎత్తుగడ కూడా ఉంది. సామాన్యులకు ఆధారమైన రైల్వేలు మెల్లగా ధనికుల విలాసవంతమైన ప్రయాణాలకు వేదికగా మారుతున్నాయి. పోస్టులను భర్తీ చేయకుండా, భద్రతా లోపాలను సరిచేయకుండా...నిర్వహించే వందేభారత్ వేడుకలు... మరిన్ని రైల్వే విపత్తులకు దారి తీస్తాయి.



ఉద్యోగ నియామకాలపై నిషేధం నష్టదాయకం

ప్రైవేటీకరణను వేగవంతం చేసే ప్రక్రియలో భాగంగా రైల్వే నియామకాలను వీలైనంత వరకు తగ్గించడం యుపిఎ-2 ప్రభుత్వ విధానం. మోడీ ప్రభుత్వం దీన్ని మరింత పకడ్బందీగా అమలు చేసింది. ప్రస్తుతం 10 లక్షల ప్రభుత్వ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇందులో 3.14 లక్షల పోస్టులు రైల్వేలో ఉన్నాయి. భద్రతా విభాగంతోపాటు పది వేల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. సెక్యూరిటీ విభాగంలో సరిపడా ఉద్యోగులు లేకపోవడంతో 15-16 గంటల పాటు నిరంతరం పని చేయాల్సిన పరిస్థితి నెలకొంది. మహిళా లోకోపైలట్‌లు సైతం 12 గంటల వరకు నిరంతరంగా పని చేయాల్సి వస్తోంది. పని ఒత్తిడి ప్రభావం సహజంగానే రైల్వేల నిర్వహణపై పడింది. అయితే వందే భారత్ హడావుడిలో మోడీ ప్రభుత్వం ఇవేమీ పట్టించుకోవడం లేదు.

హెచ్చరికలను పట్టించుకోలేదు

రైళ్లు పట్టాలు తప్పడాన్ని తీవ్రంగా పరిగణించి పరిష్కారం చూపాలని గత డిసెంబర్‌లో పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన కాగ్ నివేదిక పేర్కొంది. పట్టాలపై నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో సహా పట్టాలు తప్పడానికి గల కారణాలను నివేదికలో పేర్కొన్నారు. దీంతోపాటు ఫిబ్రవరిలో సౌత్‌వెస్ట్ రైల్ జోన్ ప్రిన్సిపల్ చీఫ్ ఆపరేటింగ్ మేనేజర్ సిగ్నలింగ్ వ్యవస్థ లోని లోపాలను ఎత్తిచూపుతూ ప్రభుత్వానికి లేఖ రాశారు. యశ్వంత్‌పూర్-నిజాముద్దీన్ సంపర్క్ క్రాంతి ఎక్స్‌ప్రెస్ సిగ్నల్ తప్పి గూడ్సు రైలును ఢీకొట్టడంతో ఏర్పడిన పరిస్థితిని లేఖలో వివరించారు. లోకో పైలట్ అప్రమత్తంగా ఉండటం వల్లే పెను ప్రమాదం తప్పిందని, సిగ్నలింగ్ వ్యవస్థలను తనిఖీ చేసి లోపాలను వెంటనే సరిచేయాలని అధికారి కోరినప్పటికీ పెద్దగా పట్టించుకోలేదు.

మరింత వేగంగా ప్రైవేటీకరణ లక్ష్యం

మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రైల్వేల ప్రైవేటీకరణకు పెద్దపీట వేస్తోంది. పిపిపి మోడల్ ముసుగులో ప్రైవేటీకరణ చేపడుతోంది. ఇప్పటికే 109 రూట్లలో ప్రైవేట్ రైళ్లను అనుమతించారు. తొలి ప్రైవేట్ రైళ్లు పరుగులు తీయడం ప్రారంభించాయి. 2027 నాటికి భారతీయ రైల్వేలో 151 ప్రైవేట్ రైళ్లు నడుస్తాయి. స్టేషన్ల ఆధునీకరణ పేరుతో ప్రైవేటీకరణ కూడా అమలు చేస్తున్నారు. విమానాశ్రయాల తరహాలో రైల్వే స్టేషన్లలోనూ యూజర్ చార్జీలను ప్రవేశపెట్టేందుకు మోడీ ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నిస్తోంది. స్టేషన్లను ప్రైవేట్ సంస్థలకు అప్పగించే ఎత్తుగడ కూడా ఉంది. సామాన్యులకు ఆధారమైన రైల్వేలు మెల్లగా ధనికుల విలాసవంతమైన ప్రయాణాలకు వేదికగా మారుతున్నాయి. పోస్టులను భర్తీ చేయకుండా, భద్రతా లోపాలను సరిచేయకుండా...నిర్వహించే వందేభారత్ వేడుకలు... మరిన్ని రైల్వే విపత్తులకు దారి తీస్తాయి.

/'దేశాభిమాని' సౌజన్యంతో/

జనవాక్యం

పి.ఎస్ ఆదేశాలకే దిక్కు లేదు

ప్రకాశం జిల్లా (ప్రస్తుతం నెల్లూరు జిల్లా) గుడ్లూరు మండలం చేవూరు సాగుచెరువు భూమిని రామదూత అని ఒక దొంగస్వామి ఆక్రమించి, ఆశ్రమం పేరుతో రకరకాలుగా మోసం చేస్తున్నాడు. పిల్లలు లేనివారికి పిల్లలు పుట్టిస్తాను, దీర్ఘ రోగాలు నయం చేస్తాను-అంటూ యజ్ఞాలు యాగాలు చేస్తూ వచ్చినంత దండుకునేవాడు. ఒకసారి ఈయన యాగం చేస్తుంటే, దూరాన వర్షం పడుతుంటే మీరు ఇబ్బంది పడతారని నా మహిమతో ఇక్కడ వర్షం పడకుండా చేశానని భక్తులతో చెప్పుకున్నాడు. 2011లో ఈ ఆశ్రమానికి అప్పటి కర్ణాటక ముఖ్యమంత్రి ఎడియూరప్ప, మంత్రి గాలి జనార్ధనరెడ్డి వచ్చారు. తరువాత ఇద్దరికీ మంత్రి పదవులు పోయాయి, ఇద్దరూ జైలుకి వెళ్లారు. అప్పటి బిజెపి జాతీయాధ్యక్షుడు బంగారు లక్ష్మణ్ కూడా వచ్చారు. తరువాత ఆయనకు ఒక కేసులో సుప్రీం కోర్టు సంవత్సరం శిక్ష వేసింది. తరువాత చనిపోయారు. అప్పటి డీజీపీ ఏదో రెండు మూడుసార్లు ఇక్కడికి వచ్చారు. తరువాత సుప్రీంకోర్టు ఈయన పుట్టిన తేదీ విషయంలో చీవాట్లు పెట్టగా, ఈ బాబాను కాదని, హైదరాబాద్‌లో ఇంకొక బాబాని వెతుక్కున్నాడని అప్పటి పత్రికలు రాశాయి. ఈ బాబా భూ ఆక్రమణ గురించి 20 సంవత్సరాలకు పైగా హేతువాద సంఘం ఎన్నోసార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా, అధికారులు ఆశ్రమంవారితో కుమ్మక్కై కోట్ల రూపాయల విలువగలిగిన భూమిని దొంగస్వామికి ధారాదత్తం చెయ్యాలని చూశారు. ఈ విషయమై పది సంవత్సరాల కిందట లోకాయుక్తలో ఫిర్యాదు చెయ్యగా, తప్పనిసరి పరిస్థితుల్లో ప్రిన్సిపల్ సెక్రటరీ రెవిన్యూ ఉషారాణి గారు దొంగస్వామి ఆక్రమించిన భూమిని స్వాధీనం చేసుకోవాలని నాడు ఆదేశించారు. ఇంతవరకు అతీగతి లేదు. ఈ విషయమై రెవిన్యూ మంత్రికి ఫిర్యాదు చేసి, ఫోన్ చేయటం జరిగింది. పరిశీలిస్తానన్నారు. అంతే!! మీ ఆదేశాలు మీ కింది అధికారులు అమలు జరపలేదు, చర్యలు తీసుకోమని ప్రిన్సిపల్ సెక్రటరీకి రాసినా ఫలితం శూన్యం. ముఖ్యమంత్రి కార్యాలయానికి రాసినా ఫలితం లేదు. అధికారులలో కదలిక కరువైంది. ఎంత దుర్మార్గం? చివరిగా లోకాయుక్తను కోరాం. వాయిదాలు వేస్తున్నారు. ఇదీ పరిస్థితి. ఎంతో కష్టపడి పోరాడి ఇంతవరకు తీసుకొచ్చినా ఫలితం లేకుండా పోతున్నది.

- నార్నె వెంకట సుబ్బయ్య,
అధ్యక్షుడు, ఎ.పి హేతువాద సంఘం.

72 ఎర్రచందనం దుంగలు స్వాధీనం

ప్రజాశక్తి-తిరుపతి (మంగళం)

అక్రమంగా తరలిస్తున్న ఎర్రచందనం దుంగలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఐదుగురు స్మగ్లర్లను అరెస్టు చేశారు. ఈ వివరాలను డిఎస్‌పి యశ్వంత్ తిరుపతి జిల్లా చంద్రగిరి పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. యర్రావారిపాలెం మండలం, బోడేవాండ్లపల్లి గ్రామ సమీపంలో సాయికాడగుట్ట వద్ద గల ఆంజనేయ స్వామి గుడి దగ్గర అనుమానాస్పదంగా ఉన్న వాహనాలను, వ్యక్తులను పోలీసులు గుర్తించి, వారిని చుట్టుముట్టారు. వారి వద్ద ఉన్న 72 ఎర్రచందనం కొయ్యల చెక్కలు, నాలుగు మూటల దుంగల పీసులు, తొమ్మిది మూటల చెక్కల పొడిని స్వాధీనం చేసుకున్నారు. బహిరంగ మార్కెటులో వీటి విలువ రూ.85 లక్షలు ఉంటుందన్నారు. తమిళనాడు మన్నాడి ప్రాంతానికి చెందిన మహమ్మద్ రసూల్, జవహర్ నగర్‌కు చెందిన కార్తిక్, పల్లిపట్టుకు చెందిన మరియ భాస్కరన్, ఆంధ్రప్రదేశ్ అన్నమయ్య జిల్లాకు చెందిన తిరుమలశెట్టి నాగరాజా, అమరేంద్రరాజును అరెస్టు చేశారు. స్మగ్లింగ్ వెనుక ఉన్న ఢిల్లీ సూత్రధారులను త్వరలో అరెస్టు చేస్తామని డిఎస్‌పి తెలిపారు.

6 వికెట్ల తేడాతో విజయనగరం రాయల్స్ జట్టు విజయం

ప్రజాశక్తి- విజయనగరం టౌన్

స్థానిక చింతలవలస పివిజి రాజు క్రికెట్ మైదానంలో మంగళవారం జరిగిన ఎసిఎ ఉమెన్స్ టి-20 లీగ్ టోర్నమెంట్ లో విజయవాడ బ్లైజేర్స్‌తో జరిగిన మ్యాచ్ లో 6వికెట్ల తేడాతో విజయనగరం రాయల్స్ జట్టు విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన విజయవాడ బ్లైజేర్స్ జట్టు 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 124 పరుగులు చేసింది. బ్లైజేర్స్ జట్టులో హేమ 23, ప్రసన్న 21 పరుగులు చేసి టాప్ స్కోరర్లుగా నిలిచారు. అనంతరం బ్యాటింగ్ చేసిన విజయనగరం రాయల్స్ జట్టు 19.5 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 125 పరుగులు సాధించి విజయాన్ని సొంతం చేసుకున్నారు. రాయల్స్ బ్యాటింగ్‌లో పద్మజ 46 పరుగులు, హమ్రిత్ 41 పరుగులు చేసి విజయంలో కీలక పాత్ర పోషించారు. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ పద్మజకు దక్కింది.

జాతీయ తైక్వాండో పోటీలకు ఇద్దరు ఎంపిక

ప్రజాశక్తి- విజయనగరం టౌన్

ఈ నెల 8 నుండి 11వ తేదీ వరకు ఉత్తరాఖండ్ రాష్ట్రం డెహ్రాడూన్‌లో జరగబోయే 38వ సీనియర్ జాతీయ టైక్వాండో పోటీలకు జిల్లాకు చెందిన ఇద్దరు క్రీడాకారులు మన రాష్ట్రం తరుపున ఎంపికయ్యారు. వారిలో ఎం.గగన్ సాగర్‌దొర, వై.భార్గవి ఉన్నారు. వీరికి జిల్లా తైక్వాండో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గురాన అయ్యలు, సిహెచ్ వేణుగోపాలరావు, ఒలింపిక్ అసోసియేషన్ సభ్యులు వీరికి అభినందనలు తెలిపారు

'పోలవరం' ఎత్తును తగ్గించేలా కేంద్రం కుట్ర

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పోలవరం ప్రాజెక్టు ఎత్తును తగ్గించేందుకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కుట్రలు చేస్తోందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ విమర్శించారు. జాతీయ పోలవరం ప్రాజెక్టు నిర్మాణంపై కేంద్ర ప్రభుత్వం విరుద్ధ ప్రకటనలు చేస్తోందని, దీనిపై రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు రామకృష్ణ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పోలవరం నిర్మాణానికి అవసరమైన నిధులను కేంద్రం కేటాయించకుండా, పూర్తిగా నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తోందన్నారు. ప్రాజెక్టు నిర్వాసితులకు పునరావాస ప్యాకేజీపై కేంద్రం గానీ, రాష్ట్రం గానీ మాట్లాడకపోవడం సరైందికాదన్నారు. నిర్వాసితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. పోలవరంపై కేంద్ర ప్రభుత్వ కుట్రలను తిప్పికొట్టాలని కోరారు. రాష్ట్రాభివృద్ధికి నిధులు రాబట్టడంలో జగన్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు.

72.22 క్వింటాళ్ల గంజాయి స్వాధీనం

- **ఎస్ఇబి కమిషనరు రవిప్రకాష్**

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా గత మే నెలలో 72.22 క్వింటాళ్ల గంజాయిని స్వాధీనం చేసుకుని 92 వాహనాలను సీజ్ చేశామని సెబ్ కమిషనరు ఎం రవిప్రకాష్ తెలిపారు. మొత్తం 169 కేసుల్లో 710 మందిని అరెస్టు చేశామని ఎస్ఇబి కమిషనరు రవిప్రకాష్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఆధ్వర్యాన నిర్వహించిన దాడుల్లో గంజాయితోపాటు మాదక ద్రవ్యాలు, నాటుసారా, అక్రమ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఇందుకు సంబంధించి ఐదుగురిని అరెస్టు చేశామన్నారు. సారా కేసుల్లో 1,274 మందిని అరెస్టు చేసి, 13,828 లీటర్ల సారాను, 1,198 కేజీల బెల్లాన్ని సీజ్ చేశామన్నారు. 11,353 లీటర్ల మద్యం, 1,664 లీటర్ల బీర్‌ను స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు.

తానా మహాసభలకు ప్రత్యేక అతిథిగా బాలకోటయ్య

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో అమరావతి రాజధాని ఉద్యమంలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్న అమరావతి బహుజన ఐకాస అధ్యక్షులు పోతుల బాలకోటయ్యకు అమెరికాలో నిర్వహించే తానా 23వ మహాసభలకు ప్రత్యేక ఆహ్వానితునిగా ఆహ్వానించారు. ఈ మేరకు తెలుగు అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా (తానా) మహాసభల నిర్వాహక అధ్యక్షులు అంజయ్య చౌదరి, కో-ఆర్డినేటర్ రవి పొట్లూరి ఆహ్వాన లేఖను పంపారు. జూలై 7 నుంచి 9 వరకు అమెరికాలోని ఫిలెడెల్ఫియాలో జరిగే ఈ సమావేశానికి ఒక దళితుడిని ఆహ్వానించడం పట్ల బాలకోటయ్య హర్షం వ్యక్తం చేశారు.

కుక్క మాంసంపై నిషేధం ఎత్తివేత

గౌహతి హైకోర్టు తీర్పు

గౌహతి : కుక్క మాంసంపై నాగాలాండ్ ప్రభుత్వం విధించిన నిషేధాన్ని గౌహతి హైకోర్టులోని కొహిమా బెంచ్ తాజాగా ఎత్తివేసింది. మార్కెట్లలో కుక్క మాంసం అమ్మడం, వాణిజ్యపరంగా ఎగుమతి, దిగుమతి చేయడాన్ని నాగాలాండ్ ప్రభుత్వం మూడేళ్ల కిందట నిషేధం విధించింది. దీనిని సవాల్ చేస్తూ ముగ్గురు కుక్క మాంసం వ్యాపారులు హైకోర్టును ఆశ్రయించారు. నిషేధాన్ని కొట్టివేస్తూ ఈ నెల 2న హైకోర్టు తీర్పు ఇచ్చింది. నేటి ఆధునిక కాలంలోనూ నాగాలకు కుక్క మాంసం తినడం ఆమోద యోగ్యమైన ఆహారంగానే ఉందని కోర్టు పేర్కొంది.

డెకథ్లాన్‌లో సునీల్‌కు స్వర్ణం

ఆసియా అండర్-20 అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్



యోచియెన్(దక్షిణ కొరియా): ఆసియా అండర్-20 అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ పోటీల్లో డెకథ్లాన్ విభాగంలో సునీల్ కుమార్ స్వర్ణ పతకం కైవసం చేసుకున్నాడు. మంగళవారం జరిగిన డెకథ్లాన్‌లో సునీల్ కుమార్ 7003పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచి స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకున్నాడు. ఇక మహిళల హైజంప్‌లో 1.82మీటర్లు జంప్ చేసి పూజ రజిత పతకం సాధించింది. మహిళల 3వేల మీ. రేస్, 4×100మీ. రిలేలో బుస్రా ఖాన్ 45.36సెకన్లలో గమ్యానికి చేరి కాంస్య పతకం కైవసం చేసుకున్నాడు. పురుషుల షాట్‌పుట్‌లో సిద్ధార్థ్ చౌదరి 19.52మీ. విసిరి స్వర్ణ పతకం కైవసం చేసుకోగా.. జావెలిన్ త్రోలో శివమ్ లోహకరే 72.34మీ. విసిరి రజితం, పురుషుల 3వేల మీ. స్టీపుల్ ఛేజ్‌లో 8నిమిషాల 51.74సెకన్లలో గమ్యానికి షారుక్ ఖాన్ రజిత పతకం సాధించారు. దీంతో భారత్ ఓవరాల్‌గా 12పతకాలతో 3వ స్థానంలో కొనసాగుతోంది. భారత్ మూడేసి స్వర్ణ, రజిత, కాంస్య పతకాలతో మూడో స్థానంలో ఉంది.

గుకేశ్‌కు మూడోస్థానం

నార్వే చెస్ టోర్నీ

ఓస్లో(నార్వే): ఫిడే నార్వే చెస్ టోర్నమెంట్‌లో యువ గ్రాండ్ మాస్టర్ జి. గుకేశ్ అద్భుత ప్రదర్శనతో అదరగొట్టాడు. సోమవారం 6వ రౌండ్‌లో అనిశ్ గిరితో తలపడిన గుకేశ్.. క్లాసిఫికేషన్ ఫార్మాట్‌లో 58 ఎత్తుల అనంతరం ఆ గేమ్‌ను డ్రాగా ముగించిన గుకేశ్.. ఆర్మెజెడాన్‌లో 48ఎత్తుల తర్వాత ఆ గేమ్‌ను డ్రాగా ముగించాడు. అనంతరం గుకేశ్ మాట్లాడుతూ.. 'తనకన్నా బలమైన ప్రత్యర్థితో గేమ్‌ను డ్రాగా ముగించినందుకు సంతోషంగా ఉందని, అద్భుత ఆటతీరుతో రాణిస్తుండడంతో ఫలితం వచ్చే అవకాశముందని' తెలిపాడు. దీంతో 6వ రౌండ్ ముగిసిన అనంతరం గుకేశ్ కరువానా, హికారు నకమురా, అలీరెజా ఫిరౌజ్జాలతో కలిసి సంయుక్తంగా 3వ స్థానంలో కొనసాగుతున్నాడు.

కాంట్రాక్టు ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేయాలి

• ఎవి నాగేశ్వరరావు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

2014 జూన్ నాటికి ఐదేళ్లు పూర్తి చేసుకున్న కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడాన్ని కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, టీచర్ల జెఎసి, ఎపిస్టేట్ గవర్నమెంట్ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల ఫెడరేషన్‌లు స్వాగతిస్తున్నాయని ఫెడరేషన్ గౌరవాధ్యక్షులు ఎవి నాగేశ్వరరావు, సెక్రటరీ జనరల్ ఎం బాలకాశి, కో చైర్మన్ ఇ విజయ్‌కుమార్‌రాజు, సెక్రటరీ నూర్‌మహ్మద్ పేర్కొన్నారు. రెగ్యులరైజేషన్‌కు కటాఫ్ డేట్‌ను 2014కు బదులు 2022 డిసెంబరు 31 నాటి వరకు పరిగణించడం వల్ల ఎక్కువ మంది రెగ్యులరైజ్ అయ్యే అవకాశం ఉంటుందని, ప్రభుతం ఆ దిశగా ఆలోచించాలని వారు సూచించారు. 25.11.1993కు ముందు నుంచి పనిచేస్తున్న టైమ్‌స్కేలు, డైలీ వేజ్, కంటింజెంట్ క్యాడర్ల ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని ఐదేళ్లు కాంట్రాక్టు సర్వీస్ పూర్తి చేసుకున్న వెంటనే రెగ్యులర్ అయ్యేలా చర్యలు చేపట్టాలని, రెగ్యులరేజేషన్‌లోగా రిటైర్మెంటు అవుతున్న ఉద్యోగులకు పెన్షన్, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు కార్మికులతోపాటు ఔట్‌సోర్సింగ్ కార్మికులను కూడా పర్మినెంట్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు కె నాగభూషణం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు.

అది సిబిఐ పని కాదు

• ప్రజల దృష్టి మరల్చే చర్య
• కేంద్రం తీరుపై తలెత్తుతున్న అనుమానాలు

న్యూఢిల్లీ : ఒడిశా రైలు ప్రమాద ఘటనపై సిబిఐ దర్యాప్తు అంశం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. రైలు ప్రమాదాల విషయాల్లో సిబిఐ దర్యాప్తు చేయదని, ప్రజల దృష్టిని మళ్లించే చర్యగా దీనిని రాజకీయ విశ్లేషకులు అభివర్ణిస్తున్నారు. దర్యాప్తు పేరుతో ఈ అంశాన్ని సాగదీసి చేతులు దులుపుకునే చర్యకు మోడీ సర్కారు దిగిందని ఆరోపిస్తున్నారు. దీంతో రైలు ప్రమాద ఘటనపై సిబిఐని రంగంలోకి దింపటంపై అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కేంద్రం తీరును ఇటు నిపుణులూ తప్పుబడుతున్నారు. సాంకేతిక, సంస్థాగత, రాజకీయ వైఫల్యాలకు సిబిఐ సహా చట్టాన్ని అమలు చేసే సంస్థలు జవాబుదారీగా ఉండవని అన్నారు. నేరాలను దర్యాప్తు చేయడానికే సిబిఐ ఉద్దేశించబడిందనీ, రైల్వే ప్రమాదాల కోసం కాదని చెప్తున్నారు. ముఖ్యంగా, సిబిఐ, చట్టాన్ని అమలు చేసే ఇతర ఏదైనా ఏజెన్సీలకు రైల్వే భద్రత, సిగ్నలింగ్, నిర్వహణ పద్ధతులలో సాంకేతిక నైపుణ్యం ఉండదని తెలిపారు.

2016 ఘటనను గుర్తు చేస్తున్నది
మోడీకి కాంగ్రెస్ చీఫ్ ఖర్గే లేఖ

ప్రతిపక్షాల నుంచి సిబిఐ దర్యాప్తుపై వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఈ విషయంపై కాంగ్రెస్ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే ప్రధాని మోడీకి నాలుగు పేజీల లేఖను రాశారు. రైల్వే ప్రమాదాలపై దర్యాప్తు జరపడానికి సిబిఐకి యోగ్యత ఉండదని కాంగ్రెస్ వాదిస్తున్నది. ఒడిశాలో జరిగిన ఘోర రైలు ప్రమాదం దేశాన్ని దిగ్భ్రాంతికి గురి చేసిందని ఖర్గే తన లేఖలో పేర్కొన్నారు. "ప్రమాదానికి గల మూల కారణాన్ని కనుగొన్నామని చెప్పిన కేంద్ర రైల్వే మంత్రి.. సిబిఐ దర్యాప్తును కోరారు. 2016లో కాన్పూర్‌లో రైలు పట్టాలు తప్పిన ఘటనలో 150 మంది మృతి చెందటంపై విచారణ జరపాలని అప్పటి రైల్వే మంత్రి జాతీయ దర్యాప్తు సంస్థను కోరారు" అని ఖర్గే గుర్తు చేశారు. 2018లో ఎన్ఐఎ విచారణను ముగించిందనీ, ఛార్జిషీట్‌ను దాఖలు చేసేందుకు నిరాకరించిందని పేర్కొన్నారు. 150 మంది మరణాలకు ఎవరు బాధ్యత వహిస్తారు అని ఖర్గే ప్రశ్నించారు. ప్రస్తుత సిబిఐ దర్యాప్తు అనేది 2016 విషయాన్ని గుర్తు చేస్తున్నదని పేర్కొన్నారు. వ్యవస్థాగత భద్రతా లోపాన్ని పరిష్కరించే ఉద్దేశం ఈ ప్రభుత్వానికి లేదనీ, జవాబుదారీ నుండి తప్పించుకునేందుకే ఇటువంటి ఎత్తులు వేస్తున్నట్టుగా ఉందని అన్నారు. రైల్వేలో దాదాపు 3 లక్షల పోస్టులు ఖాళీగా ఉన్నాయని విమర్శించారు.

సిబిఐ విచారణ సరికాదు : మమత

ఒడిశాలో ఘోర రైలు ప్రమాద ఘటనపై సిబిఐ విచారణను పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తప్పుబట్టారు. ప్రమాదాన్ని ప్రమాదంగానే చూడాలనీ, అయితే కేంద్రం దీనిని కూడా తమ స్వార్థ ప్రయోజనాల కోసం వాడుకోవాలని చూస్తున్నదన్నారు. ఈ విషయంలో సిబిఐ ఎంక్వైరీతో ఎలాంటి ఫలితమూ ఉండదని చెప్పారు. జ్ఞానేశ్వరి ఎక్స్‌ప్రెస్ ప్రమాద ఘటన కేసును 12 ఏళ్ల క్రితం తాను సిబిఐకి అప్పగించాననీ, ఎలాంటి ఫలితం లేదని తెలిపారు. అలాగే, సైంతియా కేసునూ సిబిఐకి అప్పగించినా.. దానిది కూడా అదే దారి అని చెప్పారు. సిబిఐ క్రిమినల్ కేసులను దర్యాప్తు చేస్తుందనీ, అయితే ఒడిశా ఘటన ఒక ప్రమాద కేసు అని మమత అన్నారు. ప్రమాద ఘటన వెనుక గల కారణం ప్రజలకు తెలియాలని అన్నారు.

ప్రాథమిక నిర్ధారణలతో విభేదిస్తున్న విచారణాధికారి

రైలు ప్రమాదానికి దారి తీసిన పరిస్థితులపై ప్రాథమికంగా దర్యాప్తు నిర్వహించిన ఐదుగురు సభ్యుల విచారణా కమిటీ సభ్యుడైన సీనియర్ రైల్వే అధికారి ప్రాథమికంగా కనుగొన్న కొన్ని అంశాలపై విభేదించారు. ప్రమాద స్థలిలో అక్కడికక్కడే విచారణ జరిపిన ఈ బృందం రెండు పేజీల నివేదికను అందజేసింది. సిగ్నలింగ్ తప్పిదమే ఈ ప్రమాదానికి కారణమని నిర్ధారించింది. ఈ బృంద సభ్యుడైన సీనియర్ సెక్షన్ ఇంజనీర్ ఎ.కె.మహంతా ఈ నిర్ధారణలోని కొన్ని అంశాలతో విభేదించారని, దానిపై తన అభిప్రాయాన్ని నమోదు చేశారని రైల్వే వర్గాలు తెలిపాయి. మెయిన్ లైన్‌లోకి వెళ్లేందుకు కోరమాండల్‌కి సిగ్నల్ వచ్చినా అది లూప్‌లైన్‌లోకి వెళ్లిందని బృందం నిర్ధారించింది. అయితే పాయింట్ (17ఎ) లూప్‌లైన్‌కు సెట్ చేయబడింది అన్న నిర్ధారణను సీనియర్ అధికారి మహంతా అంగీకరించడం లేదు. "డేటా లాగర్ నివేదికలోని వ్యాఖ్యలను ఆధారంగా చేసుకుంటే ఆ పాయింట్ మెయిన్ లైన్‌కు సెట్ చేయబడింది. పట్టాలు తప్పిన తర్వాత ఇది రిజర్వ్ కావచ్చు." అని ఆయన చెప్పారు. పైగా లెవల్ క్రాసింగ్ గేట్ నెం.94కు ముందుగానే పట్టాలు తప్పింది. ఈ లెవల్ క్రాసింగ్ పాయింట్ 17(ఎ)కి ముందుగానే వుంది. తద్వారా లూప్‌లైన్‌లోకి వెళ్లడానికి ముందుగానే ప్రమాదం జరిగినట్లు వాదించాల్సివుందని చెప్పారు. ఈ మేరకు ఆయన తన అసమ్మతి నోట్‌ను అదే రోజున అంటే 3వ తేదీనే ఖరగ్‌పూర్ సెక్షన్ కంట్రోలర్‌కు అందజేశారు.

గెలాక్సీ ఎఫ్54 5జి ఆవిష్కరణ

గూర్‌గావ్ : ప్రముఖ ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల కంపెనీ సామ్‌సంగ్ కొత్తగా తన గెలాక్సీ సీరిస్‌లో ఎఫ్54 5జిని విడుదల చేసింది. 108 ఎంపి కెమెరా, రెండు రోజుల బ్యాటరీ లైఫ్, సాఫ్ట్‌వేర్ పొడిగింపు మద్దతుతో దీన్ని అందుబాటులోకి తెచ్చినట్లు పేర్కొంది. 6.7 అంగుళాల డిస్‌ప్లే కలిగిన ఈ ఫోన్ ధరను రూ.29,999గా నిర్ణయించింది. 8జిబి ర్యామ్, 256 జిబి స్టోరేజీ, 6000 ఎంఎహెచ్ బ్యాటరీ, 25వాట్ ఛార్జింగ్ తదితర ఫీచర్లను కలిగి ఉంది.

అట్టహాసంగా 'ఆదిపురుష' ప్రీ రిలీజ్ వేడుకలు

• 16న థియేటర్లలో విడుదల
• సినిమాను ఆదరించాలి : చిన్నజీయర్‌స్వామి



ప్రజాశక్తి - తిరుపతి సిటి

ప్రభాస్ హీరోగా నటించిన 'ఆదిపురుష్' సినిమా ప్రీ రిలీజ్ వేడుక తిరుపతి శ్రీ వెంకటేశ్వర స్టేడియంలో మంగళవారం అట్టహాసంగా అబ్బురపరిచేలా సాగింది. ఈ నెల 16న ఈ సినిమా విడుదల కానుంది. సీతారాముల సన్నివేశాన్ని, వంతెనపై వానర మూకలతో రాముని పయనం తదితర ఘట్టాల క్లిప్పింగ్‌లను అభిమానులకు చూపించారు. ప్రతి షోలోనూ 'హనుమంతుని' కోసం ఓ సీటు వదలనున్నట్లు దర్శక, నిర్మాతలు ప్రకటించారు. యాంకర్లుగా ఝూన్సీ, ప్రదీప్ వ్యవహరించి అలరించారు. టిటిడి చైర్మన్ వైవి సుబ్బారెడ్డి స్వాగతోపన్యాసం చేశారు. అనంతరం ముఖ్య అతిథి చిన్నజీయర్‌స్వామి మాట్లాడుతూ రామాయణంలో అరణ్యకాండ, యుద్ధకాండల్లో ఉన్న కథను చరిత్రగా లోకానికి అందించాలన్న తపనతో ఈ సినిమా చేశారన్నారు. ఆదిపురుష్ సినిమా బృందం మొత్తానికి తమ ఆశీస్సులు ఉంటాయన్నారు. ఈ సినిమా అందరూ ఆదరించాలని కోరారు.

తెలుగు, హిందీ భాషల్లో ఫైనల్ ట్రేలర్


స్టేజిపై టెక్నాలజీతో ఏర్పాటు చేసిన వారధిపై నడుస్తూ వచ్చి ప్రభాస్ అభిమానులకు అభివాదం తెలిపారు. ధనస్సును ఎత్తి అభిమానుల్లో ఉత్సాహాన్ని నింపారు. 'ఆదిపురుష్' ఫైనల్ ట్రేలర్ ఫ్యాన్స్‌కు అందించారు. రావణాసురుడు జానకిని అపహరించుకెళ్లే ఘట్టాలను చూపించారు. 'నా ఆగమనం అధర్మ విధ్వంసం.. కానీ ఈ రోజు నా కోసం పోరాడొద్దు.. భరతదేశంలో పరస్త్రీపై చేయి వేసేవారి దుష్టులకు మీ పరాక్రమం గుర్తొచ్చి వెన్నులో వణుకు పుట్టాలి.. పోరాడతారా..' అన్న ప్రభాస్ మాటలు 'అలరించాయి. తెలుగు, హిందీ భాషల్లో అభిమానులకు వినిపించారు.

ఆదిపురుష్ సినిమా కాదు...నా అదృష్టం..: ప్రభాస్

ఆదిపురుష్ సినిమా కాదని, అదృష్టం అని సినీహీరో ప్రభాస్ అన్నారు. 'ట్రైలర్ ఎలా ఉంది?' అని అభిమానులను అడిగి తెలుసుకున్నారు. 'రామాయణం చేస్తున్నావా?' అని చిరంజీవి తనను అడిగారని, ఆ అదృష్టం నీకు దొరికిందని అన్నారని తెలిపారు. 'పెళ్లెప్పుడు' అని అభిమానులు అడిగినప్పుడు 'తిరుపతిలో చేసుకుంటాను' అని నవ్వుతూ ప్రభాస్ సమాధానమిచ్చారు. జానకి ఎక్స్‌ప్రెషన్ బాగుందని, హనుమంతుడుతో చేసినప్పుడు ఎమోషన్‌గా ఫీలయ్యానని తెలిపారు. ఏడాదికి రెండు సినిమాలు చేస్తానని, మూడు చేయడానికి ప్రయత్నిస్తానని తెలిపారు. స్టేజిపై తక్కువ మాట్లాడి ఎక్కువ సినిమాలు చేస్తానన్నారు. హీరోషిన్, సీత పాత్రధారి కృతిసనన్ దర్శకులు ఓంరావత్ పాల్గొన్నారు.

రోజుకో సర్వీస్ సెంటర్ తెరుస్తాం

మారుతి సుజుకి వెల్లడి
దేశంలో 4500 టచ్ పాయింట్లకు విస్తరణ



హైదరాబాద్ / న్యూఢిల్లీ : దేశంలోనే అతిపెద్ద కార్ల తయారీ కంపెనీ మారుతి సుజుకి దేశ వ్యాప్తంగా 2,271 పట్టణాల్లో 4500 సర్వీస్ టచ్ పాయింట్లకు విస్తరించినట్లు ప్రకటించింది. హైదరాబాద్‌లోని రాంపల్లిలోలో నూతన నెక్సా సర్వీస్ సెంటర్ తెరవడం ద్వారా ఈ మైలురాయిని చేరుకున్నామని ఆ కంపెనీ సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సర్వీస్) పార్థో బెనర్జీ వెల్లడించారు. మంగళవారం నగరంలో సీనియర్ ఎగ్జిక్యూటివ్ (సర్వీస్) యసుహిరో కవయితో కలిసి బెనర్జీ మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో 326 టచ్ పాయింట్లు ఉన్నాయని తెలిపారు. 2022-23లో కొత్తగా 310 సర్వీసు పాయింట్లను ప్రారంభించామన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో దాదాపు 350 తెరువాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. నగరాల్లో ప్రతీ 10-15 కిలోమీటర్లకు, గ్రామీణ ప్రాంతాల్లో ప్రతీ 25 కిలోమీటర్ల పరిధిలో ఓ సర్వీస్ సెంటర్ అవసరం ఉందన్నారు.

బజాజ్ ఫైనాన్స్‌తో మారుతి జట్టు

బజాజ్ ఫైనాన్స్‌తో మారుతి సుజుకి కీలక ఒప్పందం కుదుర్చుకున్నట్లు ప్రకటించింది. ఈ భాగస్వామ్యంలో భాగంగా సులభంగా మారుతి వినియోగదారుల ఆటో రిటైల్ ఫైనాన్సింగ్ పరిష్కారాలు లభించనున్నాయని తెలిపింది. కార్లను సొంతం చేసుకోవాలనే ఫైనాన్సింగ్ ప్రక్రియ సులభతరం కానుందని పేర్కొంది. ఈ ఒప్పందంలో బజాజ్ ఫిన్‌సర్వ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనుప్ సహా, మారుతి సుజుకి మార్కెటింగ్ అండ్ సేల్స్ ఇండియా సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శశాంక్ శ్రీవాస్తవా పాల్గొన్నారు.

అరుణాచల్-అస్సాం సరిహద్దుల్లో కాల్పులు

ఇద్దరు మృతి

ఇటానగర్ : అరుణాచల్‌ప్రదేశ్‌లోని లోయర్ సైయాంగ్ జిల్లాలో సోమవారం చోటు చేసుకున్న కాల్పుల ఘటన కేసులో ఐదుగుర్ని మంగళవారం అరెస్టు చేశారు. అస్సాం సరిహద్దుకు సమీపంలో జరిగిన కాల్పుల్లో ఇద్దరు వ్యక్తులు మరణించినట్లు పోలీసులు చెప్పారు. నిందితుల్ని అరెస్టు చేసి లికాబాలి పోలీస్ స్టేషన్‌లో ఉంచినట్లు చెప్పారు. సోమవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ధేమాజీ గ్రామానికి చెందిన ప్రజలు అంతర్ రాష్ట్ర సరిహద్దు ప్రాంతంలో మొక్కలు నాటే కార్యక్రమం ఏర్పాటు చేశారు. అక్కడే ఈ కాల్పుల ఘటన జరిగినట్లు పోలీసులు చెప్పారు. అరుణాచల్ ప్రదేశ్, అస్సాం మధ్య కొన్నేళ్లుగా సరిహద్దు సమస్యలు కొనసాగుతున్నాయి. 1987లో అస్సాం నుంచి కొన్ని భూభాగాలను అరుణాచల్‌ప్రదేశ్‌లో కలపాలని ప్రతిపాదన చేశారు. ఈ ప్రతిపాదనను అస్సాం వ్యతిరేకిస్తోంది. ఈ కేసు ప్రస్తుతం సుప్రీంకోర్టులో విచారణలో ఉంది.

ఒడిశా రైలు ప్రమాదంలో 40 మంది కరెంట్ షాక్‌తో మృతి..

భువనేశ్వర్: ఒడిశాలో జరిగిన రైలు ప్రమాదంలో రెస్క్యూ ఆపరేషన్ అనంతరం పలు విషయాలు బహిర్గతం అవుతున్నాయి. బాలాసోర్ వద్ద జరిగిన రైలు ప్రమాదంలో ఇప్పటి వరకూ 278 మంది మరణించగా, 1,100 మందికిపైగా గాయపడిన విషయం తెలిసిందే. ప్రమాదంలో మరణించిన వారిలో సుమారు 40 మంది వరకు విద్యుత్ షాక్‌తో మరణించినట్టు రెస్క్యూ ఆపరేషన్‌ను పర్యవేక్షించిన పోలీసు అధికారి ఒకరు వెల్లడించారు. కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ బోగీల్లో చిక్కుకున్న కనీసం 40 మృతదేహాలను వెలికితీయగా.. వాటిపై ఎటువంటి గాయాలు లేవని గుర్తించిన అధికారులు వారు విద్యుదాఘాతానికి గురై ఉంటారని భావిస్తున్నారు. తెగిపడిన ఓవర్ హెడ్ కేబుల్స్ ద్వారా షాక్‌కు గురై ఉంటారని .. లైవ్ ఓవర్‌హెడ్ కేబుల్స్ బోగీలపై పడటంతో వారి మరణాలకు విద్యుదాఘాతమే కారణమని ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు. ఓవర్ హెడ్ ఎల్టీ (తక్కువ తీవ్రత) లైన్‌తో తాకిడి.. తర్వాత విద్యుదాఘాతం కారణంగా చాలామంది ప్రయాణికులు గాయపడ్డారని గవర్నమెంట్ రైల్వే పోలీస్ (జిఆర్‌పి) సబ్-ఇన్‌స్పెక్టర్ పాపు కుమార్ నాయక్ ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. యశ్వంత్‌పూర్ (బెంగళూరు)-హౌరా ఎక్స్‌ప్రెస్ పట్టాలు తప్పిన కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ బోగీలపైకి దూసుకెళ్లడంతో కేబుల్స్ తెగిపోయాయి. చాలా వరకూ మతదేహాలు గుర్తుపట్టలేనంతగా మారిపోయాయి.. అందులో సుమారు 40 మృతదేహాలపై ఎటువంటి గాయాల గుర్తులు, రక్తస్రావం అయినట్టు కనిపించలేదని .. వారి మరణానికి విద్యాదాఘాతం కారణం కావచ్చని పోలీస్ అధికారి వ్యాఖ్యానించారు. ఈస్ట్ కోస్ట్ రైల్వే చీఫ్ ఆపరేషన్స్ మేనేజర్ పూర్ణ చంద్ర మిశ్రా మాట్లాడుతూ.. ఓవర్‌హెడ్ ఎలక్ట్రిక్ కేబుల్స్ రైలుపై పడి బోగీలలోని కొంత భాగాన్ని సెకనులో తాకే అవకాశం ఉందని, దీంతో విద్యుదాఘాతానికి గురై ఉంటారని చెప్పారు.

ప్రజలకు సురక్షిత మంచినీరు

కేంద్ర కార్యదర్శి విని మహాజన్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

దేశ వ్యాప్తంగా 'జల్‌జీవన్ మిషన్' కింద ప్రతి ఇంటికీ సురక్షిత మంచినీరు అందేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర తాగునీరు, శానిటేషన్‌శాఖ కార్యదర్శి విని మహాజన్ సూచించారు. సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్‌రెడ్డితో కలిసి, జల్‌జీవన్ మిషన్, స్వచ్ఛ భారత్ మిషన్ కార్యక్రమాలపై రాష్ట్ర స్థాయి అధికారులు, జిల్లా కలెక్టర్లతో మంగళవారం వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా వివి మహాజన్ మాట్లాడుతూ.. ప్రతి ఇంటికీ సురక్షిత తాగునీటిని అందించే లక్ష్యంతో చేపట్టిన జల్‌జీవన్ మిషన్ కార్యక్రమాన్ని ఒక నిర్దిష్ట కాల వ్యవధిలో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. సమాజంలోని ప్రతిఒక్కరికీ సురక్షిత మంచినీరు అందించాలన్నదే జల్‌జీవన్ మిషన్ ఉద్దేశమన్నారు. ఇందులో భాగంగా 2024 నాటికి రాష్ట్రంలోని అన్ని గృహాలకూ కుళాయి కనెక్షన్లు ద్వారా తగినంత ప్రమాణంలో శుద్ధమైన తాగునీటిని అందిస్తామన్నారు. పంచాయతీలన్నిటినీ బలోపేతం చేసి మహిళా స్వయం శక్తి సంఘాలను పెద్ద ఎత్తున భాగస్వామ్యులను చేయాలన్నారు. సిఎస్ జవహర్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో జల్‌జీవన్ మిషన్, స్వచ్ఛ భారత్ మిషన్ కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు దేశంలో ఎక్కడా లేని విధంగా గ్రామస్థాయిలో గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి రాజశేఖర్ పాల్గొన్నారు.

ఫోన్‌పే నుంచి అకౌంట్ అగ్రిగేటర్ సేవలు

న్యూఢిల్లీ : ప్రముఖ చెల్లింపుల వేదిక ఫోన్‌పే కొత్తగా అకౌంట్ అగ్రిగేటర్ సేవలను ప్రారంభించినట్లు వెల్లడించింది. ఫోన్‌పేకు చెందిన అనుబంధ సంస్థ ఫోన్‌పే టెక్నాలజీ సర్వీసెస్ దీన్ని ఆవిష్కరించింది. వినియోగదారుల అనుమతితో వారి ఆర్థిక వివరాలను ఆర్థిక సంస్థలతో పంచుకోవడానికి వీలు కల్పిస్తుందని తెలిపింది. ఈ సర్వీసుల ద్వారా ఖాతాదారులు తమ ఆర్థిక వివరాలను బ్యాంకులు, ఇన్సూరెన్స్ కంపెనీలు, ఇతర ఆర్థిక సంస్థలతో పంచుకోవడం ద్వారా ఫైనాన్సియల్ ఉత్పత్తులను, సేవలను వేగంగా పొందేందుకు వీలుంటుందని పేర్కొంది. దీని కింద కొత్తగా రుణాలు తీసుకోవడం, బీమా పాలసీల కొనుగోలు, పెట్టుబడి సలహాలు పంచుకోవడానికి మద్దతును అందించనున్నట్లు తెలిపింది. ఈ సేవల కోసం ఫోన్‌పే యాప్‌లో అకౌంట్ అగ్రిగేటర్ ఖాతాను తెరుచుకోవాల్సి ఉంటుంది.

నాటోకు తూర్పులో పనేమిటి?

టోక్యోలో నాటో కార్యాలయం తెరవడం
మరిన్ని దేశాలను చేర్చుకోవడంపై మాక్రాన్ ఆందోళన

పారిస్: అమెరికా నేతృత్వంలోని పశ్చిమ దేశాల సైనిక కూటమి నాటో కార్యాలయ్యాన్ని టోక్యోలో తెరవడం, ఆసియా-పసిఫిక్ ప్రాంత దేశాలను ఈ కూటమిలోకి చేర్చుకునేందుకు జరుగుతున్న యత్నాలపై ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమానియెల్ మాక్రాన్ ఆందోళన వ్యక్తం చేశారు. మాక్రాన్ చర్య హుందాతనం, సాహసోపేతంతో కూడిన చర్య అని చైనా నిపుణులు ప్రశంసించారు. అమెరికా స్వార్థపూరిత ఎజెండాతో ఆసియాను లాగడానికి ప్రయత్నిస్తోందని వారు అన్నారు. ఉత్తర అట్లాంటిక్‌కు మాత్రమే పరిమితం కావాల్సిన నాటో కూటమిని తూర్పు ప్రాంతాలకు విస్తరించాల్సిన పనేమిటని మాక్రాన్ ప్రశ్నించారు. మాక్రాన్ తరహాలోనే ఆసియా పసిఫిక్ ప్రాంతంలోని వివిధ దేశాలు పదే పదే తమ అభ్యంతరాన్ని వ్యక్తం చేస్తున్నాయి. సింగపూర్‌లో ఆదివారం జరిగిన ఇరవయ్యో 'షాంగ్రీ లా డైలాగ్ 'లో చైనా స్టేట్ కౌన్సిలర్, రక్షణ శాక మంత్రి లీషాంగ్‌ఫూ మాట్లాడుతూ ఆసియా పసిఫిక్‌లో నాటో తరహా సైనిక కూటమి ఏర్పాటు కోసం యత్నించడం ఈ ప్రాంత దేశాలను హైజాక్ చేయడమే అవుతుందని హెచ్చరించారు. నాటోను తూర్పు దిశగా విస్తరించడంలో అమెరికా ఉద్దేశం తెలియనిదేమీ కాదు. ఇప్పటికే పశ్చిమంలో రష్యాను దెబ్బతీసేందుకు యూరప్ దేశాలతో కూడిన నాటోను ప్రయోగించారు. ఇప్పుడు చైనాను అడ్డుకోవడానికి తూర్పున బలమైన బహుళ పక్ష సైనిక కూటమి కోసం యత్నిస్తున్నారని చైనా సైనిక నిపుణుడు సాంగ్ జాంగ్ పింగ్ విశ్లేషించారు.

కూలీకి పరిహారం చెల్లించండి : హైకోర్టు

ప్రజాశక్తి-అమరావతి

ట్రాక్టర్ ట్రాలీలో ప్రయాణిస్తూ ప్రమాదవశాత్తూ మరణించిన ఓ కూలీకి నష్ట పరిహారం చెల్లించాలని బీమా కంపెనీకి హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఆ కూలీకి బీమా ప్రీమియం చెల్లించలేదని, పైపెచ్చు ఆయన ఆ ట్రాక్టర్‌లో అనధికారికంగా ప్రయాణిస్తున్నందున బీమా పరిహారం చెల్లించక్కర్లేదని బీమా కంపెనీ చేసిన వాదనను కొట్టేసింది. ట్రాక్టర్, ట్రాలీకి బీమా ఉందన్న మృతుని కుటుంబానికి ఆరు శాతం వడ్డీతో రూ.4.68 లక్షల పరిహారాన్ని రెండు నెలల్లో చెల్లించాలని బీమా కంపెనీని ఆదేశించింది. ట్రాక్టర్ డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగిందని తేలితే ఆ మొత్తాన్ని ట్రాక్టర్ యజమాని నుంచి రికవరీ చేసుకోవాలని బీమా కంపెనీకి జస్టిస్ వి గోపాలకృష్ణ ఆదేశాలిస్తూ తీర్పు చెప్పారు. కడప జిల్లా, పూత చిన్నాయపల్లె గ్రామంలో గడ్డి దించేందుకు కూలీలతో వెళుతున్న ట్రాక్టర్ 2011 ఫిబ్రవరి 3న ప్రమాదానికి గురైంది.

ప్రమాదంలో డి చిన్న సుబ్బారాయుడు అనే కూలీ మరణించారు. తమకు రూ.10 లక్షల పరిహారం ఇప్పించాలంటూ మృతుడి భార్య మోటార్ వాహనాల ట్రిబ్యునల్‌ను ఆశ్రయించారు. రూ.4.48 లక్షల పరిహారం ఇవ్వాలంటూ 2012లో ట్రిబ్యునల్ ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ బీమా కంపెనీ 2013లో హైకోర్టులో అప్పీల్ దాఖలు చేసింది. అప్పీల్‌ను డిస్మిస్ చేస్తూ మృతుడి కుటుంబానికి పరిహారం చెల్లించాలని హైకోర్టు తీర్పు చెప్పింది.

శాఖాపర విచారణ లేకుండా శిక్ష విధింపు చెల్లదు

• హైకోర్టు తీర్పు
• 36 ఏళ్లకు విజయం సాధించిన ఉద్యోగి

ప్రజాశక్తి-అమరావతి

'ఉద్యోగిపై ఆరోపణలు వచ్చినప్పుడు ఆ ఉద్యోగికి చార్జిమెమో ఇవ్వాలి. శాఖాపరమైన విచారణ చేయాలి, ఇవి లేకుండా నేరుగా శిక్ష విధింపు చెల్లదు' అని హైకోర్టు తీర్పు చెప్పింది. నిరవధికంగా రెండు ఇంక్రిమెంట్లను నిలిపేస్తూ ఉన్నతాధికారులు 1987లో విధించిన ఆ శిక్షను రద్దు చేసింది.

ఈ మేరకు జస్టిస్ చీకటి మానవేంద్రనాథ్ రాయ్, జస్టిస్ వి గోపాలకృష్ణారావుతో కూడిన డివిజన్ బెంచ్ తీర్పు చెప్పింది. 36 ఏళ్ల క్రితం కేసు వేసిన ఉద్యోగికి ఇప్పుడు రిటైర్మెంటు అయ్యాక న్యాయం లభించింది. ఆ ఉద్యోగికి కోత కోసిన ఇంక్రిమెంట్లను ఇవ్వాలని హైకోర్టు తీర్పు చెప్పింది. విజయనగరానికి చెందిన సిహెచ్ లక్ష్మీనర్సయ్య సెరీకల్చర్ డిపార్ట్‌మెంట్‌లో ఇన్‌స్పెక్టర్‌గా చేసేవారు. ఆయన పనితీరు సరిగ్గాలేదని ఉన్నతాధికారులు షోకాజ్ నోటీస్ ఇచ్చారు. దీనిని వ్యతిరేకిస్తూ ఆ ఉద్యోగి రిప్లై ఇచ్చారు. దీంతో సంతృప్తి చెందని అధికారులు అభియోగాలు నమోదు చేయకుండా, చార్జిమెమో ఇవ్వకుండా, శాఖాపరమైన విచారణ లేకుండానే ఆయన ఇంక్రిమెంట్లను కట్ చేశారు. 31 ఏళ్ల వయసులో నర్సయ్య మొదలుపెట్టిన న్యాయపోరాటం 36 ఏళ్ల తర్వాత ఆయనకు 67 ఏళ్లు వచ్చాక ఫలించింది.

అరేబియా సముద్రంలో తుపాను!

- కేరళకు రానున్న రుతుపవనాలు

బెంగళూరు : కేరళకు రుతుపవనాల రాక ఇప్పటికే ఆలస్యమవగా, ఆ జాప్యానికి తోడు అరేబియా సముద్రంలో బుధవారం తుపాను ఏర్పడనుందని భారత వాతావరణ విభాగం (ఐఎండి) తెలిపింది. ఈ తుపాను ఉధృతి, సముద్రంలో ఏర్పడే ప్రాంతం, తదనంతరం దాని కదలికలు ఇప్పటికీ కూడా కేరళకు నైరుతి రుతుపవనాల రాకను ప్రభావితం చేసే అవకాశం వుందని పేర్కొంది. ప్రస్తుతమున్న అననుకూల పరిస్థితులు క్రమంగా అల్పపీడనంగా రూపుదిద్దుకుంది, మంగళవారం ఉదయానికి, ఇది మరింత బలపడి, ఆగ్నేయ అరేబియా సముద్రంలో కేంద్రీకృతమయ్యే అవకాశాలు వున్నాయి, ప్రస్తుతం ఈ అల్పపీడనం ముంబయికి దక్షిణ-నైరుతిలో 1120 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమైంది. ఇప్పటికి వున్న అంచనాల ప్రకారం ఇది పాకిస్తాన్ తూర్పు దిశగా వెళ తొందని, భారత పశ్చిమ తీర ప్రాంతాన్ని ప్రభావితం చేయబోదని ఐఎండి పేర్కొంది. రాగల 24గంటల్లో ఈ అల్పపీడనం బలపడి తుపానుగా మారనుందని భావిస్తున్నారు. వారం రోజుల నుండి రుతుపవనాలు ముందుకు పురోగమించడానికి వాతావరణ పరిస్థితులన్నీ అనుకూలంగా వున్నాయి. కేరళ తీర ప్రాంతంపై మేఘాలు దట్టంగా ఏర్పడినట్లు ఉపగ్రహ చిత్రాలు చూపిస్తున్నాయి, రుతుపవనాలు బలపడుతున్నాయని ఐఎండి సీనియర్ అధికారి తెలిపారు.

వాణిజ్య పంటలతో ఆహార భద్రతకు పెనుముప్పు

- వ్యవసాయాన్ని సరుకుగా మార్చడమే సామ్రాజ్యవాదుల లక్ష్యం
- వారికి లొంగిపోతే ఆఫ్రికా దేశాలకు పట్టిన గతే...
- అరిబండి లక్ష్మీనారాయణ 5వ స్మారకోపన్యాసంలో ప్రభాత్ పట్నాయక్



స్మారకోపన్యాసం చేస్తున్న ప్రభాత్ పట్నాయక్ ప్రభాత్ పట్నాయక్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వాణిజ్య పంటలతో దేశ ప్రజల ఆహారభద్రతకు పెనుముప్పు పొంచి ఉందని ప్రముఖ ఆర్థిక, రాజకీయ విశ్లేషకులు, ప్రొఫెసర్ ప్రభాత్ పట్నాయక్ తెలిపారు. అంతర్జాతీయ సామ్రాజ్యవాదుల కుట్రలకు ప్రధాని నరేంద్ర మోడీ తలొగ్గుతున్నారని విమర్శించారు. 'మారుతున్న ప్రపంచ సంబంధాలు, వాతావరణం... వ్యవసాయ జాతీయ విధానం', వానాకాలం పంటల సాగుపై మంగళవారం హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో అరిబండి ఫౌండేషన్, తెలంగాణ రైతు సంఘం సంయుక్తంగా సదస్సు నిర్వహించాయి. ఈ సదస్సులో ప్రభాత్ పట్నాయక్ మాట్లాడుతూ వ్యవసాయాన్ని సరుకుగా మార్చడమే లక్ష్యంగా సామ్రాజ్యవాదుల ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. కేంద్రంలోని బిజెపి సర్కారు అందుకనుగుణంగానే మూడు వ్యవసాయ నల్ల చట్టాలు తీసుకొచ్చిందని గుర్తు చేశారు. రైతులు పోరాడి ఆ చట్టాలను వెనక్కి తిప్పికొట్టినా.. దేశానికి ఆ ప్రమాదం పొంచి ఉందని తెలిపారు. రైతులపై వలసవాదులు క్రూర పద్ధతులు ప్రయోగించి దోపిడీ చేశారని వివరించారు. నేటి పాలకులు పరోక్ష పద్ధతులతో దోపిడీ చేస్తున్నారని విమర్శించారు. సామ్రాజ్యవాదులకు లొంగిపోతే ఆఫ్రికా దేశాలకు పట్టిన గతే మనకీ పడుతుందని హెచ్చరించారు. రైతు రక్షణ కోసం అప్రమత్తతతో ఉండడం మరింత అవసరమని అన్నారు. సామ్రాజ్య వాదులు వ్యవసాయ రంగంలోకి చొచ్చుకొస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇంగ్లాండ్‌లో పత్తి పంట సాగు కాదని, అయినా ఆ దేశంలో భారీగా పత్తి పరిశ్రమలు వచ్చాయన్నారు. రైతుల భూములను తమ ఆధీనంలోకి తెచ్చుకోవాలని పెట్టుబడిదారుల కుట్రలు ఉందని తెలిపారు. వలసదేశాల్లో తమకు అనుకూలమైన పంటలను సాగు చేసేలా ఒత్తిడి చేస్తున్నారని గుర్తు చేశారు.

ఎఐకెఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి విజ్జుకృష్ణన్ మాట్లాడుతూ రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామని, వ్యవసాయ ఉత్పత్తులకు మద్దతు ధర, సబ్సిడీ విత్తనాలు, ఎరువులు అంటూ మోడీ ఇచ్చిన హామీలు ఇప్పటికీ అమలు కాలేదన్నారు.

రైతు ఆదాయం గతంలో కంటే పడిపోయిందని తెలిపారు. వ్యవసాయ రంగంలో సంక్షోభ ఫలితంగా దేశంలో నాలుగు లక్షల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని, బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా (2014- 23) లక్ష మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులే కాకుండా కూలీలు, నిరుద్యోగ యువకులు ఉపాధి కరువై చనిపోయారని గుర్తు చేశారు.

స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలతో శ్రీలంక తీవ్రమైన వ్యవసాయ సంక్షోభంలోకి పోయిందని గుర్తు చేశారు. వ్యవసాయ విధానంలో బిజెపి, కాంగ్రెస్‌కు పెద్ద తేడాలేదన్నారు. వ్యవసాయం కార్పొరేట్ శక్తుల చేతుల్లోకి పోతే వారిదే పెత్తనం అవుతుందన్నారు. వ్యవసాయరంగ నిపుణులు డాక్టర్ అల్లాప్ జనయ్య, ప్రొఫెసర్ రాజిరెడ్డి, ఎఐకెఎస్ జాతీయ నాయకులు సారంపల్లి మల్లారెడ్డి, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్, ప్రధాన కార్యదర్శి టి సాగర్, సహాయ కార్యదర్శి మూడ్ శోభన్ మాట్లాడారు.

రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు సురినాం అత్యున్నత పౌర పురస్కారం

పరమరిబో : భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, సురినాం అత్యున్నత పౌర పురస్కారమైన 'గ్రాండ్ ఆర్డర్ ఆఫ్ ది చెయిన్ ఆఫ్ ది ఎల్లో స్టార్'ను అందుకున్నారు. ఇరు దేశాల మధ్య బలమైన ద్వైపాక్షిక సంబంధాలకు గౌరవిస్తూ, సురినాం అధ్యక్షుడు చంద్రికాప్రసాద్ సంతోఖీ ఈ అవార్డును ఆమెకు అందజేశారు. మూడు రోజుల అధికార పర్యటన నిమిత్తం ఆదివారం ముర్ము సురినాం చేరుకున్నారు. "ఇరు దేశాల మధ్య గల సంబంధాలను ఈ పురస్కారం ప్రతిబింబిస్తోంది." అని విదేశాంగ మంత్రిత్వ శాఖ ట్వీట్ చేసింది. ఈ అవార్డును అందుకోవడం తనకెంతో గౌరవప్రదంగా వుందని రాష్ట్రపతి ద్రౌపది వ్యాఖ్యానించారు. "ఈ గుర్తింపునకు అపారమైన ప్రాముఖ్యత వుంది. ఈ అవార్డు కేవలం నాది మాత్రమే కాదు, 140కోట్ల మంది ప్రజలది, వారందరికీ ప్రాతినిధ్యం వహిస్తూ ఈ అవార్డును అందుకున్నాను." అని ఆమె సోమవారం ట్వీట్ చేశారు. ఇరు దేశాల మధ్య స్నేహ సంబంధాలను పరిపుష్టం చేయడంలో అద్భుతమైన పాత్ర పోషించిన ఇరుదేశాల వరుస తరాలకు ఈ పురస్కారాన్ని ఆమె అంకితం చేశారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు ప్రధాని నరేంద్ర మోడీ అభినందనలు తెలియచేశారు. సురినాం ప్రభుత్వం, ప్రజల నుండి వచ్చిన ఈ ప్రత్యేకమైన పురస్కారం ఇరు దేశాల మధ్య గల శాశ్వత స్నేహ సంబంధాలకు ప్రతీకగా వుందని మోడీ ట్వీట్ చేశారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తనను అభినందించడానికి వచ్చిన పిల్లలతో కాసేపు సమయం గడిపారు. భారత్‌లో తయారైన చాక్లెట్లను వారికి ఇచ్చారు. అనంతరం ఆమె 'మెడిటేషన్'ను సందర్శించారు. ఇండిపెండెన్స్ స్క్వేర్‌లో సిమ్మలేబేడ్ గ్రామాన్ని ప్రారంభించారు. సోమవారం ఇరు పక్షాల మధ్య ప్రతినిధి స్థాయి చర్చలు జరిగాయి. సురినాంకు మొదటిసారిగా భారతీయులు వచ్చి 150 ఏళ్లు పూర్తి కావడం, తన మొదటి విదేశీ పర్యటన కూడా ఇదే కావడం సంతోషంగా వుందని ముర్ము వ్యాఖ్యానించారు.

జెఇఇ అడ్వాన్స్‌డ్ పరీక్షలో 'స్మార్ట్' కాపీయింగ్

- పట్టుబడ్డ నలుగురు విద్యార్థులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఐఐటిల్లో బిటెక్ సీట్ల భర్తీకి దేశవ్యాప్తంగా ఆదివారం నిర్వహించిన జెఇఇ అడ్వాన్స్‌డ్ పరీక్షలో 'స్మార్ట్' కాపీయింగ్ చోటు చేసుకుంది. టిఎస్‌పిఎస్‌సిలో జరిగిన పేపర్ లీకేజీ వ్యవహారం మరువక ముందే నలుగురు యువకులు వాట్సాప్ ద్వారా జెఇఇ అడ్వాన్స్‌డ్ పరీక్షలో స్మార్ట్ కాపీయింగ్‌కు పాల్పడటం హైదరాబాద్‌లో సంచలనం రేపింది. ఆదివారం జరిగిన ఈ సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. నలుగురు యువకులపై కేసులు నమోదు చేసిన పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. సికింద్రాబాద్‌లోని మార్కెట్ పోలీసులు, ఎల్బీనగర్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మాదాపూర్ నారాయణ కళాశాలకు చెందిన నలుగురు విద్యార్థులు ఒక వాట్సాప్ గ్రూప్‌ను క్రియేట్ చేశారు. చాకచక్యంగా తమ స్మార్ట్ ఫోన్లతో ఒకరు నాచారం, మరొకరు ఎల్‌బీనగర్, మిగిలిన ఇద్దరు మౌలాలీ, సికింద్రాబాద్‌లోని పరీక్షా కేంద్రాల్లోకి ప్రవేశించారు. కడప జిల్లాకు చెందిన చింతపల్లి చైతన్య కృష్ణ సికింద్రాబాద్ ప్యాట్నీ సెంటర్‌లోని ఎన్‌విఐటీ కాలేజీలో పరీక్ష రాశాడు. గణితం, రసాయన శాస్త్రానికి సంబంధించిన సమాధానాలను స్క్రీన్ షాట్ తీసి వాట్సాప్ గ్రూప్‌లో స్నేహితులకు పోస్ట్ చేశాడు. ఎల్బీనగర్, మల్లాపూర్, మౌలాలి కేంద్రాల్లో పరీక్షలు రాస్తున్న మిగతా విద్యార్థులు ఆ సమాధానాలను కాపీ చేశారు. ఈ క్రమంలో సికింద్రాబాద్ పరీక్షా కేంద్రంలో అనుమానం కలిగిన ఇన్విజిలేటర్.. చైతన్య కృష్ణను పట్టుకుని, ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో విద్యార్థిని తనిఖీ చేయగా అతని నుంచి స్మార్ట్‌ఫోన్ లభించింది. దాంతో పోలీసులకు సమాచారం ఇవ్వడంతో విద్యార్థిని అదుపులోకి తీసుకుని విచారించడంతో అసలు విషయం వెలుగు చూసింది. ఎల్బీనగర్‌లో సైతం విద్యార్థిని అరెస్టు చేసిన పోలీసులు, వారిచ్చిన సమాచారంతో మిగతా విద్యార్థులను అరెస్టు చేశారు. విద్యార్థులపై వివిధ పోలీస్‌స్టేషన్లలో కేసునమోదు చేసిన పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టారు.

గవర్నర్ వ్యాఖ్యలపై తమిళనాడు సర్కార్ అభ్యంతరం

చెన్నై : రాష్ట్రాలకు పెట్టుబడులను తీసుకురావడం కోసం ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ ఇటీవల చేసిన విదేశీ పర్యటనలపై గవర్నర్ ఆర్.ఎన్.రవి చేసిన పరోక్ష వ్యాఖ్యలకు తమిళనాడు ప్రభుత్వం మంగళవారం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. రాజకీయ ప్రకటనలు చేయడానికి రాజ్‌భవన్ కార్యాలయాన్ని ఉపయోగించుకోకుండా వుండాల్సిందిగా కోరింది. పెట్టుబడిదారులతో మాట్లాడినా లేదా వారిని కోరినంత మాత్రాన పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చేయవని గవర్నర్ చేసిన వ్యాఖ్య ముఖ్యమంత్రిపై చేసిన పరోక్ష దాడి అని ప్రభుత్వం పేర్కొంది. ముఖ్యమంత్రి ఇటీవల సింగపూర్, జపాన్‌లలో పర్యటించారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను మెరుగుపరచడం కోసం ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారని, అటువంటి ప్రయత్నాలను గవర్నర్ తక్కువ చేసి మాట్లాడుతున్నారని ఆర్థిక మంత్రి తంగమ్ తెన్నరసు విమర్శించారు. గవర్నర్ తన వ్యాఖ్యలతో ప్రధాని మోడీని కూడా విమర్శించినట్టైందని తెన్నరసు అన్నారు. 2011లో గుజరాత్ ముఖ్యమంత్రిగా వున్నప్పుడు మోడీ పెట్టుబడుల కోసం చైనా వెళ్లారని గుర్తు చేశారు.

కళాక్షేత్ర లైంగిక వేధింపుల కేసులో హరిపద్మన్‌కు బెయిల్ మంజూరు

చెన్నై : దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన కళాక్షేత్ర లైంగిక వేధింపుల కేసులో నిందితుడు హరి పద్మన్‌కు తాజాగా కోర్టు బెయిల్ మంజూరు చేయడం చర్చనీయాంశంగా మారింది. ఈ ఏడాది మార్చిలో క్యాంపస్‌లో లైంగిక వేధింపులు జరుగుతున్నాయని ఆరోపిస్తూ కళాక్షేత్ర ఫౌండేషన్‌కు చెందిన విద్యార్థినులు చెన్నైలో ఆందోళనలకు దిగడం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. కళాక్షేత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలోని రుక్మిణిదేవి కాలేజ్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ ఫ్యాకల్టీ సభ్యుడు హరి పద్మన్‌ను సస్పెండ్ చేశారు. కళాశాల మాజీ విద్యార్థిని ఫిర్యాదుతో లైంగిక వేధింపుల కేసు నమోదు చేశారు.

త్రిపురలో మహిళలకు రక్షణ కరువు!

- విచ్చలవిడిగా లైంగిక, హింసాత్మక దాడులు
- ఖండించిన ఐద్వా
- సమగ్ర దర్యాప్తునకు డిమాండ్



అగర్తలా : త్రిపురలో బిజెపి హయాంలో మహిళలపై దాడులు విపరీతంగా పెరిగిపోతున్నాయి. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన తర్వాత పరిస్థితి చాలా దారుణంగా వుంది. చిన్నారులు, యువతులు, గిరిజన మహిళలు, వికలాంగులు ఇలా వారు వీరు అనే తేడా లేకుండా మహిళలను లక్ష్యంగా చేసుకుని హింసాత్మక దాడులు ఆందోళనకర స్థాయిలో పెరుగుతున్నాయి. మే 14వ తేదీన గోమతి, లాల్చారా జిల్లాలో ఇద్దరు గిరిజన బాలికలపై సామూహిక అత్యాచారాలు జరిగాయి, మే 24న ఎనిమిదేళ్ల బాలికపై అత్యాచారం, 28న 11 ఏళ్ల బాలికపై మరో దాడి ఇలా చెప్పుకుంటూ పోతే అనేకం వున్నాయి. జూన్ 1వ తేదీనే ఇలాంటివి మరో రెండు సంఘటనలు చోటు చేసుకున్నాయి. అభం శుభం తెలియని ఐదేళ్ల చిన్నారి ఈ ఘాతుకానికి బలైతే, 14 ఏళ్ల బాలికపై భయానకరీతిలో సామూహిక అత్యాచారం చోటు చేసుకుంది. ఆ మరుసటి రోజు 2వ తేదీన ఐటిఐ విద్యార్థిని, 14 ఏళ్ల బాలికను అపహరించారు. గతేడాది అక్టోబరులో రాష్ట్ర అసెంబ్లీలో ముఖ్యమంత్రి, హోం మంత్రి బాధ్యతలు కూడా నిర్వర్తిస్తున్న డాక్టర్ మాణిక్ సాహా సమర్పించిన ఒక నివేదికలో ఆందోళనకర రీతిలో గణాంకాలు వెల్లడయ్యాయి. 2020 జనవరి నుండి రాష్ట్రంలో 400కి పైగా అత్యాచార సంఘటనలు నమోదయ్యాయని నివేదిక పేర్కొంది. మహిళలపై పాల్పడిన నేరాలకు సంబంధించి 1174 మందిని అరెస్టు చేసినట్లు ఆ నివేదిక పేర్కొంది. ఇదే సమయంలో లైంగిక దాడులకు గురైన తర్వాత ఏడుగురు మహిళలు హత్యకు గురయ్యారని కూడా ఆ నివేదిక తెలిపింది. సిపిఎం ఎంఎల్ఎ నిర్మల్ బిశ్వాస్, కాంగ్రెస్ ఎంఎల్ఎ సుదీప్ రాయ్ బర్మన్ అసెంబ్లీ సమావేశాల సందర్భంగా అడిగిన ప్రశ్నకు ప్రభుత్వం ఈ వివరాలు అందజేసింది.

ఐద్వా ఖండన

త్రిపురలో మహిళలపై లైంగిక, ఇతర రకాలైన హింస పెరిగిపోవడాన్ని ఐద్వా తీవ్రంగా ఖండించింది. ఈ ఏడాది ఏప్రిల్ 15, జూన్ 1 మధ్య జరిగిన ఇటువంటి 12 కేసుల వివరాలను ఐద్వా త్రిపుర రాష్ట్ర కమిటీ నమోదు చేసింది. ఈ మేరకు ఆ వివరాలను వెల్లడిస్తూ ఐద్వా ఒక పత్రికా ప్రకటన విడుదల చేసింది. ఏప్రిల్ 15న 12ఏళ్ళ బాలికపై అత్యాచారం జరిగిందని, ఒక వారం గడిచిన తర్వాత ఏప్రిల్ 23న కొంతమంది బిజెపి గూండాలు, పంచాయత్ ప్రధాన్ కలిసి అత్యాచారానికి ఒడిగట్టారని ఐద్వా తెలిపింది. మే 2వ తేదీన మానసిక వైకల్యంతో బాధపడే మహిళపై ఇటువంటి దురాగతానికి పాల్పడడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోందని ఐద్వా పేర్కొంది. ఈ కేసులపై దర్యాప్తుకు నిజ నిర్ధారణ కమిటీని ఏర్పాటుచేసి, దోషులపై తీసుకున్న చర్యల నివేదికను విడుదల చేయాలని త్రిపుర మహిళా కమిషన్‌ను ఐద్వా కోరింది. నిందితులను తక్షణమే అరెస్టు చేసి, మహిళల భద్రతకు సమర్థవంతమైన చర్యలు తీసుకోవాలని ఐద్వా డిమాండ్ చేసింది.

15వేల ఎల్ఎస్‌డి బ్లాట్ల స్వాధీనం

న్యూఢిల్లీ : అతిపెద్ద మాదకద్రవ్యాల అక్రమ రవాణా నెట్‌వర్క్‌ను ఎన్‌సిబి (నార్కొటిక్స్ కంట్రోల్ బ్యూరో) అధికారులు ఛేదించారు. సింథటిక్ రసాయనాల ఆధారిత మత్తుమందు ఎల్ఎస్‌డిని పెద్ద మొత్తంలో స్వాధీనం చేసుకున్నారు. గత రెండు దశాబ్దాల కాలంలోనే అత్యంత పెద్ద మొత్తంలో అంతర్జాతీయ బ్రాండ్లకు చెందిన దాదాపు 15వేల బ్లాట్లను, 2.23 కిలోల క్యురేటెడ్ మారిజువానా (దిగుమతి చేసుకున్నది) స్వాధీనం చేసుకున్నట్లు ఎన్‌సిబి డిప్యూటీ డైరెక్టర్ జనరల్ (నార్తరన్ రేంజ్) జ్ఞానేశ్వర్ సింగ్ తెలిపారు. డార్క్ వెబ్ ద్వారా క్రిప్టో కరెన్సీతో ఆర్థిక లావాదేవీలు సాగుతున్నట్లు వెల్లడైందన్నారు. ఈ సిండికేట్‌కు సంబంధించి ఒక యువతిసహా ఆరుగురిని అరెస్టు చేశారు. అమెరికా, నెదర్లాండ్స్, పోలెండ్ వంటి దేశాలతో ఈ సిండికేట్‌కు సంబంధాలున్నాయని వెల్లడైంది. ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, మహారాష్ట్ర, కేరళ, తమిళనాడుల్లో ఒకేసారి జరిపిన దాడుల్లో వీరిని అరెస్టు చేసి, మాదకద్రవ్యాలను స్వాధీనం చేసుకున్నారు. చాలా కాలం నుండి క్లూలు అందుతున్నాయని, వాటిపై దృష్టి పెట్టి ఇప్పుడు ఈ నెట్‌వర్క్‌ను ఛేదించగలిగామని జ్ఞానేశ్వర్ సింగ్ చెప్పారు. సామాజిక మాధ్యమాల ద్వారా ఈ గ్రూపు సభ్యులంతా ఒకరితో ఒకరు మాట్లాడుకుంటారని చెప్పారు. కొరియర్, పోస్టల్ సర్వీస్ చానెళ్ల ద్వారా ఈ మాదకద్రవ్యాలు అందుతాయి. వారిని పట్టుకునేందుకు ఢిల్లీ జోనల్ యూనిట్ ఆధ్వర్యంలో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేశామని, తీవ్ర స్థాయిలో సాంకేతిక, నిఘా చర్యలు చేపట్టామని సింగ్ తెలిపారు.



ఆందోళను ఉద్దేశించి మాట్లాడుతున్న హన్నన్ మొల్లా

గ్రేటర్ నోయిడా అథారిటీ కార్యాలయం దిగ్బంధం

2 ప్రధాన గేట్లను అడ్డుకున్న రైతులు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

'ఘేరా దలో డేరా దలో' పోరాటంలో భాగంగా మంగళవారం గ్రేటర్ నోయిడా అథారిటీ కార్యాలయాన్ని రైతులు దిగ్బంధం చేశారు. రెండు ప్రధాన గేట్లను అడ్డుకున్నారు. ఈ పోరాటంలో వేలాది మంది రైతులు, మహిళలు పాల్గొన్నారు. ప్రాంత రైతులు, ఇతర గ్రామస్తుల డిమాండ్లతో నిరంతర ఆందోళన 43వ రోజుకు చేరింది. రైతుల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చకుండా జిఎన్‌డిఎ పాలక మండలి నిష్క్రియంగా ఉంటే రానున్న కాలంలో మరింత ఉధృత పోరాటాలు చేస్తామని ఎఐకెఎస్ గౌతమ్ బుద్ధ నగర్ కమిటీ హెచ్చరించింది.

రైతులతో జిఎన్‌డిఎ చేసిన 12 ఏళ్ల నాటి ఒప్పందాన్ని అమలు చేయడమే పోరాటంలో ప్రధాన డిమాండ్ అని ఎఐకెఎస్ నేత హన్నన్ మొల్లా తెలిపారు. భూమి సర్కిల్ రేటుకు 4 రెట్లు పరిహారం, 10 శాతం అభివృద్ధి చేసిన భూమి కోల్పోయిన వారికి ఇవ్వాలని ఒప్పందం ఉందని అన్నారు. పరిశ్రమలో ఉపాధి, బాధిత కుటుంబాలకు సేవలు, భూమి లేని కుటుంబాలకు 40 చదరపు మీటర్ల ఇంటి ప్లాట్లు వంటివి ఒప్పందంలో ఉన్నాయని గుర్తు చేశారు. విద్య, ఆరోగ్యం వంటివి కల్పించాలని అన్నారు. గతంలో భూమి కలిగి ఉన్నవారికి ఉపయోగించని భూమిని తిరిగి లీజుకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆందోళనలో కిసాన్ సభ నాయకులు పి కృష్ణప్రసాద్, ఇంద్రజిత్ సింగ్, పుష్పేందర్ త్యాగి, మనోజ్ కుమార్, రూపేష్ వర్మ, వీర్ సింగ్ నగర్, హరీందర్ ఖైరీ, నరేందర్ భాటి, సుబేదార్ బ్రహ్మపాల్, జగ్బీర్ నంబరదార్, ఆశా యాదవ్, రేఖా చౌహాన్, చాంద్ బేగం, గంగేశ్వర్ దత్ శర్మ తదితరులు పాల్గొన్నారు. గౌతమ్ బుద్ధ నగర్ (గ్రేటర్ నోయిడా) రైతులకు ఎఐకెఎస్ అభినందనలు తెలియజేసింది.

మన నగరాలు.. కాలుష్య కాసారాలు

- టాప్ 20 పొల్యూటెడ్ సిటీస్‌లో 14 భారత్‌లోనే
- ప్రపంచంలో టాప్ 5 కాలుష్య దేశాల్లోనూ చోటు

న్యూఢిల్లీ : భారత్‌లో రోజురోజుకూ కాలుష్యం తీవ్రరూపం దాలుస్తోంది. 2022 ఏడాదికి గానూ ప్రపంచంలో 20 అత్యంత కాలుష్య నగరాలను ఎంపిక చేయగా, అందులో 14 భారత్‌లోనే ఉన్నాయి. ప్రపంచంలో ఐదు అత్యంత కాలుష్య దేశాల్లో భారత ఒకటిగా నిలిచింది.

చాద్, ఇరాక్, పాకిస్థాన్, బహ్రెయిన్, బంగ్లాదేశ్‌లతో కలిసి భారత్ అత్యంత కాలుష్య దేశాల్లో ఒకటిగా ఉంది. కాలుష్యం ఎక్కువగా ఉన్న దేశాల జాబితాలో భారత్ గత ఏడాది కంటే మూడు స్థానాలు మెరుగుపడినా, ప్రపంచంలో ఐదు అత్యంత కాలుష్య దేశాల్లో భారత్ ఒకటిగా నిలవడం ఆందోళన కలిగిస్తోంది. స్విస్ ఎయిర్ క్వాలిటీ టెక్నాలజీ కంపెనీ ఐక్యూ ఎయిర్ ఈ జాబితాను విడుదల చేసింది. ఈ జాబితా ప్రకారం ప్రపంచంలో 20 అత్యంత కాలుష్య నగరాలు.

1. లాహోర్ (పాకిస్థాన్)	8. ఎన్ డజమెనా (చాద్)	15. ముజఫర్‌నగర్ (భారత్)
2. హోటన్ (చైనా)	9. న్యూఢిల్లీ (భారత్)	16. ఫైసలాబాద్ (భారత్)
3. భివాడి (భారత్)	10. పాట్నా (భారత్)	17. గ్రేటర్ నోయిడా (భారత్)
4. ఢిల్లీ (భారత్)	11. ఘజియాబాద్ (భారత్)	18. బహదూర్‌గఢ్ (భారత్)
5. పెషావర్ (పాకిస్థాన్)	12. ధరుహెరా (భారత్)	19. ఫరిదాబాద్ (భారత్)
6. దర్భంగా (భారత్)	13. బాగ్దాద్ (ఇరాక్)	20. ముజఫర్‌పూర్ (భారత్)
7. అసోపూర్ (భారత్)	14. చాప్రా (భారత్)	

అమెరికా దాష్టీకాన్ని అనుమతించం : రష్యా

దుషాంబె : అమెరికా దాష్టీకాన్ని, గుత్తాధిపత్యాన్ని, నియమ, నిబంధనలను రష్యా ఎన్నటికీ ఆమోదించదని రష్యా విదేశాంగ మంత్రి లావ్‌రోవ్ స్పష్టం చేశారు. సోవియట్ యూనియన్ కుప్పకూలిన తర్వాత కొంతకాలం పాటు సాగిన గందరగోళం, అస్తవ్యస్థ పరిస్థితుల తర్వాత ప్రపంచవ్యాప్తంగా రష్యా దౌత్య బృందాలు తమ కార్యకలాపాలను ఉధృతం చేశాయని, ఇతర దేశాలతో సంబంధాలు పెంచుకున్నాయని చెప్పారు. గత కొన్నేళ్లలో ఆఫ్రికా, లాటిన్ అమెరికాలతో సంబంధాలు పెరిగాయన్నారు. వాషింగ్టన్ బలవంతంగా రుద్దే నిబంధనలు వేటినీ ఆమోదించరాదన్న కృత నిశ్చయం తమలో బలపడిందన్నారు. అమెరికా పాత్ర, ప్రభావం నెమ్మదిగా తగ్గుముఖం పడుతోందని, నెమ్మదిగానైనా కచ్చితంగా క్షీణించడం తప్పదన్నారు. రష్యాను లక్ష్యంగా చేసుకుని ఎన్ని ఆంక్షలు విధించినా, ఏకాకిని చేయాలని ఎన్ని ప్రయత్నాలు చేసినా వాటన్నింటినీ రష్యా ప్రతిఘటించడంలో ముందుందని చెప్పారు. వాస్తవానికి, రష్యాను అంతర్జాతీయ సమాజం నుండి వేరు చేయడానికి ప్రయత్నించి వారు విఫలమ య్యారని లావ్‌రోవ్ పేర్కొన్నారు. ప్రపంచంలో కొన్ని ప్రాంతాలను అస్థిరం చేయాలన్నది అమెరికా లక్ష్యమని, భద్రత అందిస్తున్నామనే సాకుతో, తీవ్రవాదంపై పోరు పేరుతో ఇటువంటి చర్యలకు పాల్పడుతూ వుంటుందని విమర్శించారు.

జల విద్యుత్ డ్యామ్‌పై దాడి

(మొదటి పేజీ తరువాయి)

ఖెర్సాన్ మేయర్ చెప్పారు. దీనిని అతి పెద్ద ఉగ్రవాద దాడిగా ఆయన అభివర్ణించారు. నొవాయ ఖఖోవా డ్యామ్ ఫ్లడ్ గేట్లలో ఒక దానిని టెస్టింగ్ కేసుగా పేల్చాలని అనుకున్న మాట నిజమేనని ఉక్రెయిన్ ఆపరేషన్ కమాండ్ సౌత్ మాజీ అధిపతి మేజర్ జనరల్ ఆండ్రీ కొవాల్చుక్ గత డిసెంబరులో వాషింగ్టన్ పోస్ట్ పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొనడాన్ని లియొంతెవ్ ఈ సందర్భంగా గుర్తు చేశారు. మంగళవారం తెల్లవారు జామున 2 గంటల ప్రాంతంలో హిమార్స్ లాంఛర్లతో దాడి చేశారని ఆయన తెలిపారు. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వీడియోలు చూసినా ఈ విషయం స్పష్టమవుతుందని అన్నారు. ఈ దాడిలో వరద గేట్లతో బాటు డ్యామ్‌కు ఎగువన ఉన్న మౌలిక వసతులు, దిగువన ఉన్న కొన్ని నీటి నిర్మాణాలు దెబ్బతిన్నాయని ఆయన వివరించారు. ఈ దాడి రష్యా పనేనని ఉక్రెయిన్, దానికి మద్దతు ఇస్తున్న పశ్చిమ దేశాలు నిందించాయి. దీనిని యుద్ధనేరంగా పరిగణించాలని ఇయు కౌన్సిల్ ప్రెసిడెంట్ చార్లెస్ మైఖెల్ ట్వీట్ చేశారు. ఖెర్సాన్‌ను కాపాడుకోవడానికి యత్నిస్తున్న రష్యన్ దళాలే డ్యామ్‌ను పేల్చేశాయని ఆయన ఆరోపించారు.

గత ఏడాది అక్టోబరులో రిఫరెండమ్ ద్వారా డొనెట్స్క్, లుగాన్స్క్ రిపబ్లిక్‌లతోబాటు జుపోరోజీ, ఖెర్సాన్ ప్రాంతాలను రష్యా స్వాధీనపరచుకుంది. ఇది అక్రమమని, వాటిని తాము ఎలాగైనా తిరిగి వశపరచుకుంటామని ఉక్రెయిన్, దానికి మద్దతిస్తున్న పశ్చిమ దేశాలు పేర్కొన్నాయి.

బ్రిజ్ భూషణ్ ఇంటికి పోలీసులు

- 12 మంది వాంగ్మూలాల రికార్డు
- మైనర్ ఫిర్యాదు ఉపసంహరించుకోలేదు : సాక్షులు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

లైంగిక ఆరోపణలు ఎదుర్కొంటున్న డబ్ల్యుఎఫ్ఐ చీఫ్, బిజెపి ఎంపి బ్రిజ్ భూషణ్ ఇంటికి మంగళవారం ఢిల్లీ పోలీసులు చేరుకున్నారు. విచారణ నిమిత్తం ఉత్తరప్రదేశ్‌లోని గోండాలోని ఆయన ఇంటివద్దకు వెళ్లారని సమాచారం. రెజ్లర్లు చేసిన ఆరోపణలకు సంబంధించి 12 మంది వాంగ్మూలం రికార్డు చేశారు. బ్రిజ్ భూషణ్ మద్దతుదారులను కొందరిని ప్రశ్నించారు. ప్రత్యేక దర్యాప్తు బృందం ఇప్పటివరకూ 137 మంది వాంగ్మూలాలను రికార్డు చేసినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. బ్రిజ్ భూషణ్‌పై లైంగిక వేధింపుల కేసులో ఢిల్లీ పోలీసులు నలుగురు రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సభ్యుల వాంగ్మూలాలను నమోదు చేసినట్లు తెలిపాయి. బ్రిజ్‌భూషణ్ ఢిల్లీ నివాసంలోని కొంతమంది సిబ్బందిని కూడా పోలీసులు విచారణ కోసం పిలిచారని వారు తెలిపారు. బ్రిజ్ భూషణ్‌పై చర్యలు తీసుకోకపోవడాన్ని నిరసిస్తూ ఈ నెల 9న జంతర్ మంతర్‌కు వెళ్లి ఆందోళన చేయాలన్న తమ ప్రణాళికను రెజ్లర్ల విజ్ఞప్తి మేరకు వాయిదా వేసినట్లు భారతీయ కిసాన్ యూనియన్ నాయకులు రాకేష్ తికాయత్ తెలిపారు. బ్రిజ్ భూషణ్‌పై మైనర్ రెజ్లర్ తన ఫిర్యాదును ఉపసంహరించుకున్నారనే వార్తలు సోమవారం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో, ఫిర్యాదును ఉపసంహరించుకోలేదని ఆమె తండ్రి స్పష్టం చేశారు.

ఢిల్లీ పోలీసులకు ఇచ్చిన వాంగ్మూలంలో బ్రిజ్ భూషణ్‌పై లైంగిక వేధింపుల ఆరోపణలను 2010 కామన్వెల్త్ గేమ్స్ బంగారు పతక విజేత అనిత ధ్రువీకరించారు. బ్రిజ్ భూషణ్ లైంగిక వేధింపుల గురించి ఫిర్యాదుచేసిన రెజ్లర్ జాతీయ స్థాయి శిబిరాల్లో తన రూమ్ మేటని, ఆ విషయం తనతో చెప్పుకుని బోరున ఏడ్చిందని తెలిపారు. అసోసియేషన్ ప్రెసిడెంట్ అమ్మాయిని ఎందుకు తరచుగా పిలుస్తాడు? అనిత ప్రశ్నించింది. 'ఆయన ఫోన్ కాల్స్ తీయడం మానేసింది' కాబట్టి ఫిర్యాదుదారు సింగ్‌కు వీలైనంత దూరంగా ఉండటానికి ప్రయత్నించారని అనిత తెలిపారు. తన స్నేహితురాలు తన స్వరాన్ని పెంచినట్లయితే, అది తన కెరీర్‌కు ముగింపు పలికేదని అనిత చెప్పారు. డబ్ల్యుఎఫ్ఐకి వ్యతిరేకంగా మాట్లాడినా పరిణామాలు ఉంటాయని అన్నారు. 'శిబిరాల్లో ఆహారం నాణ్యత గురించి ఫిర్యాదు చేయడానికి బాలికలు భయపడుతున్నారు. లైంగిక వేధింపుల గురించి మాట్లాడే ధైర్యం వారికి ఎలా వస్తుంది?' అని అన్నారు.

ఉద్యోగాలు వదులుకునేందుకు కూడా సిద్ధం

ఎవరికీ చెప్పొద్దని, ప్రభుత్వమే మీడియాకు లీక్ చేసింది : రెజ్లర్ భజరంగ్ పునియా

కేంద్ర హోం మంత్రి అమిత్ షా రెజ్లర్లకు ఎలాంటి 'హామీ' ఇవ్వలేదని, నిరసనలు కొనసాగుతాయని రెజ్లర్ బజరంగ్ పునియా చెప్పారు. షాతో తమ సమావేశం గురించి ఎవరికీ వెల్లడించవద్దని ప్రభుత్వం తనకు, తోటి రెజ్లర్లకు చెప్పిందని, వారే దానిని మీడియాకు లీక్ చేశారని పునియా అన్నారు. విచారణ జరుగుతోందని హోంమంత్రి తమకు చెప్పారని అన్నారు. ప్రభుత్వం ప్రతిస్పందనతో రెజ్లర్లు సంతృప్తి చెందలేదని అన్నారు. బ్రిజ్ భూషణ్‌ను ఎందుకు అరెస్టు చేయలేదని ఆయన షాను ప్రశ్నించారు. రెజ్లర్లు వెనక్కి తగ్గరని నొక్కి చెప్పారు. దీనిపై తాము (ప్రభుత్వం) చర్చిస్తున్నామని, తప్పకుండా చర్యలు తీసుకుంటామని హోం మంత్రి హామీ ఇచ్చినట్లు పునియా తెలిపారు. ఆందోళనలకు అడ్డంకిగా మారితే ప్రభుత్వ ఉద్యోగాలను వదులుకునేందుకు కూడా రెజ్లర్లు సిద్ధంగా ఉన్నారని చెప్పారు.



చేతిరాత ప్రాక్టీసు చేశా ...

నా పేరు తులసి. నేను 4వ తరగతి చదువుతున్నా. అక్షరాలు గుండ్రంగా రాయడం నాకు చాలా ఇష్టం. ఈ సెలవుల్లో రైటింగ్‌ని బాగా ప్రాక్టీస్ చేశా. పై క్లాసులకు వెళుతున్నా కదా అని చేతిరాతపై శ్రద్ధ పెట్టా. ముగ్గులు వేయడం కూడా నేర్చుకుంటున్నా. మా తాత కూడా చెబుతుంటాడు 'చేతిరాత తలరాతను' మారుస్తుందని. మా పాఠశాల్లోని ఉపాధ్యాయులు నా చేతి రాతకు సంబంధించి సూచనలు, సలహాలు ఇస్తుంటారు. వాటిని తప్పక పాటిస్తుంటా. మా సార్ చెప్పినట్లు – ముందుగా నాలుగు గీతల పుస్తకంలో ప్రాక్టీస్ చేశా. తరువాత రెండు గీతలు, చివరిగా ఒక గీత పైన చివరగా తెల్లకాగితాలపై రాశా. గుండ్రంగా రాయాలని ఆరాటపడ్డా. ప్రస్తుతం నేను రెండు గీతల మధ్య రాయగలుగుతున్నా. ఆ నమ్మకంతో ఆన్లైన్‌లో జరిగిన హాండ్ రైటింగ్ పోటీల్లో పాల్గొన్నా. నాకు పతకం వచ్చింది. చాలా సంతోషంగా ఉంది. ఆ ప్రోత్సాహంతో మరింత బాగా రాస్తా. అందుకు ఈ వేసవి సెలవులు చక్కగా వాడుకుంటున్నా. మా మండల విద్యాధికారి, మా పాఠశాల ఉపాధ్యాయ బృందం నన్ను ఎంతగానో ప్రోత్సహిస్తున్నారు.



- తులసి,
4వ తరగతి,
ఎంపిపి పాఠశాల,
మర్తాడు మెయిన్, గార్లదిన్న,
అనంతపురం.

ఫ్యాషన్





- దుర్గా,
యనమనలకుదురు,
హెచ్‌పి గ్యాస్ గూడౌన్,
విజయవాడ.
కృష్ణా జిల్లా.



మల్లి




మల్లె తోటలోన మల్లి
మల్లెలు ఎన్నో కోసింది
మల్లెలు మాలగా కట్టింది
మూరలు మూరలు పంచింది!



- షాన్వి,
4వ తరగతి,
ఎంపిపి పాఠశాల,
మర్తాడు మెయిన్,
అనంతపురం.

బొమ్మరిల్లు





- దాసరి మన్విత బ్లెస్సీ,
1వ తరగతి,
సెయింట్ పాల్స్ ఇంగ్లీష్
మీడియం స్కూలు,
కోవూరు,
నెల్లూరు జిల్లా.







- వలిటి ప్రిన్స్ స్టాలిన్
4వ తరగతి,
క్విస్ స్కూలు,
ఒంగోలు,
ప్రకాశం జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

మీ కోసం



చిటికెడు పసుపుకు ఏదేని ఫేస్ పౌడర్ ఒక చెంచా కలుపుకోవాలి. ఈ మిశ్రమాన్ని వంటగదిలో ఉండే నూనె సీసాలు, పచ్చళ్ల జాడీలు, మొక్కల కుండీల మధ్య చల్లినట్లైతే చీమలు, ఈగలు చేరకుండా ఉంటాయి.

జీవన సౌరభం

మన ఆలోచనా సరళే.. మనం చేసే పనులను నిర్ణయిస్తుంది.

JEEVANA జీవన the family

శానిటరీ బ్యాంకు స్థాపించి ...



బీహార్‌లోని నవాడా జిల్లాలో హార్దియా గ్రామానికి చెందిన జ్యోతి కుమారి (21) చిన్నప్పటి నుంచి చురుకుగా సామాజిక కార్యక్రమాల్లో పాల్గొనేది. ఆ క్రమంలో పదో తరగతి చదువుతున్నప్పుడే పాపులేషన్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా సభ్యురాలుగా చేరింది. ఫౌండేషన్ చొరవతో ఓ బృందంగా ఏర్పడి గ్రామాల్లో కిశోరి (కౌమార) క్లబ్‌లను ఏర్పాటు చేసింది. లైంగిక సమస్యలపై పోరాడటంతో పాటు, మహిళల ఆరోగ్యం, హక్కులు సంబంధించిన సమస్యల గురించి తెలుసుకోవడం, చర్చించడం చేస్తూ ఉండేవారు. కరోనా తర్వాత బృందంలో మహిళల రుతుక్రమ సమస్యలపై చర్చ జరిగింది. రకరకాల అభిప్రాయాలు వచ్చాయి. గ్రామాల్లో మహిళలను అడిగి సమస్యలను తెలుసుకోవాలని నిర్ణయించుకున్నారు.

సవాళ్లను ఎదుర్కొని ...

ఆ క్రమంలో గ్రామాల్లో ఉన్న మహిళలను సమావేశపరిచి రుతుక్రమ సమస్యలపై మాట్లాడారు. కానీ ఆమెకు అవమానాలు ఎదురయ్యాయి. దాని గురించి బయటకు మాట్లాడటం ఏంటి? అంటూ చాలామంది ఆడవాళ్లు జ్యోతిని దుర్భాషలాడారు. 'అంటు, ముట్టు గురించి మగవాళ్లకు తెలిసేలా చర్చికోవాలా?' అని అవమానించారు. అయినా ఆమె వెనకాడలేదు. రుతు పరిశుభ్రతపై అవగాహన కల్పించేందుకు ప్రయత్నాలు సాగించింది. తర్వాత పాఠశాల్లో విద్యార్థులను కలిసి మాట్లాడినప్పుడు వారి నుంచి ఎన్నో ప్రశ్నలు ఎదురయ్యాయి. రుతుక్రమ సమయంలో తమ తల్లులు ఇంట్లోకి రానివ్వరని చెప్పారు. దేవుడు గుడి, పచ్చళ్ల జాడీలు, బీరువా, ఇతరుల బట్టలు తాకకూడదంటూ దూరం బెడుతున్నారని చెప్పుకుని బాధపడ్డారు. కడుపులో నొప్పి వచ్చినా మందులు కొని ఇచ్చేవారు కాదని చెప్పారు. ఇవన్నీ విన్న జ్యోతి బృందం ఆశ్చర్యపోయింది. అవన్నీ అపోహలని, శుభ్రత పాటిస్తే ఇటువంటి




రుతుక్రమం సమయంలో ప్యాడ్ వాడకుండా క్లాత్‌లు వాడుతున్న వారు ఉన్నారు. దాంతో సమస్యలు ఎదుర్కొంటున్న వారూ ఉన్నారు. ఆ సమయంలో సమాజం నుంచి ఎన్నో ఆంక్షలు ఎదుర్కొంటున్నారు. రకరకాల అనారోగ్య సమస్యలు తలెత్తున్నా నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఈ క్రమంలో జ్యోతి కుమారి తన బృందంతో కలిసి ఊరూరు తిరుగుతూ రుతుక్రమ పరిశుభ్రత గురించి అవగాహన కల్పిస్తోంది. ప్యాడ్స్ కొనలేని వారి కోసం శానిటరీ బ్యాంకే నడుపుతోంది. అంతేకాదు.. సామాజిక కార్యకర్తగా గ్రామాల్లో సమస్యలను పరిష్కరిస్తోంది.

నియమాలు పాటించక్కర్లేదని చెప్పారు. అలా పిల్లలకు జ్యోతి చాలా దగ్గరయ్యింది. కొంతమంది విద్యార్థులు వీరి కార్యకలాపాలు నచ్చి బృందంలో సభ్యులుగా చేరారు కూడా. గ్రామాల్లో బిడ్డతల్లులకు క్లాత్‌కు బదులు శానిటరి ప్యాడ్స్ వాడేలా కౌన్సిలింగ్ చేశారు. తద్వారా కొంతమంది ఆడవాళ్లలో మార్పు కనిపించింది. ఆడవాళ్ల రుతుక్రమ సమస్య ఇంట్లో అందరికీ తెలియాలని బృందం నిర్వహించే సెషన్లకు విద్యార్థుల తల్లిదండ్రులను పిలిచేవారు. వారికీ అవగాహన కల్పించారు. కొంతమంది నుంచి వ్యతిరేక అభిప్రాయాలు వచ్చాయి. అయినా జ్యోతి అవేమి పట్టించుకోలేదు. మరికొంత మంది సానుకూలంగా స్పందించారు. అప్పటి నుంచి ఇంట్లో మగవాళ్లే న్యాప్‌కీన్లు కొనుగోలు చేసి ఇంట్లో ఆడవాళ్లకు, పిల్లలకు ఇస్తున్నారు. ఇది మంచి పరిణామంగా బృందం గుర్తించింది.

న్యాప్‌కిన్‌ల తయారీ

కానీ కరోనా సమయంలో షాపుల్లో శానిటరీ ప్యాడ్స్ పంపిణీ నిలిచిపోయింది. దాంతో జ్యోతినే కలగజేసుకుని నగరం వెళ్లి శానిటరీ ప్యాడ్‌లను తీసుకువచ్చి అందరికీ అందజేసింది. 'ఇంట్లో మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే అందరూ బాగుంటారని' పదే పదే తన మాటల్లో వినిపించేది. లాక్‌డౌన్‌లో ఉపాధి లేక డబ్బులు లేవని చాలామంది ఆడవాళ్లు కొనుగోలు చేయలేదు. జ్యోతినే స్వంత ఖర్చుతో ఉచితంగా పంపిణీ చేసింది. కొన్నాళ్లకు ఇంటింటికి తిరిగి రూపాయి చందా అడుగుతూ వచ్చిన డబ్బుతో ప్యాడ్స్ కొని అందరికీ ఇచ్చింది. కొన్నాళ్లకు న్యాప్‌కిన్ల తయారీకి కృషి చేసింది జ్యోతి. పర్యావరణంలో భాగంగా స్థిరమైన క్లాత్‌ప్యాడ్‌లకు మారాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. వీటిని ఇంట్లోనే తయారుచేయడానికి 30 మంది సభ్యులు శిక్షణ కూడా తీసుకున్నారు. దాతల సహాయంతో కుట్టుమిషన్లు కొనుగోలు చేశారు. అప్పటినుంచి గుడ్డ ప్యాడ్‌లను తయారుచేస్తూ ఆదాయ వనరుగా సృష్టించు కున్నారు. దాంతో గ్రామంలో శానిటరీ బ్యాంక్‌ని ఏర్పాటు చేసి అవసరమైన న్యాప్‌కీన్‌లను మహిళలకు అందజేస్తుంది. ప్రభుత్వం అందుబాటు లోకి తెచ్చిన కుటుంబ నియంత్రణ, గర్భనిరోధక పద్ధతుల గురించి కూడా జ్యోతి తెలియజేస్తుంది.


21 ఏళ్ల జ్యోతి చెప్పే మాటలకు ప్రభావితమై రెండు గ్రామాలకు చెందిన 55 మంది విద్యార్థులు రెండు బృందాలుగా ఏర్పడ్డారు. ఊళ్లల్లో ఉన్న సమస్యలను పరిష్కరిస్తున్నాయి. ఏళ్ల తరబడి గ్రామంలో ఉన్న నీటి సమస్యను పరిష్కరించాలంటూ సభ్యులంతా రెండేళ్ల క్రితం పోరాటం చేశారు. అప్పుడు కూడా చాలామంది జ్యోతి చేసే పనిని వ్యతిరేకించారు. కానీ మహిళల ఐక్య సమూహంతో నిరసన చేసింది. కొన్ని రోజులకు అధికారులు స్పందించి ఇంటింటికి నీళ్ల కుళాయిలు ఏర్పాటుచేశారు. గతంలో ఆడపిల్లలు ఊరి బయటకు వెళ్లి చదువుకునే ధైర్యం చేసేవారు కాదు. కాని జ్యోతి బృందం సాయంతో నవాడలో నిర్వహిస్తున్న ఉచిత కంప్యూటర్ క్లాసులకు బాలికలు వెళుతున్నారు.



ఘనంగా ఆదిపురుష్ ప్రీరిలీజ్ ఈవెంట్

ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల యంగ్ రెబల్ స్టార్ ఫ్యాన్స్ అయితే ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న చిత్రం 'ఆదిపురుష్'. ఈ చిత్రం ప్రీరిలీజ్ ఈవెంట్ మంగళవారం సాయంత్రం జరిగింది. ఈ క్రమంలో హీరో ప్రభాస్ తిరుమలకు వచ్చారు. దాంతో అభిమానులు పెద్దఎత్తున తిరుమలకు చేరుకున్నారు. అయితే భారీ హంగులతో ఈవెంట్‌ని జరిపారు. దీనికి సుమారు రెండు కోట్లు ఖర్చు పెట్టినట్లు తెలుస్తుంది. భారీ హంగులతో, మేళతాళాలతో ఘనంగా కార్యక్రమం నిర్వహించారు. చిత్రానికి దర్శకుడు ఓంరౌత్ వర్క్ చేయగా కృతి సనన్ సీతగా, సైఫ్ అలీ ఖాన్ రావణాసుర పాత్రలో నటించారు. ఈ సినిమా ఈ జూన్ 16న రిలీజ్ కాబోతోంది.

'డోర్' ఫస్ట్ లుక్ విడుదల




డెబ్యూ డైరెక్టర్ జైదేవ్ తెరకెక్కిస్తున్న 'డోర్' చిత్రం నుండి ఫస్ట్ లుక్ విడుదలైంది. ఈ సినిమాలో భావన ప్రధాన పాత్రలో నటిస్తున్నారు. మంగళవారం ఆమె పుట్టినరోజు సందర్భంగా ఫస్ట్ లుక్ విడుదల చేశారు. సస్పెన్స్, థ్రిల్లింగ్ ఎలిమెంట్స్‌తో ఈ సినిమా రూపొందించినట్లు తెలుస్తోంది. హార్రర్ థ్రిల్లర్ జోనర్‌లో వస్తున్న ఈ చిత్రం ప్రస్తుతం షూటింగ్ దశలో ఉంది. గణేశ్ వెంకట్రామన్, జయప్రకాశ్, నంధు, శ్రీరంజిని కీలక పాత్రలు పోషిస్తున్నారు. 'జూన్ డ్రీమ్స్ స్టూడియో' బ్యానర్‌పై నవీన్ రాజన్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. మలయాళంతో పాటు తెలుగు, తమిళం, కన్నడ, హిందీ భాషల్లో ఈ చిత్రం విడుదల కానుంది. వరుణ్ ఉన్ని ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నాడు.



ఆల్బమ్ అదుర్స్

హీరో నితిన్, దర్శకుడు వెంకీ కుడుములతో కలిసి ఓ కొత్త ప్రాజెక్టు చేస్తున్నారు. 'విఎన్‌ఆర్‌టిఆర్ 10' పేరుతో తెరకెక్కుతుంది. వీరి కాంబినేషన్‌లో వచ్చిన 'భీష్మ' హిట్ అందుకున్న విషయం తెలిసిందే. అందుకనే హీరోయిన్ రష్మికా మందన్నా ఇందులోనూ నటిస్తోంది. ప్రస్తుతం మేకర్స్ సంగీత దర్శకుడు జివి ప్రకాష్‌తో ఓ సెన్సేషనల్ ఆల్బమ్ అయితే అందిస్తున్నట్టుగా తెలిపారు. ఈ నేపథ్యంలో జివి ప్రకాష్, సాహిత్య రచయిత కాసర్ల శ్యామ్ కలిసి మ్యూజికల్ సిట్టింగ్స్‌లో ఉన్న ఫొటోను ట్వీట్ చేశారు. కాసర్ల అందించిన లిరిక్స్ అద్భుతంగా ఉండగా, దానికి తగ్గట్టుగా జివి ప్రకాష్ ఇస్తున్న సంగీతం ఇంప్రెసివ్‌గా ఉందని మేకర్స్ అంటున్నారు.

23న ఓటీటీలో



అఖిల్ నటించిన 'ఏజెంట్' చిత్రం ఓటీటీ స్ట్రీమింగ్‌కు సిద్ధమైంది. జూన్ 23న సోనీలైవ్‌లో ప్రసారం కానున్నట్లు ఆ సంస్థ ప్రకటించింది. థియేటర్ వర్షన్‌కి కొన్ని మార్పులు చేసి మరీ ఈ సినిమాను ఓటీటీలో విడుదల చేస్తున్నట్లు సమాచారం. ఈ కారణంగానే గతంలో ప్రకటించిన విడుదల తేదీ వాయిదపడినట్లు తెలుస్తోంది. మమ్ముట్టి కీలకపాత్ర పోషించిన ఈ సినిమాలో అఖిల్ కు జోడీగా సాక్షీ వైద్య నటించింది.



చివరి దశలో షూటింగ్

రామ్ పోతినేని హీరోగా, డైరెక్టర్ బోయపాటి శ్రీను దర్శకత్వంలో ఔట్ అండ్ ఔట్ మాస్ యాక్షన్ ఎంటర్టైనర్ తెరకెక్కుతున్న సంగతి అందరికీ తెలిసిందే. ఈ చిత్రం షూటింగ్ ఫైనల్ షెడ్యూల్ మైసూర్‌లో జరుగుతుంది. ఇప్పటి వరకూ షూటింగ్ మొత్తం పూర్తయింది. కాగా, ఒక సాంగ్‌ను షూట్ చేయనున్నట్లు మేకర్స్ తెలిపారు. ఇది జూన్ 15వ తేది వరకు కొనసాగనుంది. శ్రీ లీల హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రాన్ని శ్రీనివాస సిల్వర్ స్క్రీన్ పతాకం పై నిర్మిస్తున్నారు. థమన్ సంగీతం అందిస్తున్నారు. అక్టోబర్ 20న ప్రపంచ థియేటర్లలో విడుదల కాబోతున్న ఈ చిత్రం పై భారీ అంచనాలు నెలకొన్నాయి.



'అనంత' ట్రైలర్ విడుదల

మధు బాబు దర్శకత్వంలో సైంటిఫిక్ థ్రిల్లర్‌గా 'అనంత' సినిమా తెరకెక్కుతోంది. ఈ సినిమాలో ప్రశాంత్ కార్తీ హీరోగా నటిస్తున్నాడు. గతంలో రామ్ గోపాల్ వర్మ రూపొందించిన కొండా చిత్రంలో ఆర్‌కె పాత్ర పోషించి ఆకట్టుకున్న ప్రశాంత్ ఈ సినిమాతో మరో డిఫరెంట్ క్యారెక్టర్‌తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. తాజాగా ఈ సినిమా నుండి ట్రైలర్ విడుదలైంది. మనిషి పుట్టిన మరు క్షణం నుంచే ఆ శరీరం మరణం వైపు ప్రయాణం చేస్తుంటుంది అనే డైలాగ్‌తో ట్రైలర్ మొదలైంది. ఇన్వెస్టిగేషన్‌తో పాటు థ్రిల్లింగ్ ఎలిమెంట్స్ టచ్ చేస్తూ ఈ ట్రైలర్‌ని రిలీజ్ చేశారు.

బ్యాటర్స్ రాణిస్తేనే..

నేటినుంచి ఆస్ట్రేలియాతో డబ్ల్యుటిసి ఫైనల్ మ్యాచ్

మధ్యాహ్నం 3.00గం.ల నుంచి



లండన్: వరుసగా రెండోసారి డబ్ల్యు టిసి ఫైనల్లోకి దూసుకొచ్చిన భారతజట్టు మరోసారి ఐసిసి టైటిల్ వేటలో నిలిచింది. ఈసారి ఫైనల్లో భారతజట్టు ఆస్ట్రేలియాతో ఢీ కొట్టనుంది. 10ఏళ్ల తర్వాత మరోదఫా ఐసిసి టైటిల్‌కు చేజిక్కించుకొనేందుకు భారత్‌కు మరోసారి సువర్ణావకాశం లభించింది. సౌథాంప్టన్ వేదికగా 2021 ఫైనల్లో భారత జట్టు న్యూజిలాండ్ చేతిలో 8వికెట్ల తేడాతో ఓటమిపాలై రన్నరప్‌గా నిలిచింది. ఈసారి శుభ్‌మన్ గిల్, విరాట్ కోహ్లి, పుజారా, రహానే, రోహిత్, జడేజా వంటి బ్యాటర్స్‌తో భారతజట్టు దుర్భేద్యంగా లో ఉంది. ఇక ఛతేశ్వర పుజారా ఇంగ్లండ్ కౌంటీల్లో మూడు సెంచరీలతో అదరగొట్టాడు. వికెట్ కీపర్ల కోటాలో ఆంధ్ర కుర్రాడు కేఎస్ భరత్ ముందు వరుసలో ఉండగా.. అదనపు బ్యాటర్ అవసరం అని మేనేజ్‌మెంట్ భావిస్తే.. ఇషాన్ కిషాన్‌కు చోటు కల్పించినా ఆశ్చర్యపోనక్కర్లేదు.

ప్రైజ్ మనీ..

డబ్ల్యుటిసి ఫైనల్ టైటిల్ విజేతగా ఐసిసి రూ.13కోట్ల రూపాయల ప్రైజ్ మనీని అందజేయనుంది. రన్నరప్‌గా నిలిచిన జట్టుకు రూ.6.5కోట్ల ప్రైజ్ మనీని ఇవ్వనున్నట్లు ఐసిసి ప్రకటించింది.

జట్లు..

భారత్: రోహిత్(కెప్టెన్), శుభ్‌మన్, పుజారా, కోహ్లి, రహానే, భరత్, అశ్విన్, జడేజా, అక్షర్, శార్దూల్, షమీ, సిరాజ్, ఉమేశ్, ఉనాద్కట్, ఇషాన్ కిషన్.

ఆస్ట్రేలియా: పాట్ కమిన్స్(కెప్టెన్), బోలాండ్, క్యారీ, గ్రీన్, హ్యారీస్, హేజిల్‌వుడ్, హెడ్, ఖవాజా, లబూషేన్, లియాన్, ఇంగ్లిస్, మర్ఫీ, స్మిత్, స్టార్క్, వార్నర్.

సెమీస్‌కు సబలెంకా, ముఛోవా

ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ




పారిస్: ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ మహిళల సింగిల్స్ సెమీఫైనల్లోకి ప్రపంచ 2వ ర్యాంకర్, బెలారస్‌కు చెందిన అర్యానా సబలెంకా ప్రవేశించింది. మంగళవారం జరిగిన క్వార్టర్‌ఫైనల్లో సబలెంకా 6–4, 6–4తేడాతో ఉక్రెయిన్‌కు చెందిన ఎలీనా స్విటోలీనాపై వరుససెట్లలో నెగ్గి కెరీర్‌లో తొలిసారి ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ సెమీస్‌కు చేరింది. సెమీస్‌లో సబలెంకా.. కరోలినా ముఛోవా(చెక్ రిపబ్లిక్)తో తలపడనుంది. మరో క్వార్టర్‌ఫైనల్లో ముఛోవా(చెక్ రిపబ్లిక్) 7–5, 6–2తో పొవెంచికోవా (రష్యా)పై సునాయాసంగా విజయం సాధించి సెమీస్‌కు చేరింది.

ఇక పురుషుల సింగిల్స్ సెమీఫైనల్లోకి 3వ సీడ్, సెర్బియాకు చెందిన జకోవిచ్ ప్రవేశించాడు.



క్వార్టర్స్‌లో జకోవిచ్ 4–6, 7–6(7–0), 6–2, 6–4తో 11వ సీడ్ ఖచనోవ్(రష్యా)పై చెమటోడ్చి నెగ్గాడు.



ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2023

ఎంట్రీలకు ఆహ్వానం

ప్రజాశక్తి దిన పత్రిక వ్యవస్థాపక సంపాదకులు మోటూరు హనుమంతరావు స్మృత్యర్థం పాత్రికేయ రంగంలో ఉత్తమ కృషి చేసిన జర్నలిస్టులను సత్కరించేందుకు ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డును నెలకొల్పి రెండు దశాబ్దాలు కావస్తున్నది. కోవిడ్ మహమ్మారి కారణంగా 2020, 2021 సంవత్సరాల్లో మినహా ప్రతి యేటా క్రమం తప్పకుండా ఈ పురస్కారాన్ని ప్రజాశక్తి సాహితీ సంస్థ అందజేస్తూ వస్తున్నది. 2023 సంవత్సరానికి ఉత్తమ జర్నలిస్టు అవార్డు కోసం ఎంట్రీలను ఆహ్వానిస్తున్నది. సీనియర్ సంపాదకులు తెలకపల్లి రవి అధ్యక్షతన నాగార్జున యూనివర్సిటీ జర్నలిజం విభాగం అధిపతి ప్రొఫెసర్ జి అనిత, సీనియర్ జర్నలిస్టు నల్లి ధర్మారావులతో కూడిన త్రిసభ్య కమిటీ ఈ ఏడాది అవార్డు కోసం **ఏదేని ప్రజా సమస్యపై రాసిన క్షేత్ర స్థాయి వార్తా కథనాలను, ఫీచర్స్‌ను ఎంట్రీలుగా ఆహ్వానించాలని నిర్ణయించింది. 2022 మే 1నుంచి 2023 ఏప్రిల్ 30లోపు తెలుగు దిన పత్రికల్లో, స్పెషల్స్‌లో ప్రచురితమైన వార్తా కథనాలు, ఫీచర్స్ మాత్రమే పంపాలి.** ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన జర్నలిస్టులు ఎంట్రీలు పంపవచ్చు. ఎంట్రీతోపాటు ఇది నా సొంత రచన, ఎవరినీ అనుకరించినది కాదు అని స్వీయ ధ్రువీకరణ పత్రం ఒకటి జతచేసి పంపాలి. తమకు నచ్చిన మంచి సమస్యాత్మక కథనాన్ని ఇతరులైనా పంపవచ్చు. అచ్చయిన తేదీ, ఎడిషన్ వివరాలు జత చేయాలి. ఒక్కొక్కరు ఒకటి లేదా రెండు వార్తాకథనాలను మాత్రమే పంపాలి. ఎంట్రీలు 2023 జూన్ 10 కల్లా మాకు అందేట్లు చూడాలి. కవర్‌పై 'ఎం హెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు–2023 కోసం' అని స్పష్టంగా పేర్కొనాలి. ఇ–మెయిల్ ద్వారా కూడా పంపవచ్చు. అవార్డు విజేతకు 2023 జూన్ మూడవ వారంలో పుట్టపర్తిలో జరిగే ఎంహెచ్ స్మారకోపన్యాస సభలో జ్ఞాపిక, రూ.10 వేలు నగదు ఇచ్చి సముచిత రీతిలో సత్కరించడం జరుగుతుంది.

ఎం వి ఎస్ శర్మ, కార్యదర్శి,
ప్రజాశక్తి సాహితీ సంస్థ

ఎంట్రీలు పంపాల్సిన చిరునామా : కార్యదర్శి , ప్రజాశక్తి సాహితీ సంస్థ, ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, తాడేపల్లి, గుంటూరు జిల్లా, పిన్: 522501. ఇ-మెయిల్ అడ్రస్: psmhaward@gmail.com

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68